ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక


# వార్త

తిరుపతి

: fb.com/vaartha Digital

Published from Tirupathi,Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

14-6-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 134 పేజీలు: 10+4 వెల: 8.00

**శత్రు మిస్సైళ్లను ఎదుర్కొనే రక్షణ వ్యవస్థ**

యాంటీ షిప్ మిస్సైళ్లను ఢీకొట్టే టెక్నాలజీని పరీక్షించిన డిఆర్‌డిఓ

5లో


# ఇక భారీ టూరిజం ప్రాజెక్టులు

**పెట్టుబడులకు ముందుకు వస్తున్న జాతీయ, అంతర్జాతీయ సంస్థలు**

**రాజమండ్రి సహా వివిధ ప్రాంతాల్లో మరిన్ని హోం స్టేలు**

**అరకు, చింతపల్లి సహా 1015 చోట్ల కారవాన్ పార్కులు**

**టెంపుల్ టూరిజానికి మరింత ప్రోత్సాహం: సిఎం చంద్రబాబు**



**విజయవాడ, జూన్ 13 తర్వాత వార్త ప్రతినిధి :** రాష్ట్రం టూరిజం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఎపి పర్యాటక పాలసీతో టూరిజం రంగంలో తీసుకుని వచ్చిన మార్పులకు గుర్తింపు లభించిందన్నారు.ఈ రంగంలో పెట్టుబడులకు జాతీయ. అంతర్జాతీయ సంస్థలు ముందుకు వస్తున్నాయన్నారు. పెరుగుతోన్న పర్యాటకుల ఫుట్ ఫాల్‌కు అనుగుణంగా ఎపిలో హోటల్ గదులు, హోం స్టేలను త్వరితగతిన అందుబాటులోకి తీసుకొని వస్తున్నామని తెలిపారు. 2029 నాటికి రాష్ట్రంలో 50 వేల హోటల్ గదుల నిర్మాణం లక్ష్యాన్ని చేరుకోవాలని సిఎం చెప్పారు వివిధ పర్యాటక ప్రాంతాల్లో 10 వేలకు పైగా హోం స్టేలు కూడా అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు. హోంస్టేలను అందుబాటు లోకి తీసుకువచ్చే అంశంపై ఎలాంటి పరిమితీ లేదని వివరించారు. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డులో ఆమోదం తెలియజేసిన టూరిజం ప్రాజెక్టులు వేగంగా ఏర్పాటు అయ్యేలా చూస్తామన్నారు. రాష్ట్రంలోని వివిధ పర్యాటక ప్రాంతాలు, నగరాల్లో జాతీయ, అంతర్జాతీయ హోటల్ బ్రాండ్లు వచ్చేలా చూడాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. గోదావరి పుష్కరాల నాటికి కూడా రాజమహేంద్రవరం సహా వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున హోం స్టేల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు.

హోంస్టేల నిర్వహణకు సంబంధించి రేటింగ్ కూడా పెట్టాలని ఆదేశించినట్లు సీఎం చంద్రబాబు సిఎంవో విడుదల చేసిన ప్రకటనలో వివరించారు. రెండేళ్ల కూటమి ప్రభుత్వంలో టూరిజంశాఖ ప్రగతిని వివరించారు. ఈ శాఖ నిర్వహిస్తున్న మంత్రి కందుల లక్ష్మీ దుర్గేష్ కుమార్ అభినందించారు. అరకు, చింతపల్లి, ముంచింగిపుట్టు, గాంధీవనం, మారేడుమిల్లి తదితర ప్రాంతాలతో పాటు కనీసం 1015 ప్రాంతాల్లో కారావాన్ పార్కులను ఏర్పాటు చేయాలని సూచించారు. కారావాన్లను పార్కింగ్ చేసుకుని కుటుంబంతో సురక్షితంగా ప్రకృతిని ఆస్వాదించేలా ఆయా పార్కుల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఎక్స్ పీరియన్స్ కేంద్రాల వద్ద కూడా ఈ తరహా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. తిరుపతి, విశాఖలలో అమ్యూజ్ మెంట్ పార్కుల ఏర్పాటుకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సిఎం సూచనలు జారీ చేశామన్నారు.

అటవీ, దేవాదాయ శాఖల సమన్వయంతో ఎకో, టెంపుల్ టూరిజానికి ప్రోత్సాహం ఇచ్చేలా ప్రాజెక్టులు చేపట్టాలని సిఎం పేర్కొన్నారు. ప్రసాద్, స్వదేశ్ దర్శన్ పథకాల కింద వివిధ దేవాలయాలు, దర్శనీయ స్థలాల అభివృద్ధికి చేపట్టిన ప్రాజెక్టులను 2026 మే నాటికి సిద్ధం చేయాలని అన్నారు. దీనికి సంబంధించి మరో రూ.663 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్టు వివరించారు. గండికోట, సూర్యలంక, అరకు బొర్రా గుహలు తదితర ప్రాంతాలను ప్రముఖ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలన్నారు. గోదావరి పుష్కర ఘాట్‌ను ఆగస్టు నాటికి, హావ్ లాక్ బ్రిడ్జిపైకి పర్యాటకులను అనుమతించేలా ఈ ఏడాది డిసెంబరు నాటికి పనులు పూర్తి చేయానే సంకల్పంతో ఉన్నట్లు సిఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యే

>>2



# వార్‌కు ఫుల్‌స్టాప్!

**జెనీవాలో ఇరాన్, అమెరికా శాంతి ఒప్పందానికి అంతా సిద్ధం**

**ఉభయ పక్షాల మధ్య తుది దశకు చర్చలు**

**ఒప్పందం ఖాయమన్న పాక్ ప్రధాని షరీఫ్**

**ఇస్లామాబాద్, జూన్ 13:** దాదాపు 3 నెలలకుపైగా పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలకు ముగింపు కార్డు పడుతోంది. స్విట్జర్లాండ్ రాజధాని జెనీవా వేదికగా ఒప్పందంపై అమెరికా, ఇరాన్, ఇజ్రాయెల్ ప్రతినిధులు సంతకాలు చేస్తారన్న సమాచారం వెలుగులోకి వచ్చింది. దీనికితోడు ట్రంప్ కూడా తన ట్రూత్‌పోస్టులో ఐరోపాదేశాల్లోనే ఒప్పందం జరుగుతుందని కూడా ధృవీకరించారు. ఇపుడు తాజాగా పాక్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ అమెరికా ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం మరో 24 గంటల్లో ఖరారయ్యే అవకాశం ఉందని పాకిస్థాన్ ప్రకటన చేసారు. అమెరికా ఇరాన్ మధ్య

>>2

# పెట్టుబడులు లక్ష్యంగా నేడు సింగపూర్‌కు సిఎం చంద్రబాబు



సింగపూర్ సెక్రటేరియట్

**సిఐఐ రోడ్‌షోలో పాల్గొననున్న సిఎం**

**సింగపూర్ ప్రధాని, మంత్రులు, పారిశ్రామిక వేత్తలతో వరుస భేటీలు**

**విజయవాడ జూన్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు రోజుల పాటు సింగపూర్‌లో పర్యటించనున్నారు. 14 తేదీ ఉదయం 11.35 గంటలకు బెంగళూర్ నుంచి సిఎం సింగపూర్ బయల్దేరి వెళ్లనున్నారు. సింగపూర్ చేరుకున్న అనంతరం 15వ తేదీన సింగపూర్ కాలమానం ప్రకారం ఉదయం 10.30 గంటలకు ఆ దేశంలోని భారత హై కమిషనర్ శిల్పక్ అంబులేతో మొదటగా సిఎం సమావేశం అవుతారు. పర్యటనలో తొలిరోజు స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులతో జరిగే రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సుకు సిఎం హాజరవుతారు. అనంతరం యూఎన్ హాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనాక్లాడియా రాస్ బాచ్‌తో విందు సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. సింగపూర్ సీనియర్ మంత్రి లో యెన్ లింగ్‌తో సమావేశం అవుతారు. తర్వాత గూగుల్ క్లౌడ్ ఏపీఏసీ అధ్యక్షుడు కరణ్ భజ్వా, జిఐసి ఎగ్జిక్యూటివ్ కమిటీ అడ్వైజర్ లిమ్ సియాంగ్ గౌన్‌తో చర్చిస్తారు. వైసీహెచ్ లాజిస్టిక్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రాబర్ట్ యాప్‌తోనూ, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ టాన్ యెంగ్ చెయ్‌తో భేటీ అవుతారు. సింగపూర్ ప్రధానమంత్రి లారెన్స్ వాంగ్‌తోనూ పలు అంశాలపై చర్చిస్తారు. సింగపూర్ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తోనూ భేటీ అవుతారు. సిఐఐ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి బృందంతోనూ సమావేశం అవుతారు. హోం మంత్రి కె షణ్ముగమ్, మానవ

>>2

**వైజాగ్ విషాదం**

# స్టీల్‌ప్లాంట్ ఘటనలో మరొకరి మృతి

**పదికి చేరిన మృతుల సంఖ్య**



**విశాఖపట్నం (గాజువాక), జూన్ 13, ప్రభాతవార్త:** వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో ఇటీవల జరిగిన ఘోర ప్రమాదం మరో కుటుంబంలో విషాదాన్నినింపింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడు సూరిబాబు శనివారం మృతి చెందడంతో ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 10కి చేరింది.ప్రమాదం జరిగినప్పటి నుంచి తీవ్ర గాయాలతో విశాఖపట్నంలోని సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సూరిబాబు ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వైద్యుల ప్రయత్నాలు ఫలించక కన్నుమూశారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. సూరిబాబు భార్య

>>2

# 'చిన్నారి అదృశ్యం'పై వీడని మిస్టరీ

**కేసుకు ఆధారంగా ఉన్న పెంపుడు కుక్క మృతి**

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్ 13,ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా తుని మండలం దొండవాక పంచాయతీ పరిధిలోని సిహెచ్ అగ్రహారం గ్రామంలో ఈనెల 6వ తేదీన మూడేళ్ల చిన్నారి సుంకర జ్ఞానేశ్వరి (జాహ్నవి) అదృశ్యమైన సంఘటన మిస్టరీగా మారింది. అగ్రహారం గ్రామంలో కొండను ఆనుకుని ఉన్న పామాయిల్ తోటలో కాపలాదారుగా ఉంటున్న సుంకర గణేష్, భవాని దంపతుల కుమార్తె జ్ఞానేశ్వరి. అదే పామాయిల్ తోటలో గణేష్ కుటుంబం నివాసం ఉంటుంది. చిన్నారి జ్ఞానేశ్వరి ఆడుకుంటూ పెంపుడు కుక్కతో సహా ఈనెల 6వ తేదీన అదృశ్యమైంది. ఈ సంఘటనపై నమోదైన కేసులో భాగంగా చిన్నారి కోసం పోలీసులు అప్పటినుండ గాలింపు చర్యలు మొదలు పెట్టారు. నిర్విరామంగా పోలీసులు పాపకోసం గాలింపు చర్యలు చేపడుతున్నా ఎటువంటి ఆధారం లభించలేదు. మూడు రోజుల తర్వాత చిన్నారితో పాటు అదృశ్యమైన పెంపుడు కుక్క చిన్నచిన్న గాయాలతో తిరిగి ఇంటికి చేరుకుంది. దీంతో పోలీసులు,కుటుంబ సభ్యులు కుక్క ద్వారా పాప ఆచూకీ లభిస్తుందని భావించారు. ఇంటికి వచ్చిన కుక్క ప్రవర్తన భిన్నంగా ఉండడంతో పోలీస్ అధికారులు వెటర్నరీ వైద్యులతో కుక్కకు వైద్య సేవలు అందించారు. కుక్క సాధారణ స్థితికి వచ్చిన తర్వాత సాంకేతిక నిపుణుల సహకారంతో పోలీసులు కుక్క మెడకు జిపిఎస్ ట్రాకర్‌ని అమర్చి వదిలిపెట్టారు.

జిపిఎస్ ట్రాకర్ ఆధారంగా కుక్క వెళ్లిన ప్రాంతాలలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినా పాపకు సంబంధించి ఎటువంటి ఆచూకీ లభించకపోవడంతో చిన్నారి మిస్సింగ్ కేసు మిస్టరీగా మారింది. పోలీసులు చిన్నారి అదృశ్యం కేసును చేదించేందుకు ఆధారంగా భావించిన ట్రాకర్ అమర్చిన పెంపుడు

>>2

# కార్మిక సంక్షేమంలో సంస్కరణలు



**పారిశ్రామిక భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం**

**డిజిటల్, ఇఎస్ఐ వైద్యసేవల విస్తరణ**

**నిర్మాణ కార్మికులకు పలు సంక్షేమ పథకాలు**

**- మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడి**

**విజయవాడ,జూన్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా సామాజిక బాధ్యతగా, అభివృద్ధి లక్ష్యంగా భావించి పనిచేస్తోందని రాష్ట్ర కార్మిక, ఫ్యాక్టరీలు, బాయిలర్లు. ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు.సిఎం చంద్రబాబు సహకారంతో కార్మిక శాఖతో సహా తమ పరిధిలోని మంత్రిత్వ శాఖలన్ని అభివృద్ధి దిశలో అడుగులు వేస్తున్నాయన్నారు. రాష్ట్ర అభివృద్ధి పునాదులు కార్మికుల శ్రమతోనే నిర్మితమవుతాయని, అందువల్ల కార్మిక సంక్షేమం, సామాజిక భద్రత, ఆరోగ్య రక్షణ, నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక భద్రత వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రెండేళ్లకాలం తమ పరిధిలోని మంత్రిత్వశాఖలపై మంత్రి ఒక సమాచార పత్రం విడుదల చేసారు. గత రెండేళ్లలో కార్మిక శాఖలో చేపట్టిన సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలు, డిజిటల్ సేవలు, నిర్మాణ కార్మిక సంక్షేమ చర్యలు, ఇఎస్ఐ వైద్య సేవల విస్తరణ, పారిశ్రామిక భద్రతా కార్యక్రమాల పురోగతిని వివరించారు.

ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కార్మిక సంక్షేమ వ్యవస్థను పునరుద్ధరించేందుకు చర్యలు ప్రారంభించిందన్నారు. నిర్మాణ కార్మికుల కోసం నిలిచిపోయిన సంక్షేమ పథకాలను మళ్లీ ప్రారంభించడమే కాకుండా వాటిని మరింత బలోపేతం చేసే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గతంలో నిలిచిపోయిన భవన. ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను ప్రభుత్వం మార్చి 2026 నుండి పునరుద్ధరించిందన్నారు. వివాహ బహుమతి రూ..20,000, ప్రసూతి ప్రయోజనం రూ..20,000, సహజమరణ సహాయం రూ.60, 000, అంత్యక్రియల ఖర్చులు రూ.20,000 చొప్పున అందజేస్తోందన్నారు. ఈ మొత్తాలను మరింత పెంచే ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయన్నారు. అన్ని ప్రయోజనాలను ఆధార్ ఆధారిత డిబిటిద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే విధానం అమలు చేయడం ద్వారా పారదర్శకతను తీసుకురావడం జరిగిందన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం 2024-25లో రూ.675.39 కోట్లు, 2025-26లో రూ.733.19 కోట్లు, మొత్తంగా రూ.1,408.58 కోట్లు సెస్ వసూలు చేయడం జరిగిందన్నారు. ఈ నిధులను కార్మికుల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, సామాజిక భద్రతా కార్యక్రమా

>>2



శనివారం తడవద్ద దగ్ధమవుతున్న బస్సు

# కార్మికుల బస్సు దగ్ధం

**తప్పిన ప్రాణాపాయం**

**తడ, జూన్ 13 ప్రభాతవార్త:** శ్రీసిటీ కార్మికులు ప్రయాణిస్తున్న బస్సు తిరుపతి జిల్లా తడ పట్టణ సమీపంలోని జీరో పాయింట్ వద్ద అగ్నికి ఆహుతైంది. శనివారం ఉదయం 8 గంటల సమయంలో శ్రీ సిటీ ఐఎంఒపి పరిశ్రమకు చెందిన ఎస్‌బిఎల్‌టి ప్రవేట్ ట్రావెల్ బస్సు కార్మికులను ఎక్కించుకొని వెళుతున్న సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో డ్రైవర్ అప్రమత్తమయ్యాడు. కార్మికులు బస్సు దిగిపోవడంతో ఎలాంటి ప్రాణ నష్టంజరగలేదు. షార్ట్‌సర్క్యూట్ కారణంగా బస్సులో మంటలు చెలరే

>>2

# కూలిన విమానం



**ఐదుగురు మృతి**

**గౌహతి, జూన్13:** అస్సాంలోని జోర్హాట్ వైమానిక స్థావరంలో విమాన ప్రమాదం చోటుచేసుకుంది. భారత వైమానిక దళానికి చెందిన రవాణా విమానం ఎయిర్‌బేస్ లోపల ల్యాండ్ అవుతుండగా మంటలు చెలరేగడంతో కూలిపోయింది. ఈ ఘటనలో వాయుసేనకు చెందిన ఐదుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని ఐఎఎఫ్ అధికారులు వెల్లడించారు. తీవ్రంగా గాయపడిన కో పైలట్‌కు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు అత్యున్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్లు అధికారులు పేర్కొన్నారు. మృతులను స్క్వాడ్రన్ లీడర్ ప్రశాంత్ సింగ్, ఫ్లైట్ లెఫ్టినెంట్ శుభమ్ కుమార్, సార్జెంట్ జితేంద్ర శర్మ, అగ్నివీర్‌కు చెందిన ఖేమరామ్ కుమావత్, డానిష్, ఆలమ్‌గా గుర్తించారు. విమాన ప్రమాదంలో వాయుసేనకు చెందిన అయిదుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోవడంపై రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన వాయుసేన యోధుల కుటుంబాలకు అండగా ఉంటామని పేర్కొన్నారు. దేశానికి వారు అందించిన సేవలను ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటామన్నారు. ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

**కొత్త ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్‌సేథ్**

5లో

# వర్షంతో రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

**అనంతపురం జిల్లాలోని పలు మండలాల్లో వర్షాలు**

**తుంగభద్ర రిజర్వాయర్ ఎగువ భాగంలో వానలు నిల్!**

**ఎల్‌నినో ప్రభావంతో రైతుల్లో కొనసాగుతున్న ఆందోళన**

**అనంతపురం, జూన్ 13 ప్రభాతవార్త బ్యూరో:** ఈ యేడాది ఎలినినో సూపర్ ఎలినినోగా మారి ఉష్ణోగ్రతలు పెరుగుతాయని, తద్వారా రుతు పవనాలకు ఆటంకాలు ఏర్పడుతాయని, తద్వారా వర్షాలు తగ్గే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు అభిప్రాయ పడుతున్న నేపథ్యంలో రైతుల్లో ఎక్కడో తెలియని ఆందోళన నెలకొంది. ఎక్కువ పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేస్తే ఫలితం ఉంటుందా లేదా అనే సందిగ్ధ పరిస్థితి వెనుకబడిన అనంతపురం జిల్లాలో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ పరిస్థితుల్లో రెండు రోజులుగా ఆకాశం మేఘామృతం కావడం, అడపాదడపా వర్షాలు వస్తుండటం, కొన్ని మండలాల్లో ఎక్కువ వర్షపాతం నమోదు కావడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఈ యేడాది కూడా వర్షాలు వస్తాయన్న ఆశతో ఎక్కువ పెట్టుబడితో పంటలు సాగు చేసేందుకు, సేద్యం పనులు చేసుకునేందుకు రైతులు సిద్దం అవుతున్నారు. ప్రభుత్వం సబ్సిడి విత్తన వేరుశనగ విత్తనాలను కూడా పంపిణీకి సిద్ధం కావడంతో రైతుల్లో ఉత్సాహం వస్తోంది. శుక్రవారం రాత్రి అనంతపురం జిల్లాలో వివిధ మండలాల్లో వర్షాలు పడ్డాయి. వర్షాలు పడటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పామిడిలో 84.6, పెద్దవడుగూరు 44.8, యాడికిలో 44.2, పెద్దపప్పూరులో 40.4, బొమ్మనహాళ్‌లో 40.2, అనంతపురం రూరల్‌లో 36, అనంతపురం అర్బన్‌లో 30.2, కుందుర్పిలో 28.2, బుక్కపట్నంలో 27.00, కణేకల్లు, కళ్యాణదుర్గంలో 21 చొప్పున, శింగనమలలో 20.8 మి.మీ వర్షం కురిసింది. అదే విధంగా మడకశిరలో 74.6, రొళ్లలో 57.4, రొద్దంలో 53.6, 53.2 లేపాక్షి, సోమందేపల్లిలో 52.2, చిలమత్తూరులో 43.6, హిందూపురంలో 42.6, పరిగిలో 36.4, నల్లమాడలో 32, గుడిబండలో 31.2, పెనుకొండలో 19.6 మి.మీ వర్షం కురిసింది. ఇదే విధంగా మరో వారం రోజులు అన్ని మండలాల్లో వర్షాలు పడాలని రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు. తాడిపత్రి, గుత్తి, వజ్రకరూరు, యల్లనూరు, యాడికి, కళ్యాణదుర్గం, శింగనమల, గార్లదిన్నె, రాప్తాడు, రాయదుర్గం, నార్పల, గుంతకల్లు లాంటి మండలాల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి అనుకున్న స్థాయిలో వర్షాలు పడలేదని తెలుస్తోంది.

**ఒట్టి కుండలా తుంగభద్ర రిజర్వాయర్ :**

ఆంధ్ర-కర్ణాటక ఉమ్మడి ప్రాజెక్టు అయిన తుంగభద్ర జలాశయం ఎగువ ప్రాంతమైన అగుంబే, తీర్థహల్లి తదితర ప్రాంతాల్లో ఈ సమయంలో భారీ వర్షాలు పడేవి. కర్ణాటకలోని పశ్చిమ కనుమల్లో విస్తారంగా భారీ

>>2



శనివారం అగర్తలలో శాంతినికేతన్ మెడికల్ కాలేజీలో ఒక మహిళా ఉద్యోగిని హత్యచేసారన్న ఆరోపణపై నిరసన తెలుపుతున్న సిఐటియు మద్దతుదారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

# మరొకరి మృతి

>> కుమారుడు లోకేష్, కుమార్తె ప్రమీలతో కలిసి పెదగంట్యాడ మండలం సీతానగరం గ్రామంలో నివాసం ఉంటున్నారు. కుటుంబానికి ప్రధాన ఆధారంగా ఉన్న సూరిబాబు మృతితో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది.మృతదేహం గ్రామానికి చేరుకోవడంతో సీతానగరం గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. గ్రామస్తులు, బంధువులు పెద్దసంఖ్యలో కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ ధైర్యం చెబుతున్నారు.వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో వరుసగా ప్రాణనష్టాలు చోటుచేసుకోవడం కార్మిక వర్గాలను కలచివేస్తోంది. ఇప్పటికే తొమ్మిదిమంది ప్రాణాలు కోల్పోగా, సూరిబాబు మృతితో ఆ సంఖ్య పది మందికి చేరింది. ఈ ఘటనపై కార్మిక సంఘాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబాలకు తగిన పరిహారం అందించడంతో పాటు భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా కఠిన భద్రతాచర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాయి. వైజాగ్ ఉక్కు కర్మాగార చరిత్రలో ఈ ప్రమాదం విషాదకర అధ్యాయంగా నిలవగా, మరో కార్మికుడి మృతి కార్మిక కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.

# కార్మికుల బస్సు దగ్ధం

>> గాయి. కొద్ది సమయంలోనే బస్సు అగ్నికి ఆహుతి అయింది. దట్టమైన మంటలు కమ్ముకోవడంతో తడ పరిసర ప్రాంతాల ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. ఎస్సై కొండప్ప నాయుడు వారి సిబ్బంది సమస్యను అదుపులోకి తీసుకొచ్చారు. తరచూ అపాచీ, శ్రీ సిటీపరిశ్రమల బస్సులు ప్రమాదాలు జరుగుతుండడంతో కార్మికులు భయాందోళనలకు గురవుతున్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల యాజమాన్యం ఇష్టమొచ్చిన రీతిలో నాణ్యతా ప్రమాణాలు లోపించిన కాలం చెల్లిన బస్సులు నడపడం అవగాహన అనుభవం లేని డ్రైవర్లతో వాహనాలు నడిపించడం వల్లే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు బస్సుల నాణ్యత ప్రమాణాలపై దృష్టి సారిస్తే లైసెన్సులు లేకుండా బస్సులు నడుపుతున్న డ్రైవర్లపై బస్సుల యాజమాన్యంపై చర్యలు చేపట్టితే ప్రమాదాలు అరికట్టే అవకాశం ఉందని ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని ప్రయాణించవలసిన పరిస్థితి ఏర్పడిందని కార్మికులు స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

# సింగపూర్‌కు సిఎం చంద్రబాబు

>> వనరుల శాఖ మంత్రి టాన్ సీ లెంగ్‌తో చివరిగా భేటీ అవుతారు. రెండవ రోజు పర్యటనలో భాగంగా 16వ తేదీ ఉదయం కాకతీయ కల్చరల్ అసోసియేషన్ సిబిఎన్ 361ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. ఏపీఏసీ సెమికండక్టర్ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. సుర్బానా జురాంగ్‌అమరావతి ప్లానింగ్ సమావేశానికి హాజరవుతారు. అనంతరం సింగపూర్ ఉప ప్రధానమంత్రి, వాణిజ్య మంత్రి గాన్ కిమ్ యాంగ్ బృందంతో సమావేశం అవుతారు. తర్వాత 'వరల్డ్ సిటీస్ సమ్మిట్' లీడర్షిప్ ప్లీనరీలో పాల్గొని ప్రసంగిస్తారు. తర్వాత వరల్డ్ సిటీస్ సమ్మిట్ ఎగ్జిబిషన్ సందర్శిస్తారు. సింగపూర్ పెవిలియన్, ఇన్నోవేటర్ల అలయ్, గూగుల్ టెక్నాలజీస్ స్టాల్స్ ప్రధానంగా పరిశీలిస్తారు. సీట్రియమ్ సమావేశంలోనూ పాల్గొంటారు. పర్యటనలో చివరిగా సీఐఐ పార్టనర్షిప్ సమ్మిట్ 2026 బిజినెస్ రోడ్ షోలో పాల్గొంటారు. సింగపూర్ పర్యటనకు ముఖ్యమంత్రి వెంట పురపాలక శాఖ మంత్రి నారాయణ, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్, ఇడిబి సిఇఒ షన్మోహన్, సిఆర్‌డిఏ అధికారుల బృందం కూడా వెళ్లనుంది. రాజధాని అమరావతి నిర్మాణ ప్రాజెక్టులు సహా రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు సిఎం బృందం సింగపూర్‌లో పర్యటించనుంది. 16 తేదీ రాత్రి 10 గంటలకు ముఖ్యమంత్రి స్వదేశానికి తిరిగి రానున్నారు.

# వీడని మిస్టరీ

>> కుక్క శనివారం మృతి చెందడంతో కుటుంబ సభ్యులలో ఆందోళన మరింత పెరిగి పాప కోసం కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కాకినాడ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పెద్దాపురం ఎస్డిపిఓ తిలక్ నేతృత్వంలో తుని రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. చెన్నకేశవ రావు ఆధ్వర్యంలో తుని రూరల్ ఎస్సై కృష్ణమాచారి, కోటనందూరు ఎస్సై టి. రామకృష్ణ, తొండంగి ఎస్సై జగన్మోహన్‌తో పాటు పెద్దాపురం డివిజన్ పరిధిలోని పోలీస్ యంత్రాంగం వారం రోజులుగా చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఎటువంటి ఫలితం లేకపోవడం తో పాప కుటుంబ సభ్యులు, పోలీసులు విస్మయం చెందుతున్నారు. ఎస్‌డిఆర్ఎఫ్, ఫైర్ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ సుమారు 300 మంది పోలీసులు చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. డ్రోన్స్,డాగ్ స్క్వాడ్‌తో కొండలను,తోటలను జల్లెడ పట్టిన పోలీసులు కిడ్నాప్ కోణంలో కూడా దర్యాప్తు వేగవంతం చేస్తున్నారు. అందుబాటులో ఉన్న సిసి కెమెరాల పుటేజీ పరిశీలించారు. తుని బస్టాండ్, రైల్వే స్టేషన్, నర్సీపట్నం రోడ్డు తదితర ప్రాంతాల్లో సైతం పోలీసులు గాలిస్తున్నారు. ఎనిమిది రోజులు గడుస్తున్న చిన్నారి మిస్సింగ్‌కు సంబంధించి ఒక్క ఆధారం లభించకపోవడంతో పాప క్షేమంగానే ఉంటుందా అనే కోణంలో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది . ఏది ఏమైనా ప్రజల ప్రార్థనలు, పోలీసుల శ్రమ ఫలించి చిన్నారి తల్లి జ్ఞానేశ్వరి క్షేమంగా అమ్మ ఒడికి చేరాలని కోరుకుందాం.

## చిన్నారి అదృశ్యం ఘటనపై డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఆరా

**విజయవాడ.జూన్ 13,ప్రభాతవార్త ప్రతినిధి:** తుని మండలంలో చిన్నారి అదృశ్యం ఘటనపై డి.సిఎం పవన్ ఆరా తీశారు. ఈ మేరకు కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌తో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాల సేవలు కూడా వినిగియోగించుకోవాలని పవన్ తెలిపారు. అటవీశాఖ, బేస్‌క్యాంప్ వాచర్స్, నిపుణుల సాయం తీసుకోవాలని చెప్పారు. పాప ఆచూకీ కోసం 400 మంది సిబ్బంది గాలిస్తున్నట్లు ఎస్పీ బిందుమాధవ్, పవన్‌కు వివరించారు. అత్యాధునిక డ్రోన్లతో గాలింపు జరుపుతున్నామని తెలిపారు. చిన్నారి ఇంటి పరిసరాల్లో 38 సిసి కెమెరాల ఫుటేజ్ పరిశీలించామని చెప్పారు. ఈ క్రమంలోనే దర్యాప్తు మరింత వేగవంతం చేయాలన్న డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఎస్పీని ఆదేశించారు.

# ఇక భారీ టూరిజం ప్రాజెక్టులు

>> కంగా ఓ బోర్డు లేదా కమిటీ ఏర్పాటు చేసి ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్లాలని సీఎం నిర్ణయించామన్నారు. ఆ క్రమంలో కార్యాచరణ చేపట్టామన్నారు.. పర్యాటకశాఖ, అటవీ, దేవాదాయ, పోలీసు, మెరైన్ ఇలా వేర్వేరు శాఖల సమన్వయం కోసం సిఎస్ ఆధ్వర్యంలో దీనిని ఏర్పాటు చేసి కార్యాచరణ సాగిస్తుందన్నారు.స్పష్టం చేశారు. హౌస్ బోట్లు, హెలీ టూరిజంతో పాటు ఉడాన్ పథకం కింద సీ ప్లేన్‌లను కూడా ప్రోత్సహించాలని అన్నారు. విశాఖ, విజయవాడ, శ్రీశైలం, గండికోట, కంభం చెరువు లాంటి చోట్ల వాటర్ ఏరో డ్రోమ్స్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించాలని సూచించారు. సముద్ర విహారాన్ని ప్రోత్సహించేలా విశాఖ, నెల్లూరులోని కృష్ణపట్నం పోర్టుల నుంచి క్రూజ్ నౌకలను కూడా నిర్వహించేలా చూడాలన్నారు. తెలంగాణా లాంటి ల్యాండ్ లాక్డ్ రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు దీనికి పెద్ద ఎత్తున ఆకర్షితులు అవుతారన్నారు. రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసే టెంట్ సిటీలను కేటగిరీలుగా విభజించి ప్రోత్సహిస్తే అందరికీ అందుబాటులోకి వస్తాయన్నారు. కనీసం వెయ్యి టెంట్ సిటీలను గోదావరి పుష్కరాల నాటికి అందుబాటులోకి తేవాలని సీఎం సూచనలు జారీ చేశారు. క్రియేటివ్ ఎకానమీని ప్రోత్సహించేందుకు కంటెంట్ క్రియేషన్ పెద్ద ఎత్తున జరగాలన్నారు. క్రియేటివ్ ఎకానమీని సృష్టించేలా అమరావతి క్రియేటివ్ సిటీగా ఎదగాలన్నారు. బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ కూడా క్రియేటివ్ ఎకానమీ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపించారన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఐకానిక్ డెస్టినేషన్ స్కీమ్ కింద విశాఖ, తిరుపతి నగరాలను అభివృద్ధి చేయాలని.. ప్రతీ ఐకానిక్ డెస్టినేషన్‌కు రూ.500 కోట్ల వరకూ వెచ్చించేందుకు ఆస్కారం ఉందని ముఖ్యమంత్రి వివరించారు. గత ఏడాదిలో పర్యాటక ప్రాంతాలకు 30.92 కోట్ల మంది పర్యాటకుల ఫుట్ ఫాల్ నమోదైందని ఈ ఏడాదిలో 9 నెలల కాలానికిగాను 21 శాతం మేర వృద్ధి కనిపించిందని.. ఇది మరింత పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధాన ఆలయాలను అనుసంధానించి టెంపుల్ టూరిజం కూడా ఇంటిగ్రేట్ చేయాలని సీఎం సూచించారు. సూర్యలంక బీచ్‌ను ప్రత్యేకంగా అభివృద్ధి చేసేందుకు యాక్షన్ ప్లాన్ చేపట్టాలన్నారు. వీటితో పాటు తిరుపతిలో ఉన్న చెరువులు, అమరావతి ప్రాంతంలోని కాలువలు, విశాఖ సహా వేర్వేరు ప్రాంతాలను సుందరీకరణ చేపట్టాలని సిఎం స్పష్టం చేశారు.

# కార్యాచరణ దిశగా తిరుపతి ఫిల్మ్ సిటీ విజన్: మంత్రి దుర్గేష్

**తిరుపతి,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:** ఆధ్యాత్మిక నగరం తిరుపతిని చిత్ర నిర్మాణ , పోస్ట్‌ప్రొడక్షన్ కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పారడాక్స్ పిక్చర్స్ చేపట్టిన ప్రైవేట్ రంగ ప్రయత్నానికి గుర్తింపుగా రాష్ట్రపర్యాటక మంత్రి కందుల దుర్గేష్ "తిరుపతి ఫిల్మ్ సిటీ" విజన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి చెందుతున్న సృజనాత్మక ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతమిస్తూ, పారడాక్స్ పిక్చర్స్ వ్యవస్థాపకురాలు, నిర్మాత కావ్య పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ని కలిసి, ప్రతిపాదిత "తిరుపతి ఫిల్మ్ సిటీ" కార్యక్రమం పురోగతిని వివరించారు.సిఎం చంద్రబాబునాయుడు ఆశయాలకనుగుణంగా సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ దిశగా కృషి చేయాలని సూచించారు. గత రెండు సంవత్సరాలుగా తిరుపతిలో సినీ మౌలిక వసతుల అభివృద్ధి కోసం పారడాక్స్ పిక్చర్స్ చేపట్టిన కార్యక్రమాలను కావ్య మంత్రికి వివరించారు. ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న స్టూడియో సౌకర్యాలలో చిత్ర నిర్మాణ మౌలిక వసతులు,ఎడిటింగ్ సూట్లు,డబ్బింగ్ థియేటర్లు, రీరికార్డింగ్ సౌకర్యాలు సంగీత నిర్మాణ కేంద్రాలు,పోస్ట్‌ప్రొడక్షన్ సేవలు వంటి విభాగాలు ఉన్నాయి. ప్రస్తుతం నాలుగు ఎకరాల విస్తీర్ణంలో నాలుగు అంతస్తుల కార్యాలయ సముదాయం నుంచి ఈ కార్యక్రమం కొనసాగుతుండగా, విస్తరణ ప్రణాళికలు కూడా కొనసాగుతున్నాయని మంత్రికి వివరించారు. రాష్ట్రంలో విశాఖపట్నం, అమరావతి, తిరుపతి నగరాల్లో సినీ పరిశ్రమ అభివృద్ధి చెందాలనే విస్తృత దృక్పథం నుంచే ఈ కార్యక్రమానికి స్ఫూర్తి లభించిందని కావ్య తెలిపారు.
హైదరాబాద్‌కు పరిమితం కాకుండా ఇతర నగరాల్లో కూడా సినిమా మౌలిక వసతులు ఏర్పడాలనే చర్చలు మొదలైనప్పుడు, ఎదురు చూడకుండా మేమే ముందడుగు వేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. తిరుపతిలో సినీ మౌలిక వసతుల నిర్మాణాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. స్వయం సమృద్ధిగల సినీ పరిశ్రమను నిర్మించడం, నైపుణ్యాధారిత ఉపాధి అవకాశాలను సృష్టించడం, దీర్ఘకాలిక సినీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయడమే మా ధ్యేయం" అని ఆమె అన్నారు.. తిరుపతి పరిసర ప్రాంతాల నుంచి గణనీయ సంఖ్యలో నటులు, సాంకేతిక నిపుణులు, సహాయక కళాకారులు, సిబ్బందికి అవకాశాలు కల్పించబడుతున్నాయన్నారు. స్థానికంగా అందుబాటులో ఉండే సినీ పరికరాల వ్యవస్థను సృష్టించడం ఈ ప్రాజెక్ట్ సాధించిన ముఖ్య విజయాలలో ఒకటిగా నిలిచింది. ఈ.కార్యక్రమాన్ని మంత్రి కందుల దుర్గేష్ అభినందించారు. త్వరలోనే సిఎం చంద్రబాబునాయుడును కలసి వివరిస్తామన్నారు.

# ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు

## మెగా జాబ్ మేళాతో యువతకు ఉద్యోగావకాశాల వేదిక

### కర్నూలులో 1,500 ఉద్యోగాలు.. యువతకు మంత్రి భరత్ పిలుపు

**కర్నూలు, జూన్ 13: ప్రభాతవార్త :** ప్రభుత్వం నిర్వహిస్తున్న జాబ్ మేళాలను యువత సద్వినియోగం చేసుకొని అనుభవాన్ని పెంపొందించుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రోసెసింగ్ శాఖ మంత్రి టిజి భరత్ పిలుపునిచ్చారు. కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీలో నిర్వహించిన నాలుగో మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కర్నూలులో ఇప్పటివరకు నిర్వహించిన మూడు మెగా జాబ్ మేళాల్లో కేవలం 50 శాతం మంది మాత్రమే ఉద్యోగ అవకాశాలను వినియోగించుకున్నారని మంత్రి తెలిపారు. ఈసారి 19 కంపెనీలు సుమారు 1,500 ఉద్యోగాలతో యువతకు అవకాశాలు కల్పించేందుకు ముందుకు వచ్చాయని, ఉద్యోగాలు సాధించిన వారు వెంటనే చేరి అనుభవం సంపాదించాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ఓర్వకల్ ఇండస్ట్రియల్ హబ్‌లో రిలయన్స్, అగస్త్యా, గ్రీన్ హైడ్రోజన్, సోలార్, విండ్ పవర్ వంటి భారీ పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయని, వాటి ద్వారా యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

# మళ్లీ దేవాదాయ శాఖలోకే బ్రాహ్మణ కార్పొరేషన్

**విజయవాడ జూన్ 13 ప్రభాతవార్త ప్రతినిధి:** బ్రాహ్మణుల సుదర్ఘ డిమాండ్‌ను కూటమి ప్రభుత్వం నెరవేర్చింది.మళ్లీ దేవాదాయ శాఖలోకే బ్రాహ్మణ కార్పొరేషన్‌ను తీసుకుని వచ్చింది బ్రాహ్మణ కార్పొరేషన్ దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకొస్తామని ఎన్నికలు మందు హామీ ఇచ్చింది. దీంతో ఈ మాటలను నిలబెట్టుకుంది. తాజాగా ఉత్తర్వుల జారీ చేసింది. కాగా ఎంతో కాలంగా బ్రాహ్మణ కార్పొరేషన్ కొనసాగిన వారిని జగన్ ప్రభుత్వం బిసి సంక్షేమ శాఖ పరిధిలోకి తీసుకెళ్లింది. దీంతో తమను దేవాదాయశాఖ కార్పొరేషన్‌లోనే ఉంచాలని డిమాండ్ చేశారు. కానీ గతప్రభుత్వం పెడచెవిన పెట్టింది. దీంతో 2024 ఎన్నికల ముందు కూటమి నాయకులను బ్రాహ్మణులుకలిసి సమస్యను విన్నవించారు. దీంతో తాము అధికారంలోకి వస్తే కచ్చితంగా సమస్యను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు తాజాగా అడుగులు వేశారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌ను దేవాదాయ శాఖలోనే ఉంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దీంతో బ్రాహ్మణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో తమకు అందాల్సిన సంక్షేమ పథకాలు, దక్కాల్సిన ప్రాధాన్యత దక్కుతుందని బ్రాహ్మణుల ఆనందనం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

# నేడు రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు

**విజయవాడ, జూన్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం మేఘావృతం కానుంది. పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. రేపు శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురవనున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు.అంతేకాకుండా పలుచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. వర్షం పడే సమయంలో చెట్లు, హోర్డింగ్స్ వద్ద నిలబడొద్దని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు హెచ్చరించారు. ఇవాళ సాయంత్రం 6 గంటల నాటికి మార్కాపురం జిల్లా కోవిలంపాడులో 41 మిల్లీమీటర్లు, అనంతపురం జిల్లా తేరన్నపల్లిలో 24 మిల్లీ మీటర్లరు, వైఎస్సార్ కడప జిల్లా సింహాద్రిపురంలో 22.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీనికితోడు వర్షపు గాలుల వల్ల ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే వాటిని గమనిస్తూ వీలైనంత దూరంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు హెచ్చరించారు.

## జూలై 1న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అనంతపురం రాక

**అనంతపురం జూన్ 13 ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండల పరిధిలో ఉన్న ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం ప్రథమ స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరుకానున్నట్లు తెలియ వచ్చింది. జూలై 1న జంతులూరు గ్రామంలో జ్ఞానసీమ ప్రాంగణంలో ఘనంగా స్నాతకోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతివిశ్వవిద్యాలయ విజిటర్ హోదాలో విచ్చేయనున్నట్లు సమాచారం.
2020 నుంచి 2026 బ్యాచ్‌లకు చెందిన 1,200 మందికి పైగా విద్యార్థులకు పట్టాలు,61 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు బంగారు పతకాల ప్రదానంచేయనున్నట్లు సమాచారం.

## వారం - వర్జ్యం

14-06-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, మృగశిర కార్తె
చతుర్దశి మ.2.19
రోహిణి రా.10.13
వర్జ్యం : మ.3.14-సా.4.37
2) రా.3.06 -తె.4.30
దు.సా.4.51-సా.5.43
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** ఆకస్మిక ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడుతాయి. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

**వృషభం:** ఇంటా బయటా అనుకూల స్థితి. జీవితభాగస్వామి సలహాలు తీసుకుంటారు. ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం తగదు.

**మిథునం:** ఆప్తుల నుండి సహాయం అందుతుంది. పోటీ పరీక్షలలో ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు.

**కర్కాటకం:** దూరప్రాంతాలలో ఉన్న మీ వారి క్షేమ సమాచారం ఆనందానికి కారణం అవుతుంది. వాహనసౌలభ్యం కలదు.

**సింహం:** సంతాన పురోభివృద్ధి బాగుంటుంది. వ్యాపారాలకు తగిన లాభాలు పొందుతారు ఆరోగ్యం జాగ్రత్త అవసరం.

**కన్య:** ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు లభిస్తాయి. ఆభరణాలు, వాహనాలు కొనుగోలు చేస్తారు.

**తుల :** కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. కీలక సమాచారం అందుకుంటారు. బాకీలు వసూలవుతాయి.

**వృశ్చికం:** పెట్టుబడులకు అనుకూలమైన కాలం. కాంట్రాక్టులు లాభిస్తాయి. ప్రముఖుల నుండి కీలక సమాచారం.

**ధనుస్సు:** పనులు నిదానంగా పూర్తి చేస్తారు. మొండి బాకీలు వసూలవుతాయి. ధనలాభం పొందుతారు. స్పెక్యులేషన్ కలిసి వస్తుంది.

**మకరం:** ఉద్యోగంలో అనుకోని చిక్కులు ఎదురవుతాయి. సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. వాహనసౌఖ్యం.

**కుంభం:** ప్రతి చిన్న విషయానికి జీవిత భాగస్వామితో సంప్రదింపులు సాగిస్తారు. సహోద్యోగుల అండదండగా నిలుస్తారు.

**మీనం:** ముఖ్యమైన దరఖాస్తు ఫారాలకు జత చేయవలసిన పత్రాలను పరిశీలించుకోవడం చెప్పదగిన సూచన.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



శనివారం భోపాల్‌లో ఎన్డీయే ప్రభుత్వం 12 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా నాగేశ్వర్ మహదేవ్ ఆలయంలో జరిగిన స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

# కార్మిక సంక్షేమంలో సంస్కరణలు

>> లకు వినియోగించేందుకు కార్యాచరణ రూపొందించబడిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 25 ఇంటిగ్రేటెడ్ లేబర్ అమినిటీస్ కాంప్లెక్సుల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కేంద్రాల ద్వారా ఉపాధి సమాచారం, మంచి నీరు, వైఫై, పారిశుధ్య సౌకర్యాలు, కార్మికుల నమోదు, సంక్షేమ అవగాహన, నైపుణ్యాభివృద్ధి సేవలు ఒకేచోట అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈ నమూనాను విస్తరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయన్నారు.

**ఇఎస్ఐ సేవల విస్తరణ - కార్మిక కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు**

గత రెండు సంవత్సరాలలో ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ శాఖ కార్మికుల ఆరోగ్య భద్రత, వైద్య సేవల విస్తరణ, మౌలిక సదుపాయాల బలోపేతం మరియు డిజిటల్ గవర్నెన్స్ రంగాలలో విశేష పురోగతి సాధించిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం 15.32 లక్షల మంది ఇఎస్ఐ. భీమా వ్యక్తులు మరియు దాదాపు 60 లక్షల మంది లబ్ధిదారులకు సమగ్ర వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆరోగ్య సేవల సామర్థ్యాన్ని పెంచేందుకు 92 మంది వైద్య, పారామెడికల్ మరియు పరిపాలనా సిబ్బందికి పదోన్నతులు కల్పించడం జరిగిందన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా 30 కొత్త ఇఎస్ఐ డిస్పెన్సరీలు, 57 ప్రస్తుత డిస్పెన్సరీల అప్‌గ్రేడేషన్, అలాగే విశాఖపట్నం మరియు అమరావతిలో రెండు ఇఎస్ఐసి మెడికల్ కాలేజీల స్థాపనకు చర్యలు చేపట్టబడ్డాయన్నారు. అత్యవసర వైద్య సేవల బలోపేతం కోసం సిఎస్ఆర్ భాగస్వామ్యంతో 3 అంబులెన్సులను సమీకరించడం జరిగిందన్నారు. అదే విధంగా, గ్రీవెన్స్ రీడ్రెస్సల్ వ్యవస్థ, మొబైల్ హెల్త్ అప్లికేషన్లు, ధన్వంతరి-ఇఔషధి సమన్వయం వంటి కార్యక్రమాల ద్వారా డిజిటల్ హెల్త్ గవర్నెన్సుకు శ్రీకారం చుట్టి, పారదర్శకమైన మరియు ప్రజాకేంద్రిత వైద్య సేవల అందుబాటును మరింత మెరుగుపర్చడం జరిగిందని మంత్రి తెలిపారు.

**పారిశ్రామిక భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత....**

రాష్ట్రంలో పారిశ్రామిక భద్రతను అత్యున్నత ప్రాధాన్య అంశంగా గుర్తించిన ప్రభుత్వం 'జీరో యాక్సిడెంట్స్' లక్ష్యంతో సమగ్ర కార్యాచరణను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. పరిశ్రమల్లో ప్రమాదాలను ముందస్తుగా నివారించడం, కార్మికుల ప్రాణభద్రతను కాపాడడం మరియు సురక్షితమైన పనివాతావరణాన్ని నెలకొల్పడం కోసం విస్తృత స్థాయిలో చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

# వార్‌కు ఫుల్‌స్టాప్!

>> చర్చలు దాదాపు తుది దశకు చేరుకున్నాయని, ఒప్పందం ఖరారైన వెంటనే డీల్‌పై ఎలక్ట్రానిక్ విధానంలో సంతకాలు జరిగేలా పాకిస్థాన్ ఏర్పాట్లు చేస్తున్నట్లు షరీఫ్ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌లో శనివారం ఓ పోస్ట్ చేశారు. శాంతి ఒప్పందానికి మేం ఎప్పుడూ ఇంత దగ్గరగా రాలేదు. మరో 24 గంటల్లోనే ఒప్పందం ఖరారయ్యే అవకాశం ఉంది. తర్వాత ఎలక్ట్రానిక్ సంతకాలు, వచ్చే వారమే సాంకేతిక స్థాయి చర్చలు జరుగుతాయని పాకిస్థాన్ పిఎం పేర్కొన్నారు. ఈ క్రమంలోనే చర్చల సమయంలో ఎంతో సహకరించిన అమెరికా ఇరాన్ ప్రభుత్వాలకు షరీఫ్ కృతజ్ఞతలు తెలిపారు. మద్దతు ఇచ్చిన పశ్చిమాసియాలోని ఇతర దేశాలకు కూడా ధన్యవాదాలు చెప్పారు. దీర్ఘకాలిక శాంతి దిశగా ఈ చారిత్రక ఒప్పందం బలమైన పునాది వేస్తుందని విశ్వసిస్తున్నట్లు వెల్లడించారు. షరీఫ్ ప్రకటనకు ఒకరోజు ముందుగా ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీకూడా ఈ ఒప్పందం గురించి వ్యాఖ్యలు చేశారు. ఇస్లామాబాద్ అవగాహనా ఒప్పందం ఇంతకుముందెన్నడూ లేనంత దగ్గరలో ఉంది. తుది ఒప్పందం పూర్తయ్యే వరకు మీడియా ఊహాగానాలన్నింటికీ దూరంగా ఉండాలని చెప్పారు. అరాగ్చీ పోస్ట్‌ను యూఎస్ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ కూడా తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేయడం విశేషం. అయితే ఇక్కడ ఒప్పందం తుది దశకు చేరుకుంటుందన్న తరుణంలోనే ఇరాన్‌పై ట్రంప్ మరోసారి విమర్శలు గుప్పించారు. ఇరాన్ మీడియా కథనాల్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఇరాన్ మీడియా ప్రకటనలకు, చర్చల్లో అంగీకరించిన అంశాలకు సంబంధం లేదని వ్యాఖ్యానించారు. ఒప్పందంలోని విషయాల్ని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ వెల్లడించారు. ఇరాన్ ఓడరేవులపై అమెరికా విధించిన దిగ్బంధనాన్ని ఎత్తి వేయడం సహా హర్ముజ్ జలసంధి నిర్వహణలో పలు కీలక మార్పులు వంటివి ప్రతిపాదిత ఒప్పందంలో ఉన్నట్లు తెలిపారు. ఇదే సమయంలో ఇరాన్ వద్ద ఉన్నటువంటి యురేనియం అంశాన్ని కూడా చర్చల్లో పరిష్కరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇటు ఒప్పందానికి చేరువైనట్లు ప్రకటనలు వస్తుండగా మరోవైపు హర్ముజ్ జలసంధిలో శనివారం వాణిజ్య నౌకల్ని లక్ష్యంగా చేసుకున్న పలు ఇరాన్ డ్రోన్లను అమెరికా కూల్చివేసినట్లుగా ప్రకటించడం ఆందోళనలు రేకెత్తిస్తోంది. ఇస్లామాబాద్‌లో మొదటి విడత చర్చలు ఫలితం ఇవ్వకపోయినా ఇప్పుడు ఒప్పందం దిశగా పురోగతి కనిపిస్తోంది.ఈ అత్యున్నత స్థాయి సమావేశంలో అమెరికా సంయుక్త రాష్ట్రాల తరఫున ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్వయంగా పాల్గొని ఒప్పందంపై సంతకం చేసే వీలుందని సమాచారం. ఇరాన్ పార్లమెంట్‌స్పీకర్ మొహమ్మద్‌బాకర్ ఘాలిబాఫ్ కూడా ఈపత్రాలపై సంతకాలు చేయనున్నట్లు దౌత్యవర్గాలు భావిస్తున్నాయి. అయితే ఈ సమావేశ వేదికను అధికారికంగా ఖరారు చేయాల్సి ఉంది.

# వర్షంతో రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

>> వర్షాలు వస్తే తుంగభద్ర జలాశయంలోకి తుంగ, భద్ర నదుల నుంచి భారీగా నీరు వచ్చేది. అయితే ప్రస్తుతం ఎలినినో ప్రభావం వల్ల వర్షాలు లేకపోవడంతో తుంగభద్ర జలాశయం ఒట్టి కుండలా ఉంది. తుంగభద్ర జలాశయంలో కేవలం 10 టీఎంసీల లోపే నీరు ఉంది. మంచి పథకాల కోసం ఆ నీటిని నిల్వ ఉంచినట్లు కనిపిస్తోంది. గత ఏడాది తుంగభద్ర డ్యాం గేట్ కొట్టుకు పోవడంతో కేవలం 68 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేయగలిగారు. ఆ నీటినే ఆంధ్ర-కర్ణాటక రైతులకు విడుదల చేశారు. కానీ ఈ యేడాది సరికొత్తగా తుంగభద్ర రిజర్వాయర్‌కు సంబంధించి గేటుతోపాటు అన్నింటినీ కొత్తగేట్లు బిగించారు. ఎపిలోని కూటమి ప్రభుత్వం కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం సహకారంతో తుంగభద్ర బోర్డు 33 క్రస్ట్ గేట్లను విజయవంతంగా మార్చడంలో సక్సెస్ అయ్యింది. ఈ సీజన్‌లో తుంగభద్ర జలాశయం ఎగువ ప్రాంతంలో వర్షాలు పడితే డ్యాం పూర్తి సామర్థ్యం 105.78 టిఎంసిల నీటిని నిల్వ చేసేందుకు అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో జలాశయం పై భాగంలో వర్షాలు వస్తే ఎక్కువ సామర్థ్యంతో నీటిని నిల్వ చేసేందుకు అవకాశం ఉన్నందున అనంతపురం, కర్నూలు జిల్లాలకు సాగునీరు వచ్చే అవకాశం ఉందని రైతులు ఆశిస్తున్నారు. ఎలినినో ప్రభావం రుతు పవనాలపైన ఏ మేరకు ఉంటుందో వేచి చూడాల్సిందే. గత యేడాది తుంగభద్ర రిజర్వాయర్‌లోకి ఇదే రోజుకు 25.589 టిఎంసిల నీరు ఉంటే, ఈ యేడాది ఇదే రోజుకు 9.90 టిఎంసిల నీరు ఉంది. గత ఏడాది ఇదే రోజు టిబి డ్యాంలోకి 8,269 క్యూ సెక్కుల నీరు వస్తుంటే, ఈ ఏడాది ఇదే రోజు సగటున 157 క్యూసెక్కుల నీరు వస్తోంది. తుంగభద్ర జలాశయం ఎగువ ప్రాంతం తీర్థహల్లి, అగుంబే ప్రాంతాల్లో త్వరలో భారీ వర్షాలు వస్తాయని ఆశిద్దాం.

# కాల్వలు, కరకట్టలు పటిష్టపరచాలి

## నీటి ప్రవాహాలకు ఆటంకం లేకుండా చూడాలి

### జలధార- జలహారతి పనులపై సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ జూన్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రస్తుతం జరుగుతోన్న జలధార- జలహారతి పనుల్లో గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణఅభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతివ్వాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. జలధార పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. శనివారం సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జలధారజలహారతి పనుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్షి ంచారు. ఉపాధి హామీ నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా జలధార పనులు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ నిధుల వినియోగంలో అలసత్వాన్ని ప్రదర్శించవద్దన్నారు. నీటి మిగులు బేసిన్ల నుంచి తక్కువ నీటి లభ్యత ఉన్న బేసిన్లను కనెక్ట్ చేసే పనులను చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు.
జలధార పనుల కింద చెక్ డ్యామ్‌లు, ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్‌లు, కాంటూర్ కందకాల పునరుద్ధరణ పనుల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. చిన్న వాగుల అభివృద్ధికి వాల్మీకిపురం వాగు అభివృద్ధి మోడల్ పరిశీలించాలని సూచించారు. నీటి భద్రత విషయంలో ప్రతీ జిల్లా ఒక వినూత్నమైన విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. జలధార మొదటి విడత పనులు పూర్తయిన తర్వాత చెక్ డ్యామ్‌లు, ఫామ్ పాండ్‌లు, చెరువులకు గండ్లు పడకూడదన్నారు. నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా కాలువలు, కరకట్టలలో అడ్డంకులు తొలగించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షి ంచాలని సీఎం ఆదేశించారు. జలధార వల్ల కలిగే లాభాలను ఇరిగేషన్, అవేర్ వంటి సంస్థలు ఎప్పటికప్పుడు అంచనా వేయాలన్నారు. జిల్లాల వారీగా భూగర్భ జలాల పునరుద్ధరణ లెక్కలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు.



## కేశినేని నానిపై కేసు

**విజయవాడ,జూన్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ లోక్‌సభ నియోజకవర్గ మాజీ సభ్యుడు కేశినేని శ్రీనివాస్(నాని)పై పోలీసులు కేసు నమోదు చేసారు. తనపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించిన పోలీసులు కేశినేని నానిపై కేసు నమోదు చేశారు. ఇటీవల కాలంలో తనను లక్ష్యంగా చేసుకుని అసత్య ప్రచారం చేస్తున్నారని కేశినేని చిన్ని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపడుతున్నారు. కాగా తనపై ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులకు కూడా కేశినేని నాని ఫిర్యాదు చేయడమే కాకుండా, చంద్రబాబుకు లేఖలు రాయడం చికాకుగా మారడంతో చిన్ని కేశినేని నానిపై ఫిర్యాదు చేసినట్లు ఆయన వర్గీయులు వెల్లడించారు. ఇక తనపై నమోదైన కేసుపై నాని స్పందించారు.కేసులకు, బెదిరిం పులకు తాను భయపడబోనని ఆయన ఎక్స్ వేదికగా తెలిపారు. తాను విజయవాడ ఎంపీ చేసిన దానిపై చంద్రబాబు కు పధ్నాలుగు నెలల క్రితం లేఖ రాశానని, అయితే పధ్నాలుగు నెలల తర్వాత తనపై పోలీసు కేసు నమోదు చేయడం ఏంటని ప్రశ్నించారు.ప్రభుత్వ, ప్రజాసంబంధిత ఆస్తుల విషయంలో మాజీఎంపీగా తాను ప్రశ్నించే అధికారం ఉందని కేశినేని నాని అభిప్రాయపడ్డారు. కేసులతో తనను భయపెట్టలేరని, అలాగే బెదిరింపులకు తాను లొంగేవ్యక్తిని కానని

# నలుగురు మావోయిస్టులకు బెయిల్

**విజయవాడ,జూన్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ శివారుల్లో గత ఏడాది అరెస్టైన నలుగురు మావోయిస్టులకు ఎట్టకేలకు బెయిల్ లభించింది. బెయిల్ జారీ సందర్భంలో న్యాయస్థానం విధించి షరతులకు అనుగుణంగా నిందితులు పూచీకత్తు అందజేసిన తరువాత మాత్రమే జైలు నుంచి విడుదల అవుతారు.మావోయిస్టు తరపు న్యాయవాదులు అందించిన సమాచారాన్ని పొడియం రెంగు అలియాస్ భీమ (ఏ1), మదకం మదన్ అలియాస్ మదనన్న (ఏ2), సోది మనీలా (ఏ3), సోది మంగి (ఏ4)లకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపీ షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కోర్టు ఉత్తర్వులను అనుసరించి ప్రతి నిందితుడు రూ.25వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాల్సి ఉంటుంది.అందులో ఒకరు స్థానిక వ్యక్తి పూచీకత్తుదారుగా ఉండాలని కోర్టు ఆదేశం చింది. కోర్టుఅనుమతి లేకుండా మావోయిస్టులు పటమట పోలీస్ స్టేషన్ పరిధిని దాటి వెళ్లరాదని స్పష్టం చేసింది. ఈ షరతులు పాటించిన అనం తరం నలుగురు మావోయిస్టులు జైలు నుంచి విడుదల కానున్నారు.గత ఏడాది నవంబర్‌లో విజయవాడలోని కానూరు వద్ద ఉన్న కొత్త ఆటో నగర్ లోని ఓ భవనంలో మావోయిస్టులు బస చేస్తున్నట్లు వచ్చిన పక్కా సమాచారంతో ఆక్టోపస్, గ్రేహౌండ్స్ పోలీసులు విస్తృతస్థాయిలో తనిఖీలు జరిపారు. స్థానిక పోలీసుల సహకారంతో నలువైపుల నుంచి భవనాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఆ క్రమంలోనే నవంబర్ 18వ తేదీన విజయవాడ నగరంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి ఈ నలుగురు మావోయిస్టులను అరెస్టు చేశారు. అనంతరం వారిపై పటమట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి వీరు నెల్లూరు లోని కేంద్రకారాగారంలో జ్యుడీషియల్ రిమాండ లో ఉన్నారు నిందితులు 200 రోజులకు పైగా జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న నేపథ్యంలో డిఫాల్ట్ బెయిల్ మంజూరు చేయాలని వారి తరపు న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్ జిల్లాకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసు విచారణలో భాగంగా పోలీసులు దాఖలు చేసిన ఛార్జిషీట్‌పై కోర్టు కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసి తిరిగి పంపించిందని ఆయన వాదించారు. మావోయిస్టుల తరఫున న్యాయవాది శ్రీనివాస్ మాట్లాడుతూ నిందితులు చాలా కాలంగా జైలులో ఉన్నారని, చట్టపరంగా వారికి డిఫాల్ట్ బెయిల్ మంజూరు చేయాల్సిన అవసరం ఉందనివాదించారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ ప్రభావంతో మావోయిస్టులు ఆయుధాలు వదిలి లొంగిపోతున్న పరిస్థితులు ఏర్పడ్డాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు ప్రభుత్వం తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంక టేశ్వరరావు తమ వాదనలు వినిపించారు. ఈ నెల 2వ తేదీన ఇరుపక్షాల వాదనలు పూర్తయ్యాయి. ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. గోపీ, నిందితుల తరఫు వాదనలతో ఏకీభవిస్తూ నలుగురికీ బెయిల్ మంజూరు చేశారు.

## ఆర్జీయూకేటీ బీటెక్ ప్రవేశాల ఫలితాలు విడుదల: మంత్రి లోకేష్

**విజయవాడ,జూన్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సు 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించిన తాత్కాలిక ఎంపిక జాబితాను ఏపీ విద్యాశాఖ విడుదల చేసింది. ఈ మేరకు ఆన్‌లైన్‌లో ఎంపిక ఫలితాలను ఏపీ విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా విడుదల చేశారు. నూజివీడు, ఆర్కే వ్యాలీ, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లలో ప్రవేశాల కోసం ఎంపిక ప్రక్రియ పూర్తి చేశారు.మొత్తం 44,104 దరఖాస్తులు అందగా, వాటిలో 4,040 మంది విద్యార్థులను



తాత్కాలికంగా ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో 96.7 శాతం మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే ఉండటం విశేషం. గ్రామీణ ప్రతిభకు పెద్దపీట వేస్తూ ప్రవేశాలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థుల ఎంపిక లేఖలు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. అలాగే విద్యార్థుల సహాయం కోసం వాట్సాప్ హెల్ప్‌డెస్క్ నంబర్ 9552300009 ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. విద్యా రంగంలో సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పని చేస్తోందని, గ్రామీణ విద్యార్థుల సాధికారతకు ఈ ప్రవేశాలు దోహదపడతాయని ఏపీ విద్యాశాఖ అధికారులు తెలిపింది.

## రాజధాని పరిధిలో మొత్తం 69 బ్రిడ్జిలు: మంత్రి నారాయణ

**విజయవాడ,జూన్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి పరిధిలోని కొండవీటి వాగు, పాలవాగులపై మొత్తం 69 బ్రిడ్జిల నిర్మాణం జరుగుతోందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. ఈ రెండు వాగులపై జరుగుతున్న వంతెనల పనులను మంత్రి పి. నారాయణ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అమరావతిలో ఎక్కడా నీటి నిల్వలు లేకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ రెండువాగులపైన మొత్తం 69 బ్రిడ్జిల నిర్మాణం జరుగుతోందని, వర్షపు నీరు సాఫీగా సాగిపోయేలా ఇంజినీరింగ్ ప్రణాళికలతో పనులు వేగవంతం చేశామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా



ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అమరావతిలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి కేంద్ర క్యాబినెట్ ఇప్పటికే ఆమోదం తెలిపిందన్నారు. అమరావతి భవనాల నిర్మాణ వ్యయం పై వైసిపి నేతలు చేస్తున్న ఆరోపణలను మంత్రి తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి చదరపు అడుగుకు రూ. 3,945 ఖర్చు అవుతుంటే, అమరావతి హైకోర్టు నిర్మాణానికి రూ. 3,393, గెజిటెడ్ అధికారుల నివాసాలకు రూ. 3,684 మాత్రమే వ్యయం అవుతోందని తెలిపారు. ఐకానిక్ భవనాలు కావడం వల్లే కొన్నింటికి కొద్దిగా ఖర్చు ఎక్కువ అవుతుందని, పార్లమెంట్ భవనానికైనా, తెలంగాణ సచివాలయం నిర్మాణానికైనా తొలిసారి పిలిచిన టెండర్లకు, పూర్తయ్యేనాటికి భారీగా ఖర్చు యిందని, ఖర్చు పెరగడం సహజమేనని పేర్కొన్నారు. వైసిపి నాయకులు ఇకనైనా అబద్దపు ప్రచారాలు మానకపోతే వచ్చే ఎన్నికల్లో వారికి 11 సీట్లు కూడా రావంటూ వ్యాఖ్యానించారు.

## గవర్నర్ నజీర్‌కు గుమ్మడి గోపాలకృష్ణ కృతజ్ఞతలు

**విజయవాడ, జూన్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతిష్టాత్మక కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా తన గురించి గౌరవపూర్వకంగా ప్రస్తావిస్తూ ప్రశంసలు తెలియజేసిన రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ పద్యనాటక రంగానికి తాను చేసిన సేవలను గుర్తించి, తెలుగు శాస్త్రీయ నాటక సంప్రదాయ పరిరక్షణ, ప్రోత్సాహానికి అవసరమైన ప్రేరణను అందించినందుకు గవర్నర్‌కి వినమ్ర ప్రణామాలు తెలియజేశారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం తనకు లభించడం వ్యక్తిగత గౌరవం మాత్రమే కాకుండా, తెలుగు పద్యనాటక రంగానికి, కళాకారులకు, నాటకాభిమానులకు లభించిన గుర్తింపుగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఈ పురస్కారం తెలుగు నాటక రంగం, సంస్కృతి,సాంప్రదాయ కళారూపాల అభివృద్ధికి మరింత అంకితభావంతో సేవలు అందించేదుకు తనకు నూతన ఉత్సాహాన్ని, స్ఫూర్తిని కలిగించింద న్నారు. తెలుగు నాటక సంప్రదాయ వైభవాన్ని భావితరాలకు అందించేందుకు, యువతలో నాటక కళపై ఆసక్తి పెంపొందించేందుకు, రాష్ట్ర నాటక అకాడమీ ద్వారా మరింత కృషి కొనసాగిస్తానని గోపాలకృష్ణ తెలిపారు.

## లిక్కరు స్కామ్‌లో కీలక లబ్ధిదారు జగనే: మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి

**విజయవాడ,జూన్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యపాన నిషేధం చేస్తామని లిక్కరును పూర్తిగా ఆదాయ వనరుగా మార్చుకున్నారని గత వైసీపీ ప్రభుత్వంపై సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మద్యం కుంభకోణంలో రూ. 3500 కోట్లు దోచుకొని డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. మద్యం కుంభకోణంలో అంతిమ లబ్ధిదారుడు గొడ్డలి పార్టీ నాయకుడు జగనే అని వ్యాఖ్యానించారు. కల్తీ మద్యం తయారు చేసి 30 వేల మంది మహిళల పుస్తెలు తెంచారని దుయ్యబట్టారు. చిన్నాన్నను చంపిన వ్యక్తికి ప్రజల ప్రాణాలు ఒక లెక్క కాదన్నారు. కల్తీ మద్యం ద్వారా దోచుకున్న సొమ్ముతో సినిమాలు, వ్యాపారాలు చేశారని మంత్రి తెలిపారు. వైసీపీ మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావు మద్యం రవాణా దోపిడీ చేశారని ఆరోపించారు. డొల్ల కం పెనీల ద్వారా రవాణా ఛార్జీలు పెంచి రూ.400 కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో సురక్ష యాప్ ద్వారా నాణ్యమైన మద్యం అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ప్రజలు గొడ్డలి పార్టీని తిరస్కరించిన విషయాన్ని గొడ్డలి పార్టీ నాయకులు గుర్తు చేసు కోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌తో సూపర్ హిట్ కొట్టిందన్నారు. మద్యం కుంభకోణంలో తాడేపల్లి గేట్‌ను ఈడీ టచ్ చేసిందన్నారు. రాష్ట్రంలో శాశ్వతంగా గొడ్డలి పార్టీని ప్రజలు మూసివేశారని డోలా బాల వీరాంజనేయ స్వామి వ్యాఖ్యానించారు.

# ఒపి నుంచి వైద్య సేవల వరకు సరికొత్త మార్పులు: మంత్రి సత్యకుమార్

**విజయవాడ,జూన్ 13, ప్రభాతవార్తప్రతినిధి:** వైద్య రంగంలో అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం కల్పిస్తున్నామని ఏపీ ఆరోగ్య,వైద్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేసారు.అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి, అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అందిస్తోందని. రెండేళ్లలో ఆరోగ్యశాఖ పరంగా చేసిన అభివృద్ధి, ప్రణాళికలను ప్రజలకు చెబుతున్నామని తెలిపారు. అన్ని వర్గాలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఓపీ సేవల నుంచి వైద్య సేవల వరకు అన్నింటిలో సరికొత్త మార్పులు తెచ్చామని తెలిపారు. ఎవరు ఆస్పత్రికి వచ్చినా ఆ రికార్డును డిజిటల్ చేశామన్నారు.అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి, అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అందిస్తోందని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ తిరుపతిలో జరిగిన బహిరంగ సభలో ఇదే విషయాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పారన్నారు. రెండేళ్లలో ఆరోగ్య శాఖ పరంగా చేసిన అభివృద్ధి, ప్రణాళికలను ప్రజలకు చెబుతున్నామని తెలిపారు. అన్ని వర్గాలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఓపీ సేవల నుంచి వైద్య సేవల వరకు అన్నింటిలో సరికొత్త మార్పులు తెచ్చామని తెలిపారు. ఎవరు ఆస్పత్రికి వచ్చినా ఆ రికార్డును డిజిటల్ చేశామన్నారు.ఆరోగ్యశ్రీ, 108 అత్యవసర సేవలను దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి తీసుకుని వచ్చారన్నారు.ఈ సేవలను అమలు చేస్తూనే మెరుగైన సంస్కరణలు తెచ్చామన్నారు. పథకాల పేర్లు మారినంత మాత్రం చేత సేవలు నిర్వీర్యం కావన్నారు.మాజీ ముఖ్యమంత్రి జగన్ కనీస అవగాహన లేని రీతిలో మాట్లాడుతున్నారన్నారు. ఆరోగ్య శాఖలో అనేక సంస్కరణలను సీఎం చంద్రబాబు తీసుకువచ్చారని మంత్రి తెలిపారు. రియాక్టివ్, క్యూరేటివ్ స్థాయి నుంచి ప్రిడెక్టివ్ విధానాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రజల వద్దకే వెళ్లి 45 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేయిస్తున్నామన్నారు. ముందుగానే వారి సమస్యలను గుర్తించి అవసరమైన మందులు అందిస్తున్నామని తెలిపారు. టెలిమెడిసిన్ ద్వారా ప్రజలకు ఉన్న సందేహాలను వైద్యుల ద్వారా సమాధానాలు ఇప్పిస్తున్నామని చెప్పారు. మీడియా కూడా తమ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. ఎక్కడా ఎటువంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తెచ్చి పరిష్కారం అయ్యేలా చేశారన్నారు. నేడు ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. మంచి సేవలు అందుతున్నాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఇది తాము చెబుతున్న మాటలు కాదని గణాంకాలే తమ పని తీరును చెబుతున్నాయని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు.



## మద్యం కుంభకోణంలో అడ్డంగా దొరికిన జగన్ అండ్ కో: మంత్రి కొల్లు

**విజయవాడ జూన్ 13 ప్రభాతవార్త ప్రతినిధి:** మద్యంలో రూ.వేల కోట్ల కుంభకోణం చేసి జగన్ అండ్ కో అడ్డంగా దొరికిందని ఎక్సైజ్ శాఖ మంత్రికొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. గొడ్డలి పోటు, వెన్నుపోట్లకు జగన్ బ్రాండ్ అంబాసిడర్ అని వ్యాఖ్యానించారు. పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జగన్ లాంటి వారు ఆంధ్రప్రదేశ్‌లో ఉండకూడదనే 11 సీట్లు ఇచ్చి కూర్చోబెట్టారు. సెంటు స్థలం పేరుతోనూ వేల కోట్ల స్కామ్ చేశారు. కులాల, మతాల మధ్య చిచ్చుపెట్టాలని గొడ్డలి పార్టీ కుట్ర చేస్తోంది. వాటిని దీటుగా ఎదుర్కొంటాం. గొడ్డలి పార్టీని ప్రజలు భూస్థాపితం చేసే రోజు దగ్గరలోనే ఉంది. కూటమి రెండేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశాం అని అన్నారు.కూటమి ప్రభుత్వంపై కుట్రలు జల్లే క్రమంలో జగన్ ప్రతి సారి అభాసుపాలవుతున్నాడన్నారు.ఆయన చవకబారు ఎత్తుగడలతో ప్రజలు విసిగిపోయారన్నారు.ఈ సారి జగన్ అసెంబ్లీలోకి అడుగు పెట్టే పరిస్థితులుండవేమో అన్నారు.

## కాపు మహిళలను మోసగించిన డీసీఎం: వరుదు కళ్యాణి

**విజయవాడ, జూన్ 13 ప్రభాతవార్త ప్రతినిధి:** సూపర్ సిక్స్ అమలు చేసే వరకు తాము పోరాటం చేస్తామని వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణ వెల్లడించారు. కాపు మహిళలను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మోసం చేశారని,దీనిపై తీవ్ర ఆందోళన చేస్తామన్నారు. తాడేపల్లి వైసీపీ కార్యాలయంలో మాట్లాడుతూ రెండేళ్ల పాలనలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఆమె ఎండగట్టారు. అంతేకాదు సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ పై పలు అభియోగాలు చేసారు. ఆడబిడ్డ నిధికి ముఖ్యమంత్రి చంద్రబాబు తూట్లు పొడిచారని మండిపడ్డారు. 2కోట్ల మంది మహిళలకు ఆయన వెన్నుపోటు పొడిచ3ఆరని వరుదు కళ్యాణి ఆరోపించారు. తిరుపతి సభకు విజయోత్సవ సభకు బదులుగా వెన్నుపోటు సభ అని పేరు పెడితే బాగుండేదని వరుదు కళ్యాణి విమర్శించారు. ఇంట్లో ఎంతమంది ఉంటే అంత మందికి మహిళలకు ఆడబిడ్డ నిధి పథకం ఇస్తామని చంద్రబాబు చెప్పిన విషయాన్ని గుర్తు చేసిన వరుదు కళ్యాణి తల్లికి వందనం మొదటి ఏడాది ఎగ్గొట్టారని చెప్పారు. నిరుద్యోగులకు ఇస్తామన్న భృతి ఏమైందని ప్రశ్నించారు. సిడిఎన్ అంటే చీటింగ్ బోగస్ నాయుడు అని ఎద్దేవా చేశారు.

కూటమి నాయకులకు దమ్ము, ధైర్యం ఉంటే ప్రజలు ఇంటికి వెళ్లి సూపర్ సిక్స్ అమలు చేశామని చెప్పాలన్నారు. వైఎస్ జగన్ కంటే ఎక్కువ పథకాలు ఇస్తామని పవన్ కల్యాణ్ చెప్పారని మంత్రి లోకేశ్‌ను సైతం గల్లా పట్టుకొని నిలదీయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి హెచ్చరించారు.

## తిరుమలలో డిసిఎం పవన్ చిత్రపటం ప్రదర్శన

### ఆలయం ముందు భక్తుల అత్యుత్సాహం: చల్లంగా ఉండాలని దీవెనలు

**తిరుమల,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమలలో గోవింద నామం తప్ప మరేనామం ఉచ్చరించడానికి వీలులేదంటూ ఏకంగా తీర్మానం చేసిన టిటిడి అందుకు విరుద్ధంగా ఓ భక్తబృందం శనివారం సాయంత్రం ఏకంగా ఆలయం ముందు పవన్‌కల్యాణ్ ఫోటో చూపి మాట్లాడటం సంచలనంగా మారింది. కొందరు జనసేన పార్టీ అభిమానులు ఇలా చేయడంతో అక్కడ ఉన్న భక్తులు కొంత అవాక్కయ్యారు. తిరుమలలో దేవుని నామస్మరణ తప్ప మరెలాంటి మాటగానీ, పదంగానీ వినిపించదు. మరీ ఏకంగా శనివారం సాయంత్రం జనసేనపార్టీ అభి మానులైన భక్తులు రాష్ట్రంలో పవన్ కల్యాణ్ పాలన, ఆయన చేస్తున్న మంచి పనులు గురించి వివరించారు. ఒక్కసారిగా ఆయన చల్లంగా ఉండాలని, పవన్ బిడ్డా అంతా మంచి జరగాలని ఆశీర్వదిస్తూ ఓ భక్తకుటుంబం అఖిలాండం వద్ద వ్యాఖ్యలు చేసింది. తిరుమలలో జనసైనికుల అత్యుత్సాహంతో ఆలయం ఎదుట రాజకీయ చిత్రపటం ప్రదర్శన చేయడం కలకలం రేపింది. "పవన్ కళ్యాణ్ అనే నేను" పుస్త కాన్ని ప్రదర్శించి వీడియో చిత్రీకరించిన యువకులు సామాజిక మాధ్యమంలో వైరల్‌చేశారు. దీంతో ఇదీ కాస్తటాఫిక్‌గా మారింది. తిరుమలలో రాజకీయ ప్రచారంపై నిషేధం ఉన్నా ఉల్లంచారని భక్తులు ఆగ్రహం వెలిబుచ్చారు. మరీ అక్కడ ఎలాంటి తీవ్రపదజాలం లేకున్నా చిత్రపటం ప్రదర్శన విమర్శలకు దారి తీసింది. దీనిపై టిటిడి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది వేచిచూ డాల్సిందే.




# తిరుమల సమాచారం

## 25 నుంచి ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



**తిరుమల,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి జిల్లా వడమాలపేటమండలం అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు జూన్ 25 నుండి జూలై 3వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలకు ముందుగా 23న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 24న సాయంత్రం అంకురార్పణ ఘనంగా జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం 8 నుండి 9 గంటల వరకు, రాత్రి 7 నుండి 8 గంటల వరకు స్వామివారు వివిధ దివ్య వాహనాలపై విహరించి భక్తులను అనుగ్రహించనున్నారు.జూన్ 25 న ధ్వజారోహణం, పెద్దశేష వాహనం,జూన్ 26న ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనం, 27 న ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహనం,28న ఉదయం కల్పవృక్ష వాహనం, కల్యాణోత్సవం, రాత్రి సర్వభూపాల వాహనం, 29 న మోహినీ అవతారం, రాత్రి గరుడ వాహనం, 30న ఉదయం హనుమంత వాహనం, రాత్రి గజ వాహనం, జులై 1న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం, జూలై 2న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, జూలై 3న చక్రస్నానం, ధ్వజావరోహణం జరుగుతాయి. జూన్ 28వ తేదీ సాయంత్రం 4 నుండి 6 గంటల వరకు ప్రసన్న వేంకటేశ్వరస్వామికల్యాణోత్సవం భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించనున్నారు. గృహస్తులు (ఇద్దరు) 500 రూపాయలు చెల్లించి పాల్గొనవచ్చు. పాల్గొనే దంపతులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, ఒక లడ్డు, ఒక అప్పం బహుమానంగా అందజేయనున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్, దాససాహిత్య ప్రాజెక్టు, అన్నమాచార్య ప్రాజెక్టు, ఎస్వీ మ్యూజిక్ కళాశాలల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక ప్రసంగాలు, భక్తి సంగీత కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, భజనలు, కోలాటాలు నిర్వహించి భక్తులను ఆధ్యాత్మిక పరవశంగా జరుగుతాయి.

## 16 నుంచి పెరియాళ్వార్ ఉత్సవాలు

### ప్రబంధ పాశురాల గానామృతంతో ఆధ్యాత్మిక వైభవం

**తిరుమల,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో ఈనెల 16 నుండి 25వ తేదీ వరకు పెరియాళ్వార్ ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి తమ శిష్యబృందంతో కలిసి పెరియా ళ్వార్‌వారి సన్నిధిలో దివ్య ప్రబంధ పాశురాలను నివేదించనున్నారు. పాశురాల గానామృతంతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో మార్మోగనుంది. 25న తిరుమంజనం, గరుడ-గజ వాహనాలపై దివ్య విహారం చేయనున్నారు. ఉత్సవాల చివరి రోజైన జూన్ 25న ఉదయం పెరియాళ్వార్‌కు తిరుమంజనం నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం గోవిందరాజస్వామి గరుడవాహనంపై, పెరియాళ్వార్ గజవాహనంపై ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులకు దివ్యమంగళ దర్శనం ప్రసాదించనున్నారు.

పెరియాళ్వార్ మహా విష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రుడైన పరమభక్తుడు. భక్తి సంప్రదాయంలో విశిష్ట స్థానాన్ని పొందిన ఆయన, ఆండాళ్ అమ్మకి తండ్రి. ప్రతిరోజూ తులసీమాలలను తయారు చేసి స్వామివారికి సమర్పిస్తూ భగవత్సేవలో జీవితాన్ని అంకితం చేశారు. ఆయన సాన్నిధ్యంలో పెరిగిన ఆండాళ్ అమ్మవారు మన్నారాయణునినే తన భర్తగా భావించి భక్తి మార్గంలో ఆదర్శంగా నిలిచారు. దివ్య ప్రబంధాలలో ఎన్నో అమూల్యమైన పాశురాలను రచించిన పెరియాళ్వార్‌కు శ్రీమహా విష్ణువు సాక్షాత్కారం కలిగిన మహాభాగవతుడిగా



## టిటిడికి ట్రక్కు విరాళం

**తిరుమల,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి పలు రకాలుగా విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. దాతలు శ్రీవారిపై భక్తి విశ్వాసాలతో విరాళాలందిస్తున్నారు. శనివారం ఉదయం అశోక్ లేలాండ్ లిమిటెడ్ సంస్థ టిటిడికి 31,72,532 లక్షల రూపాయలు విలువైన ట్రక్కును విరాళంగా అందించింది. ఈ మేరకు సంస్థ అధ్యక్షుడు సంజీవ్ కుమార్ శ్రీవారి ఆలయం ముందు వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ట్రక్కు తాళాలను ,రికార్డులను టిటిడి ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి అందజేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి రవాణా విభాగం ఇన్‌చార్జ్ జీఎం లక్ష్మీ ప్రసన్న, తిరుమల డిఐ కృష్ణయ్య పాల్గొన్నారు.

## రూ.44లక్షలు విరాళమిస్తే దాతపేరున అన్నప్రసాదాలు వడ్డింపు

**తిరుమల,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటే శ్వర స్వామి దర్శనార్థమ్ తిరుమలకు వస్తున్న లక్ష లాదిమంది భక్తులకు రుచిగా, శుచిగా అన్నప్ర సాదాలు వడ్డించేందుకు దాతలకు అవకాశం కల్పించారు. ఈ పథకం క్రింద దాత ఒకరోజుకు 44లక్షలు రూపాయలు విరాళాలిస్తే దాత స్వయంగా వచ్చి వడ్డించే అవకాశమేగాక దాత పేరు ప్రదర్శన చేస్తారు. తిరుమలకొండపై భక్త లు ఆకలి అనేది తెలియకుండా అక్షయ పాత్రలా వచ్చిన ప్రతి ఒక్క భక్తుడికి రుచిగా అన్నప్రసా దాలు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్ర సాదం భవనంలోనేగాక మరికొన్ని ప్రాంతాల్లో అన్నప్రసాదాలు అందిస్తున్నారు. ఇం దుకుగాను ఒకరోజు విరాళ పథకం ప్రారంభించి, ఉదయం అల్పాహారం కోసం 10లక్షలు రూపా యలు, మధ్యాహ్నం భోజనం కోసం 17లక్షలు, రాత్రి భోజనం కోసం 17లక్షలు రూపాయలు అందించి దాతలు స్వయంగా భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డించవచ్చు. అన్నప్రసాద భవ నంలో ఉదయం 8.30గంటల నుండి 10.30 గంటల వరకు చట్నీతో కలిపి ఉప్మా, పొంగళి, సేమ్యా ఉప్మా అందిస్తారు. ఉదయం 11గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు ,తిరిగి సాయంత్రం 5గంటలనుండి రాత్రి11.30గంటల వరకు చక్కెరపొంగలి, చట్నీ,అన్నం, కూర, సాంబారు, రసం ,మసాలవడ మజ్జిగతో భక్తులకు వడ్డిస్తున్నారు. ఎస్వీఅన్నప్రసాదం ట్రస్ట్ కు విరాళాలు కూడా 2,500 కోట్ల రూపాయలకు చేరిన విషయం విదితమే. ఈ ఆదాయంపై వచ్చే వడ్డీతోనే ఇప్పుడు ఎంతో నాణ్యతతో,రుచిగా అన్నప్రసాదాలు భక్తులకు వడిస్తున్నారు. రోజుకు లక్షమందివరకు భక్తులుఅన్నప్రసాదాలను భక్తితో స్వీకరిస్తున్నారు.



## కొండంతా ఎటుచూసినా భక్తజనం

### శ్రీవారి దర్శనానికి 26గంటలు

**తిరుమల,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:** వేసవి సెలవులు ముగియడం,విద్యాసంస్థలు పున:ప్రారంభంతోబాటు వారాంతం రెండురోజులు సెలవులు రావడంతో తమ మొక్కులు తీర్చుకునేందుకు పిల్లలతో కలిసి పెద్ద ఎత్తున తిరుమలకు భక్తులు చేరుకుంటున్నారు. శనివారం ఉదయానికి తిరుమలలో భక్తుల రద్దీ మునుపెన్నడూ లేని విధంగా కొనసాగుతోంది. శ్రీవారి దర్శనార్థందేశం నలు మూలల నుంచి తరలివచ్చిన భక్తులతో ఏడుకొండలు జనసందోహంగా మారాయి. స్వామివారి దర్శనం కోసం భక్తులు క్యూ కాంప్లెక్స్ వెలుపల కిలోమీటర్ల మేర క్యూలైన్లలో గోగర్భమ్‌డ్యామ్ వరకు వేచి ఉన్నారు. ఎలాంటిదర్శనం టోకెన్లులేని సాధారణ భక్తులకు శ్రీవారి సర్వదర్శనం (శీఘ్రదర్శనం కానిది) లభించడానికి సుమారు 26గంటల సమయం పడుతోంది. ఓవైపు ఎండలు,మరోవైపు చిరుజల్లులు కురుస్తుండటంతో క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు ఎటు వంటి ఇబ్బందులు కలుగకుండా టిటిడి అధికారులు సేవలందిస్తున్నారు. చూసుకుంటున్నారు.

అధికారులు నిరంతరాయంగా మంచి నీరు, పాలు,మజ్జిగ, అన్నప్రసాదాల పంపిణీ చేస్తు న్నారు. శనివారం సాయంత్రం వరకు 45వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నారు.


## 'సహస్ర దీపాలంకరణ' సేవలో ఆకట్టుకున్న శోభారాజ్ కీర్తనలు

**తిరుమల,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆస్థాన విద్వాంసురాలు, పద్మశ్రీ డాక్టర్ శోభా రాజు శిష్యులతో కలిసి శని వారం సాయంత్రం వేళ తిరుమల శ్రీ వేంక టేశ్వర స్వామికి "సహస్ర దీపాలంకరణ" సేవా కార్యక్రమంలో సంకీర్తనా కైంకర్యం చేశారు. తొలుతగా "అన్నమయ్య గాయత్రి" మంత్రంతో ప్రారంభించి, బహుళ ప్రజా దరణ పొందిన అన్నమయ్య కీర్తన "కంటి నఖిలాండ కర్తనధికుని గంటి"ని భక్తి పూర్వ కంగా ఆలపించారు. తన స్వీయ రచనలో "తోడూ నీవే నీడా నీవే అంతా నీ దయ గోవింద" అనే సంకీర్తన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. గాత్రం పై అభిరామ్, మానస పటేల్ మరియు వాయిద్య కీబోర్డ్ కళ్యాణ్, తబలా పాండు సహకారం అందించారు. అనంతరం ఆలయ వేద పండితుల ఆశీర్వ చనంతో డాక్టర్ శోభా రాజు దంపతులుకు, కళాకారులకు స్వామి వారికి ఇచ్చిన హారతి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# ముదురుతున్న 'తెలుగు' జలవివాదాలు

**భాగ్యనగర్ భాస్కర్ కుమార్**

దేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంతో నైరుతి రుతుపవనాల విస్తరణ మందకొడిగా కొనసాగుతోంది. దేశంలో వర్షాభావంతో సాగునీటికి, తాగునీటికి కొరత ఏర్పడే ప్రమాదం పొంచి ఉందని దేశ,అంతర్జాతీయ పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆలమట్టి నుంచి కృష్ణాడెల్టావరకు గ్రైవార్డ్ ప్రాజెక్టు నుంచి గోదావరి డెల్టా సిస్టమ్ వరకు 18 ప్రధాన రిజర్వాయర్లలలో గరిష్ఠంగా 793.94 టిఎంసి నీరు నిల్వ ఉండాల్సి ఉండగా అందులో ప్రస్తుతం 280.39 టిఎంసిలు మాత్రమే నిల్వ ఉంది. గత ఏడాది జూన్ మొదటి వారం వరకు 292.55 టిఎంసిలు ఈ రిజర్వాయర్లలో నీరు నిలిచి ఉంది. కృష్ణ బేసిన్‌లో గత ఏడాది నైరుతి రుతుపవనాలు మంచి వర్షాన్ని ఇచ్చాయి. పోయిన ఏడాది జూన్ 10 జూరాల గేట్లు ఎత్తి కిందికి లక్ష కూసెక్కుల నీటిని కిందికి వదిలారు. శ్రీశైలంలో జూన్ మూడోవారం వరకు జూరాల నుంచి సుమారు 8టిఎంసిల నీరు చేరుకొన్నది. గోదావరి నది పరివాహక ప్రాంతంలో ఆలస్యంగా ప్రాజెక్టుల్లోకి నీరు వచ్చి చేరింది. తెలుగు రాష్ట్రాలకు జీవనాడులుగా ఉన్న కృష్ణా గోదావరి నదుల్లో పుష్కలంగా నీరు ప్రవహించిన రోజుల్లోనే నీటి పంపకాల విషయంలో గిల్లికజ్జాలు పెట్టుకొంటున్నాయి. నాగార్జున సాగర్‌పై ఇరు రాష్ట్ర పోలీసులు బాహాబాహీకి దిగిన రోజులున్నాయి. తెలంగాణ ఆధీనంలోని ఎన్ఎస్‌పి ఆనకట్టను సగం వరకు ఆంధ్రాపోలీసులు ఆక్రమించుకొన్నారు. కెఆర్ఎంబి సూచనలు పక్కనబెట్టి ఆంధ్రప్రదేశ్ నీటిని ఎక్కువ తరలించుకొని పోతుందని తెలంగాణ ఆరోపణలు చేయడం లేదు మా వాటాను మేం తీసుకొని పోతున్నామని ఆంధ్రప్రదేశ్ పాలకులు విమర్శలు చేయడం నిత్యకృత్యంగా మారింది. ఈ యేడు పుష్కల వర్షం ఉన్నా కూడా కృష్ణ జలాలలో కేవలం25శాతం మాత్రమే నీటిని ఉపయోగించుకొన్నామని తెలంగాణ అంటోంది. గోదావరి జలాలు కృష్ణాబేసిన్‌కు తరలించడంతో ఎగువ రాష్ట్రాలకు ఇవ్వాల్సిన నీటివాటాను కర్ణాటక 16 టిఎంసిలు పైనే కృష్ణా జలాల నుంచి వాడుకోవడానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఏకపక్షంగా అనుమతి ఇవ్వడంతో వివాదంగా మారింది. సూపర్ ఎల్‌నినో ప్రభావం వర్షాభావ పరిస్థితులు ఎదురవుతే ప్రాజెక్టుల్లో ఆశించిన స్థాయిలో నీరు చేరకపోతే రాబోయే రోజుల్లో మరింత ముదిరిపోయే అవకాశం ఉంది. కృష్ణా ట్రిబ్యునల్ అవార్డు తీర్పు త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది. తెలంగాణకు ఆంధ్రప్రదేశ్‌కు నీటి వాటాలు కొత్తగా పంపిణీ చేయనున్నారు. ఇలాంటి సమయంలో పోలవరం కావేరి లింక్ చేయడం కూడా వివాదానికి



దారితీస్తోన్నది. తెలంగాణ సమాజం మొత్తం గోదావరి జలాలలో 968 టిఎంసిలకు అనుమతులు ఇచ్చాకే ఇంటర్ లింక్ చేయాలని కోరుతోన్నది. ఇచ్చంపల్లి కావేరి అనుసంధానం చేయాలని ఇంటర్ లింక్ చేసిన నీళ్లలో సగం తెలంగాణకు ఇవ్వాలని పేచి పెడుతోంది. పోలవరం కావేరి లింక్ చేయడం తెలంగాణ నుంచి వ్యతిరేకత వస్తోంది. ఆంధ్రకు ఇప్పటికే ఒక జాతీయ ప్రాజెక్టు ఉందని ఇచ్చంపల్లి కడితే ఇక్కడ కూడా ఒక జాతీయ ప్రాజెక్టు వస్తోందని భావిస్తోంది. అంతేకాదు ఇచ్చంపల్లి నాగార్జున సాగర్ అనుసంధానం వల్ల తెలంగాణలో అనేక కరవుపీడిత ప్రాంతాలకు నీటివసతి ఏర్పడే అవకాశం ఏర్పడుతోంది. గోదావరిపై ఇప్పటికే తెలంగాణ సుమారు 139 టిఎంసిల వినియోగంకు కేంద్ర జలసంఘం చేసిన విన్నపాలు పెండింగ్‌లో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ పాలక పార్టీలు భాగస్వాములు కావడంతో జలశక్తి కార్యాలయంలో తన పట్టును చంద్రబాబు పెంచుకొన్నారు. జలశక్తి మంత్రిత్వ శాఖ సెక్రటరీగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కాంతారావుకు పోస్టింగ్ ఇచ్చుకొని ఆ రాష్ట్రం నీటి ప్రయోజనాలు పరిక్షణకు అనువైన వాతావర్ణం ఏర్పాటు చేసుకొన్నారు. దీనితో తెలంగాణకు చెందిన గోదావరిపై నీటి వినియోగం కోసం సిడబ్ల్యుసిలోఉన్న ప్రతిపాదనల పెండింగ్‌లో పడ్డాయి. 139 టిఎంసిలకు అనుమతులు వస్తాయా రావా అనే సంశయం ఇప్పుడు తెలంగాణ సమాజంలో నెలకొంది. రాబోయే రోజుల్లో గోదావరి మీద తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు ఇస్తారా అనే శంక కూడా మొదలైంది. ఇది ఇలా ఉంటే పోల వరం కావేరి అనుసంధానం చేస్తే గోదావరిలో 213 టిఎంసిల నీరు తెలంగాణ కోల్పో యే అవకాశం ఉందని తెలంగాణ ప్రాంత నీటినిపుణులు ఆందోళన చెందుతున్నారు. కేంద్రప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు అనుమతి ఇస్తే గోదావరిలో తెలంగాణకుఅన్యాయం జరుగుతుందని భయాందోళనలు మొదలైనాయి.గోదావరి జలాలను కృష్ణా పరివాహకానికి తరలిస్తే జిడబ్ల్యూడిటి అవార్డు ప్రకారం.. 14: 21: 45 నిష్పత్తి ప్రకారం హక్కులు ఎగువ రాష్ట్రాలకు సంక్రమిస్తాయి. 14 కర్ణాటకకు, 21 మహారాష్ట్రకు, 45 తెలంగాణకు నీటివాటాలు ఆంధ్రప్రదేశ్ ఇవ్వాల్సి ఉంటుంది. పోలవరం విషయంలో అవార్డు పాసైందని ప్రచారం జరుగుతోంది. 80 టిఎంసిల కంటే ఎక్కువ నీళ్లు తీసుకెళ్తే ఇవే హక్కులు సంక్రమిస్తాయి. బనకచర్ల, నల్లమల సాగర్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదనలు విరమించుకొన్నాడు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గోదావరిలో మిగులు జలాలు ఉన్నాయనీ అంటే బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు మిగులు జలాలు లేవని, మిగులు జలాలపై ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని పేచిపెడుతున్నారు. గోదావరి మిగులు జలాల విషయం కేంద్రమే స్పష్టం చేయడంతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు గోదావరికావేరి ఇంటర్ లింకింగ్‌ను ముందుకు తీసుకొచ్చారు. 2014 నుంచి గోదావరి కావేరి అనుసంధానం తెరపైకి వచ్చింది. తెలంగాణ భూభాగం టచ్ కాకుండా గోదావరి నీటిని తీసుకెళ్లే ప్రయత్నం వల్ల తెలంగాణకు తీవ్ర అన్యాయంజరుగుతోందని తెలంగాణ వారు ఆందోళన చెందుతున్నారు రూపాయి ఖర్చు లేకుండా ఇచ్చంపల్లి వద్ద జాతీయ ప్రాజెక్టు కింద నిర్మించుకునే అవకాశం కోల్పోవడంతోపాటు. సమ్మక్క సాగర్ 47 టిఎంసిలనీటిని కూడా వదులుకోవాల్సి వస్తోందని భావిస్తున్నారు. తుమ్మడి హట్టి ప్రాణహితపై 152 అడుగుల ఎత్తుతో ప్రాజెక్టు కట్టడానికి మహారాష్ట్ర ముఖ్య మంత్రికి తెలంగాణ ముఖ్యమంత్రి లేఖ రాసినా ఉలుకూపలుకు లేకపోవడంతో తెలంగాణలో రాజకీయంగా వేడెక్కింది. కేంద్ర మంత్రులు రాష్ట్ర ప్రభుత్వం మధ్య మాటల యుద్ధం నడిచింది. ఆంధ్రప్రదేశ్ దాదాపు రూ. 14100 కోట్ల కేంద్ర నిధులతోభారీ సాగు ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకొంది. గోదావరి డెల్టా జీవనాడిఅయిన ధవళేశ్వరం బ్యారేజీని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం రూ. 150 కోట్లు కేటాయించింది. పాత గేట్లను తొలగించి కొత్తవి అమర్చే పనులను ప్రభుత్వం ప్రారంభించింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు రోజులు మహబూబ్‌నగర్ జిల్లాలో మకాం వేసి అక్కడి పెండింగ్ ప్రాజెక్టులపై సమీక్ష చేశారు. ప్రతి ప్రాజెక్టును కాలపరిమితో పూర్తిచేయడానికి లక్ష్యం కూడా విధించారు. మరోవైపు తెలం గాణలో సీతారామ ఎత్తిపోతల పథకం/సీతమ్మసాగర్ బహు ళార్థ సాధక ప్రాజెక్టు లోని సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణానికి అవసరమైన పర్యావరణ అనుమతులను సాధించడానికి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. దేవాదులప్రాజెక్టును ప్రారంభించి పాతిక సంవత్సరాలు గడిచి పోయినా.. ఇప్పటివరకు ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ పూర్తికాలేదు. ఇది ఒక ఆందోళనకర పరిస్థితిగా మారింది. ●

తుమ్మిడిహట్టి బ్యారేజీ సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేసే బాధ్యతను ఏడు నెల క్రితం డిసెంబర్ మొదటివారంలో ప్రభుత్వం ఆర్వీ అసోసియేట్స్‌కే అప్పగించింది. ఆ సంస్థ సర్వే ప్రక్రియను ప్రారంభించింది. ఐఐటీ హైదరాబాద్ సహకారంతో ఈ డిపిఆర్ ను సిద్ధం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. బ్యారేజ్ ప్రతిపాదిత నిర్మిత ప్రదేశం నుంచి మైలారం గ్రామందాకా 75కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్ సర్వే, మైలారం నుంచి సుందిళ్ల బ్యారేజీ దాకా టన్నెల్ అలైన్‌మెంట్‌పై సర్వే కూడా ఆ సంస్థ చేపట్టాల్సి ఉంటుంది. డీపీఆర్‌కు అనుమతులు సాధించే బాధ్యతను కూడా ప్రభుత్వం ఆ సంస్థకే అప్పగించింది. డిపిఆర్ తయారీ మూడు నెలల్లో, కేంద్ర జల వనరుల సంఘంలోని వివిధ డైరెక్టరేట్లనుంచి క్లియరెన్స్ తీసుకోవడం వంటి ప్రక్రియను ఏడాదిలోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. బ్యారేజీని 148, 150, 152 మీటర్ల ఎత్తుతో కట్టడం వల్ల కలిగే ముంపుపై పుణెలోని కేంద్ర నీరు, విద్యుత్ పరిశోధన సంస్థ ఇప్పటికే అధ్యయనం చేసింది. ఈ విషయంలో నిపు ణుల అంచనాలు,లెక్కలు సరైనవేనా? కావా? నిర్ధారించే బాధ్యతను కూడా ప్రభుత్వం ఆర్ వి అసోసియేట్‌కే అప్పగించింది. ఇప్పటిదాకా కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ జోలికి పోకుండానే తుమ్మిడిహెట్టి డిపిఆర్ సిద్ధం చేయడానికి సూచనలు వస్తున్నాయి. అయితే కాళేశ్వరం లో భాగంగా అయితేనే ప్రాజెక్టు బెన్‌ఫిట్ కాస్ట్ రేషియో (ప్రాజెక్టుకు వెచ్చించేది ఎంత.. తిరిగి వచ్చేదెంత)పై కచ్చితంగా లెక్కలు సరిపోతాయని అధికారులు చెబుతున్నారు. మేడి గడ్డ నుంచైనా తుమ్మిడిహెట్టి నుంచైనా నీళ్లు అంతిమంగా చేరాల్సింది శ్రీపాద ఎల్లంపల్లికే నని, ఆ ప్రాజెక్టు వద్ద ఉన్న కాళేశ్వరం పంపులతో పాటు సుందిళ్ల బ్యారేజీని కూడా వాడుకుంటున్నప్పుడు తుమ్మిడిహెట్టి బ్యారేజీ కూడా కాళేశ్వరంలో భాగంగానే కడుతున్నా మని ప్రభుత్వం ముున్ముందు ప్రకటించనుంది.

# మరో అవతారం!

పశ్చిమ బెంగాల్

**ఎ.వి.వి ప్రసాద్**

రాజకీయ వైకుంఠ పాళిలో ఎవరు ఎప్పుడు నిచ్చెనలెక్కుతారో, ఎవరు ఎటువంటి పాము నోట చిక్కుతారో చెప్పడం కష్టం. నిచ్చెన ఎక్కుతూ హఠాత్తుగా పాము నోట పడే పరిస్థితి వస్తుంది. పైనుంచి మళ్లీ అట్టడుగుకు చేరుకోవలసి వస్తుంది. వరుసగా మూడు సార్లు ముఖ్యమంత్రి కావడమే గాక ప్రత్యర్థి బిజెపిని ఓ ఆట ఆడించిన మమతా బెనర్జీ ఇప్పుడు సరిగ్గా అదే పరిస్థితిలో ఉన్నారని గతవారం పరిణామాలను బట్టి అనుకోవలసి వస్తుంది. పార్టీ ఓడిపోవడం కంటే ఆ పార్టీ నుంచి ఒక్కొక్కరు జారిపోవడమే ఇప్పుడామెను మరింత కృంగదీస్తున్నట్లుగా కనిపిస్తోంది. గతవారం ఆమె ఇండియా కూటమి సమావేశానికి హాజరు కావడం తొలుత అందరికి ఆశ్చర్యాన్ని కలిగించింది. తర్వాత కాంగ్రెస్ అధిష్ఠానంతో ఆమె జరిపిన చర్చలు మరింత ఆశ్చర్యాన్ని కలిగించాయి. రెండో పర్యాయం సిఎం అయినప్పటినుంచే మమత వైఖరిలో చాలా మార్పు వచ్చింది. కాంగ్రెస్‌తో కలిసి నడిస్తే పార్లమెంటులో తగిన స్థానం లభించకపోవచ్చనే ఆలోచనతో క్రమంగా ఆ పార్టీకి చాలా దూరం జరిగారు. సోనియా, రాహుల్‌ను కొన్ని సార్లు నేరుగా విమర్శించారు కూడా. మూడేళ్ల క్రితం ఇండియా కూటమి ఏర్పడినప్పుడుతొలుత ఆ కూటమిలో కీలక పాత్ర వహించినా తర్వాత ఆ కూటమికి కూడా దూరమయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ వేర్వేరుగానే పోటీ పడ్డాయి. కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించవలసిందిగా మమత పిలుపునిచ్చారు కూడా. అక్కడితో కూటమితో పూర్తిగా తెగతెంపులు జరిగాయి.కానీ ఎన్నికల్లో ఓడిపోయి పదవి పోగానే ఆమె మళ్లీ కూటమికి చేరువై సోనియా, రాహుల్‌తో సన్నిహితంగా కనిపించడమే విశేషం. అంతేగాక గతవారం సోనియా గాంధీతో రెండుసార్లు 'ఆంతరంగిక' సమావేశం జరిపారని కూడా వినిపించింది. మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేయబోతున్నారనే వదంతులు ఆ వెంటనే వ్యాపించాయి. నిప్పు లేనిదే పొగ రాదన్నట్లు ఆ ప్రచారంలో కూడా కొంత నిజం ఉందనే అనిపించింది. కాంగ్రెస్ అధిష్ఠానం పెట్టిన కొన్ని షరతులపై ఇంకా ఒక నిర్ణయం తీసుకోనందువల్లనే ఆలస్యమవుతున్నట్లుగా తెలుస్తోంది. అయితే పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్ పరిస్థితి కూడా నిరాశాజనకంగానే ఉంది.పరిస్థితి క్షీణించిన కాంగ్రెస్‌తో చేతులు కలపడం వల్ల ప్రయోజనం ఉంటుందా! అని మమత ఆలోచిస్తున్నట్లుగా తెలుస్తోంది. 2024లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కు దేశవ్యాప్తంగా 99 సీట్లు రాగా, తృణమూల్‌కు ఒక్క బెంగాల్‌లోనే 29 సీట్లు వచ్చాయి. కూటమి భాగస్వామ్య పక్షమైన డిఎంకెకు తమిళనాట 22 సీట్లు వచ్చాయి. ఇప్పుడు ఆ డిఎంకె, మూడు సీట్లున్న ఆప్ కూడా కూటమికి దూరమయ్యాయి. అంటే కూటమి నుంచి ఓపాతిక సీట్లు జారిపోయినట్లే. తృణమూల్ కాంగ్రెస్ తిరిగి కూటమిలోకి వచ్చినా ఆ పార్టీకి ఎంపీలు గాని, ఎమ్మెల్యేలు గాని మునుపటిలా లేరు.



మమతా బెనర్జీ

తృణమూల్ లోని 60మంది పైగా ఎమ్మెల్యేలు, 20మంది పైగా ఎంపీలు ఇప్పటికే జారుకున్నారు. వారంతా బిజెపిలోకి వెళ్లబోతున్నారని వేరే చెప్పక్కర్లేదు. అంటే తృణమూల్ తిరిగి ఇండియా కూటమిలో ఉన్నా, కూటమి మొత్తం బలం 200 దాటకపోవచ్చు.ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్‌కు 80 సీట్లు రాగా ఇప్పుడు వారిలో 60 మంది పైగా రెబెల్ గ్రూపుగా ఏర్పడ్డారు. ఆ ఎమ్మెల్యేలే గాక, మమతకు 'లాయల్' ఉన్నారనుకొంటున్న మరి కొందరు ఎమ్మెల్యేలు కూడా గత శుక్రవారం ముఖ్యమంత్రి సువేందు నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరు కావడాన్ని బట్టి చివరికి మమత గ్రూపులో ఓ నలుగురైదుగురు ఎమ్మెల్యేలే మిగలవచ్చునీ, అభిషేక్ బెనర్జీ అనుచరులు కూడా ఎవరూ మిగిలేట్లు కనిపించడం లేదనీ తెలుస్తోంది. ఈ పరిస్థితిలో తృణమూల్‌ను ఇండియా కూటమిలో కొనసాగించినా, లేక కాంగ్రెస్‌లో విలీనం చేసుకున్నాఒరిగే ప్రయోజనం ఏదీ ఉండకపోవచ్చు. ఆ విషయం గ్రహించినందునే తృణమూల్ విలీన ప్రతిపాదనపై నిర్ణయాన్ని కాంగ్రెస్ వాయిదా వేసుకున్నట్లు చెబుతున్నారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు రెండు సీట్లు మాత్రమే వచ్చాయి. 1977 వరకు రాష్ట్రంలో ఆధిపత్యాన్ని కొనసాగించిన కాంగ్రెస్ తర్వాత వామపక్షాలు, ఆ తర్వాత తృణమూల్ కు, తాజాగా బిజెపికి తన సీట్లు, ఓట్లను కోల్పోయింది. ఇప్పుడు కేవలం రెండు సీట్లు, దాదాపు మూడు శాతం ఓట్లు మాత్రమే ఉన్న కాంగ్రెస్‌లో విలీనమైతే 40 శాతం ఓట్లున్న తృణమూల్‌కు కలిగే ప్రయోజనం ఎంత? అనే ప్రశ్న వినిపిస్తోంది. 207సీట్లు, 45శాతం ఓట్లు ఉన్న బిజెపిని ఎదుర్కొనడానికి కాంగ్రెస్ బలం సరిపోతుందా? అనే ప్రశ్న కూడా తృణమూల్ నేతల నుంచి వినిపిస్తోంది. తృణమూల్‌లోని మెజారిటీ ఎమ్మెల్యేలు ఇప్పుడు రెబెల్ గ్రూపుగా ఏర్పడి తమకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని అసెంబ్లీ స్పీకర్‌ను కోరుతున్నారు. వారికి ఆ గుర్తింపు లభిస్తే ఒరిజినల్ తృణమూల్ కాంగ్రెస్ తమదే అని వారు చెప్పవచ్చు. మహారాష్ట్రలో శివసేన, ఎన్సీపీకి పట్టిన గతే తృణమూల్‌కు కూడా పట్టవచ్చు. ఆ పరిస్థితిలో మమత తృణమూల్ గ్రూపు కాంగ్రెస్‌లో విలీనం సాధ్యమవుతుందా! అన్నదీ సందేహమే. రెబెల్ ఎమ్మెల్యేల సంఖ్య ఇప్పటికే 68కి,రెబెల్ ఎంపీల సంఖ్య 25కు చేరినట్లు తాజాసమాచారం.అంటే మమత గ్రూపులో 95 శాతం ఖాళీఅయినట్లే అనుకోవాలి. ఈ పరిస్థితిలో ఆమె కొత్త అవతారం ఎత్తినా ఎంతవరకు సక్సెస్ అవుతారనే సందేహం అందరిలో కలుగుతోంది.మమత వ్యూహాలు ఎప్పుడూప్రత్యేకంగానే ఉంటాయి. ఈ తుపాను లోంచి బయటపడడానికి ఆమె ఏ అవతారం ఎత్తుతారో చూడాలి. ఇండియా కూటమిలో కొనసాగినా, లేకపోయినా తృణమూల్ కు కలిగే ప్రయోజనం ఏదీ లేదనే పరిశీలకులు భావిస్తున్నారు. ఈ పరిస్థితిలో ఆమె వ్యూహం ఎలా ఉంటుందో చూడాలి. ●

# 'నాటో' పై ట్రంప్ జులుం!

బెల్జియం

**గన్ని మోహన్**

పశ్చిమాసియా ఉద్రిక్తతలతో తలమునకలవుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ఓ పక్క ఇరాన్‌కు సాయం అందిస్తున్న దేశాలను మచ్చిక చేసుకుంటూనేఇప్పుడు నాటో సైనిక కూటమిపై దృష్టిసారించారు. రెండోప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పడిన నాటో కూటమికి యుద్ధవిమానాలు,యుద్ధనౌకలు సహా నిఘావ్యవస్థలన్ని కూడా తగ్గించాలని ట్రంప్ నిర్ణయించారు. ఇప్పటివరకూ ఐరోపా రక్షణకు అత్యంత బాసటగా నిలిచిన ట్రంప్ ఈ నిర్ణయానికి కారణం హర్మూజ జలసంధిని పూర్తిస్థాయిలో తెరిపించడంలో నాటోకూటమి కలిసిరాలేదన్నదే ఆయన కోపం. అందుకే వైమానిక, నేవీ మద్దతును తగ్గించాలని నిర్ణయించారు. ఇప్పటివరకూ నాటోకు అందుబాటులో ఉన్న 150 ఎఫ్16, ఎఫ్15 ఇ యుద్ధవిమానాలను 100కు తగ్గించాలని అలాగే సముద్రజలాలపై నిఘాకోసం వినియోగించే విమానాల సంఖ్యను కూడా 26నుంచి 15కు తగ్గించాలని నిర్ణయించింది. అలాగే గగనతలంలోనే ఇంధనం నింపే ట్యాంకర్ జట్లను కూడా నాటోకు పూర్తిగా నిలిపివేయాలని నిర్ణయించింది. ఇందుకు కారణం కేవలం హర్మూజ్, బాబ్ ఎల్‌మండెజ్ జలసంధుల్లో నెలకొన్న అనిశ్చితిని కట్టడిచేయడంలో అమెరికాకునాటో కూటమి కలిసిరాలేదన్న అక్కసుఒక్కటే. ఉత్తర అట్లాంటిక్ ఒప్పంద సంస్థగా పిలిచే ఈ నాటోఐరోపా కూటమి దేశాలకు అత్యంత భద్రతనిచ్చే అతిపెద్ద సైనిక కూటమిగా నిలిచింది. ముందు 12దేశాలతో ఏర్పాటైన ఈ కూటమి32 దేశాలకు విస్తరించింది. రష్యా దూకుడును కట్టడి చేసేందుకు ఆనాడు ఏర్పాటు చేసిన ఈ కూటమి ప్రపంచంలోనే అతిపెద్ద ఉమ్మడి సైనిక కూటమి అని చెప్పాలి. సభ్యదేశాల్లో ఏ ఒక్క దేశంలో భద్రత కొరవడినా, దాడులు జరిగినా నాటో స్పందించి రక్షణగా నిలుస్తుంది. బెల్జియంలోని బ్రస్సెల్స్ కేంద్రంగా పనిచేస్తోంది. ప్రస్తుతం నెదర్లాండ్స్ మాజీ ప్రధాని మార్క్‌రుట్టే సెక్రటరీ జనరల్‌గా వ్యవహరిస్తున్నారు. ఆనాడు రష్యాను నిలువరించేందుకు సరిహద్దు దేశాలు నార్వే, ఫిన్‌ల్యాండ్, ఎస్తోనియా,లాత్వియా, లిథువేనియా, పోలండ్ దేశాలు కూడా నాటో సభ్యదేశాలుగా ఉన్నాయి. అలాగే ఉక్రెయిన్‌పై రష్యా దూకుడును కట్టడిచేసేందుకు నాటో సభ్యదేశాలు కూడా దౌత్యపరంగా పనిచేస్తున్నాయి. అవి పోలండ్,రొమేనియా, స్లోవేకియా దేశాలున్నా రష్యా తనదాడులు నిలపడంలేదు. తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత 'మాగా' లక్ష్యంగా దూకుడుగా వెళుతున్న సంగతి తెలిసిందే.ప్రపంచదేశాలకు కొరకరాని కొయ్యగా తయారయిన ట్రంప్ తాజాగా నాటోపై ఫోకస్ పెంచారంటే ఆ సైనిక కూటమిని నిర్వీర్యంచేసి నిస్తేజం చేయాలన్న కాంక్ష ఆయనలో కనిపిస్తోంది. కొత్తగా నాటోలో ఫిన్‌ల్యాండ్, స్వీడన్ దేశాలు కూడా చేరాయి. ఈ కూటమి మొత్తం రష్యా విస్తరణ కాంక్షను అడ్డుకునేందుకేనని స్పష్టంగా చెప్పవచ్చు. రష్యాకు పాశ్చాత్యదేశాల మధ్య ఉన్న ఉద్రిక్తతలను కట్టడిచేసి రష్యా ఆధిపత్యం తగ్గించేందుకే ఈ కూటమి పనిచేస్తుంది.ఇందులో భాగంగానే నాటో ఆధ్వర్యంలో ఉక్రెయిన్‌కు సైనిక, ఆయుధ సాయం అందించాలనేది వ్యూహం అయితే ఇందుకు రష్యా ససేమిరా అంగీకరించకపోవడంతో ఉక్రెయిన్‌కు ఆయుధ సమస్య కూడా పెరిగిందనే చెప్పాలి. నాటోలో ఉన్న 32 దేశాల కూటమి మొత్తం జిడిపి 38 లక్షలకోట్ల డాలర్లుగా ఉంటుంది. అత్యంత శక్తివంతమైన సైనిక కూటమిగా ప్రపంచంలో విస్తరించింది. ప్రస్తుతం 30లక్షల దళాలున్నాయి. మరింతగా విస్తరించేందుకు ఈనాటో పనిచేస్తున్న సంగతి తెలిసిందే. ఈకూటమిపై ట్రంప్ ఫోకస్ పెంచడానికి ప్రత్యేక కారణం అటు హర్మూజ్, బాబ్‌ఎల్‌మండెజ్ జలసంధుల్లో ఇరాన్‌ప్రభావం తగ్గించడంలో కలిసిరాలేదన్న దుగ్ధతోపాటు గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ క్షిపణి దాడులుచేయడం కూడా ట్రంప్‌ను కలవరపరిచింది. అంతేకాకుండా చైనా,రష్యాలు ఇరాన్‌కు రహస్యంగా ఆయుధసాయం అందిస్తున్నాయన్న అనుమానాలు కూడా ట్రంప్‌లో పెరిగిపోయాయి. వీటన్నింటి దృష్ట్యా నాటో కూటమి స్పందించలేదన్న అక్కసు ట్రంప్‌లో బలంగా నాటుకుపోయింది. ట్రంప్ భావిస్తున్నట్లుగానాటో కూడా ప్రత్యక్షంగా స్పందించిన సందర్భాలుకూడా లేవు. ప్రత్యేకించి ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా సైనిక చర్యల్లో పాల్గొనలేదు. నాటో సభ్యదేశాలు కూడా అమెరికా పిలుపునకు స్పందించలేదు. గత సంఘటనలు దృష్టిలో ఉంచుకున్న ట్రంప్ నాటోపైఫోకస్ పెంచారని స్పష్టం అవుతోంది. సభ్యదేశాలైన ఫ్రాన్స్,బ్రిటన్, జర్మనీ వంటి దేశాలు కూడా హర్మూజ్‌పై స్పందించకపోగా నాటోపరంగా ఒత్తిడి కూడా తీసుకురాకపోవడం కూడా ట్రంప్ కన్నెర్రకు కారణమైంది. అంతేకాకుండా నాటోకు నిధుల సాయంలో అతిపెద్ద వాటా కూడా అమెరికాకు ఉంది. 600 మిలియన్ డాలర్లు సాలీనా నిధులు అందించడంతోపాటు ఆయుధసామగ్రి కూడా అందిస్తోంది.నాటో నిర్వహణ వ్యయంలో 15.88 శాతం అమెరికాయే భరిస్తోంది.అందువల్లనే నాటోపై ట్రంప్ ఆగ్రహంతో ఉన్నారు.ఇతరదేశాలు కూడా తమ జిడిపిలో 2శాతం చొప్పున నిధులు అందిస్తున్నాయి. అమెరికా తన రక్షణరంగ బడ్జెట్ 980 బిలియన్ డాలర్లు అంటే నాటోమొత్తం 32 సభ్యదేశాల జిడిపిలో 60శాతానికి సమానంగాఖర్చుచేస్తోంది. అందువల్లనే అమెరికా నాటోపై పెత్తనం మాదేనన్నట్లుగా వ్యవహరిస్తోంది. కేవలం రష్యాను కట్టడిచేసేందుకే ఏర్పాటు చేసిన ఈ కూటమి భవిష్యత్తులో నిర్వీర్యం అవుతుందా?ట్రంప్ తన హఠాత్ నిర్ణయాలతో ఒకవేళ నాటో నుంచి వైదొలుగుతారా అన్నది ఐరోపా కూటమి దేశాలతోపాటు ప్రపంచదేశాల్లో నలుగుతున్న జవాబు లేని ప్రశ్న.ఈప్రశ్నకు సమాధానం కూడా సమీప భవిష్యత్తులో ట్రంప్ నుంచే వెలువడాల్సి ఉంటుందని ఐరోపా కూటమిబలంగా విశ్వసిస్తోంది. అమెరికానాటోపట్ల అనుసరించే భవిష్యత్తు వైఖరి ట్రంప్ సమాధానంపైనే ఆధారపడి ఉంది. ●



మార్క్ రుట్టే

# వాతావరణ సంక్షోభానికి ప్రకృతే పరిష్కార మార్గం

**డి జె మోహన రావు**

ఒకప్పుడు వాతావరణ మార్పులు అంటే భవిష్యత్తులో సంభవించే ప్రమాదంగా మాత్రమే భావించేవారు. శాస్త్రవేత్తల నివేదికలు, అంతర్జాతీయ సదస్సులు, పర్యావరణవేత్తల హెచ్చరికలకే పరిమితమైన అంశంగా కనిపించేది. అయితే నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. వాతావరణ సంక్షోభం ఇక భవిష్యత్తు ముప్పు కాదు. మన దైనందిన జీవితాలను ప్రభావితం చేస్తున్న వాస్తవం. వేసవి పూర్తిగా ప్రారంభం కాకముందే దేశంలోని అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌ను దాటుతున్నాయి. మరో వైపు, కొన్ని గంటలపాటు కురిసే భారీ వర్షాలు నగర జీవితాన్ని స్తంభింపజేస్తున్నాయి. ప్రపంచ వాతావరణసంస్థ ప్రకారం 2024 సంవత్సరం ప్రపంచ చరిత్రలోనే అత్యంత వేడిగా నమోదైంది. పారిశ్రామిక యుగానికి ముందున్న సగటుతో పోలిస్తే భూగోళ సగటు ఉష్ణోగ్రత దాదాపు 1.5 డిగ్రీల సెల్సియస్ మేర పెరిగింది. కరవులు, వరదలు, అటవీ అగ్నిప్రమాదాలు, తుఫాన్లు మరింత తీవ్రరూపం దాల్చుతున్నాయి. ఇవన్నీ ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోందన్న హెచ్చరికలే. ఈ హెచ్చరికలు మన అభివృద్ధి నమూనాలను, జీవన విధానాలను పునఃపరిశీలించుకునే అవకాశంగా మారాలి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కార్బన్ ఉద్గారాల తగ్గింపు, పునరుత్పాదక ఇంధనాల వినియోగం, హరిత సాంకేతికతల అభివృద్ధిపై చర్చ జరుగుతోంది.ఇవన్నీ అవసరమైన చర్యలే. అయితే వాతావరణ సంక్షోభాన్ని సమర్థంగా ఎదుర్కోవాలంటే ఒక ప్రాథమిక ప్రశ్నకు సమాధానం వెతకాల్సిందే. భూమిపై జీవం కోట్లాది సంవత్సరాలుగా అనేక మార్పులను ఎదుర్కొంటూ ముందుకుసాగింది. ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులు, ప్రకృతి విపత్తులు, పర్యావరణ పరిణామాల మధ్య ప్రకృతి తనను తాను పునర్నిర్మించుకుంటూ నిలబడింది. అందుకే ప్రకృతిని కేవలం సంరక్షించాల్సిన వనరుగా మాత్రమే కాకుండా, నేర్చుకోవాల్సిన గురువుగా కూడా చూడాలి. వాతావరణ సంక్షోభానికి పరిష్కార మార్గాలను సూచించే అనేక సూత్రాలు ప్రకృతిలోనే నిక్షిప్తమై ఉన్నాయి. ప్రకృతి చెప్పే మొదటి పాఠం వైవిధ్యమే బలం అని. ప్రకృతిలో ఏ వ్యవస్థా ఏకరూపంగా ఉండదు. అడవుల్లో వందలాది రకాల చెట్లు, మొక్కలు, పక్షులు, జంతువులు, సూక్ష్మజీవులు పరస్పర సహకారంతో జీవిస్తాయి. ఈ వైవిధ్యమే వాటి స్థిరత్వానికి, మనుగడకు మూలం. ఐక్యరాజ్యసమితి జీవవైవిధ్య అంచనాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 10లక్షల జాతులు అంతరించిపోయే ముప్పును ఎదుర్కొంటున్నాయి. ఒక జాతి నష్టపోయినా మొత్తం వ్యవస్థ కుప్పకూలదు. వాతావరణ మార్పుల కాలంలో ఈపాఠం మరింత ప్రాధాన్యం సంతరించుకుంటోంది. వ్యవసాయ రంగాన్నే తీసుకుంటే, ఒకే పంటపై ఆధారపడే విధానాలు అధిక ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. వర్షపాతం మారినా, తెగుళ్లు వ్యాపించినా రైతు ఆదాయం మొత్తం దెబ్బతింటుంది. అదే మిశ్రమ పంటలు, స్థానిక విత్తనాలు, వ్యవసాయ అటవీ విధానాలు అదనపు రక్షణ కల్పిస్తాయి. కాబట్టి జీవ వైవిధ్య పరిరక్షణ అనేది కేవలం పర్యావరణ అంశం మాత్రమే కాదు, అది ఆహార భద్రత, ఆర్థిక భద్రత, సామాజిక స్థిరత్వానికి కూడాపునాది. ప్రకృతి చెప్పే రెండో పాఠం పునరుద్ధరణ సామర్థ్యం. శాస్త్రీయ పరిభాషలో దీనిని రెసిలియెన్స్ అంటారు. ప్రకృతిలో ఏ వ్యవస్థా శాశ్వత స్థితిలో ఉండదు. పరిస్థితులకు అనుగుణంగా తనను తాను మార్చుకుంటూ ముందుకు సాగుతుంది. వరదల తర్వాత నదులు మళ్లీ తమ ప్రవాహాన్ని సర్దుబాటు చేసుకుంటాయి. అగ్నిప్రమాదాల అనంతరం అడవులు క్రమంగా పునరుజ్జీవనం పొందుతాయి. ఇదే ప్రకృతి అసలు బలం. నేడు ఇదే లక్షణం మానవ సమాజానికీ అత్యవసరం. నగరాలు, గ్రామాలు, వ్యవసాయ వ్యవస్థలు, మౌలిక సదుపాయాలు వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యాన్ని పెంచుకోవాలి. వరదలు వచ్చినప్పుడు నీటిని పూర్తిగా బయటకు పంపే ప్రయత్నం చేయడం కంటే, దానిని నిల్వ చేసుకునే సహజ వ్యవస్థలను బలోపేతం చేయడం మరింత ప్రయోజనకరం. వర్షపు నీటి సంరక్షణ,



చెరువుల పునరుద్ధరణ, భూగర్భ జలాల పునర్భరణ వంటి చర్యలు వాతావరణ అనుకూలతను పెంచుతాయి. ప్రకృతి చెప్పే మూడో పాఠం పరిమితుల పట్ల గౌరవం. ప్రకృతిలో ప్రతి వ్యవస్థకు ఒక భరించే సామర్థ్యం ఉంటుంది. నదులు, అడవులు, నేలలు, సముద్రాలు అన్నింటికీ హద్దులు ఉన్నాయి. ఆ పరిమితులను దాటినప్పుడు సమతుల్యత దెబ్బతింటుంది. ప్రస్తుతం ఎదురవుతున్న అనేక పర్యావరణ సమస్యలకు మూల కారణం ఇదే. అధిక భూగర్భ జల వినియోగం, అడవుల నరికివేత,తీరప్రాంతాల ఆక్రమణ, సహజ జలవనరుల విధ్వంసం వంటి చర్యలు ప్రకృతి పరిమితులను విస్మరించిన ఫలితాలే. అభివృద్ధి అంటే ప్రకృతిని జయించడం కాదని, దానితో సమన్వయంగా ముందుకు సాగడమేనని ఈ పాఠం గుర్తు చేస్తుంది. భవిష్యత్తు అభివృద్ధి నమూనాలు కూడా ప్రకృతి సామర్థ్యాలను గౌరవించే విధంగానే రూపుదిద్దుకోవాలి. వాతావరణ మార్పులను ఎదుర్కొనే క్రమంలో ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి ఆధారిత పరిష్కారాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. శాస్త్రవేత్తలు, విధాన నిర్ణేతలు, అంతర్జాతీయ సంస్థలు ప్రకృతి అందించే సేవల విలువను మరింత స్పష్టంగా గుర్తిస్తున్నాయి. దీనికి అడవులే ఉత్తమ ఉదాహరణ. ప్రపంచంలో అతిపెద్ద సహజ కార్బన్ నిల్వ కేంద్రాలుగా అవి పనిచేస్తాయి. ప్రపంచ కార్బన్ ఉద్గారాల్లో సుమారు 30 శాతం వరకు శోషించడంలోఅడవులు, ఇతర సహజ పర్యావరణ వ్యవస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమంఅంచనా వేస్తోంది. వర్షపాతం చక్రాన్ని ప్రభావితం చేయడం, నేల సారాన్ని కాపాడటం, జీవ వైవిధ్యానికి ఆశ్రయం కల్పించడం వంటి అనేక సేవలను అవి అందిస్తాయి. అందువల్ల అడవుల సంరక్షణ అనేది కేవలం పర్యావరణ కార్యక్రమం కాదు, వాతావరణ విధానంలో కీలక అంశం. చిత్తడి నేలలు, చెరువులు, సరస్సులు, మడ అడవులు కూడా అమూల్యమైన సేవలను అందిస్తున్నాయి. ఇవి వరద నీటిని నిల్వ చేస్తాయి, తీర ప్రాంతాలను రక్షిస్తాయి, భూగర్భ జలాలను పునరుద్ధరిస్తాయి. అయితే పట్టణీకరణ, భూ వినియోగ మార్పుల కారణంగా ఈ వ్యవస్థలు వేగంగా కనుమరుగవుతున్నాయి. ఈ నష్టాన్ని పూడ్చుకోకుండా వాతావరణ అనుకూల అభివృద్ధి గురించి మాట్లాడటం అసంపూర్ణమే. నగరాల్లో ప్రకృతి పాత్రను కూడా కొత్తగా నిర్వచించాల్సిన అవసరం ఉంది. ప్రపంచ జనాభాలో సగానికి పైగా ప్రజలు ఇప్పటికే నగరాల్లో నివసిస్తున్నారు. భారతదేశంలోనూ పట్టణీకరణ వేగంగా విస్తరిస్తోంది. కాంక్రీటు నిర్మాణాలు పెరగడం, పచ్చదనం తగ్గిపోవడం వల్ల నగరాలు అధిక ఉష్ణోగ్రతలతో సతమతమవుతున్నాయి. చెట్లు, పార్కులు, నగర అడవులు, గ్రీన్ కారిడార్లు ఉష్ణోగ్రతలను తగ్గించడమే కాకుండా గాలి నాణ్యతను మెరుగుపరుస్తాయి. ప్రజారోగ్యానికి కూడా తోడ్పడతాయి. భారతదేశానికి నీటి వనరుల పరిరక్షణ మరింత కీలకం. ప్రపంచ జనాభాలో దాదాపు 18శాతం మంది భారతదేశంలో నివసిస్తున్నప్పటికీ,ప్రపంచ మంచినీటి వనరుల్లో కేవలం 4 శాతం మాత్రమే మనకు అందుబాటులో ఉన్నాయి. నీతి ఆయోగ్ అంచనాల ప్రకారం దేశంలో సుమారు 60 కోట్ల మంది ప్రజలు ఇప్పటికే నీటి ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. వాతావరణ మార్పుల ప్రభావంతో ఈ ఒత్తిడి మరింత పెరుగుతోంది. అందువల్ల సంప్రదాయ నీటి సంరక్షణ వ్యవస్థలు, చెరువులు, కుంటలు, వర్షపు నీటి సేకరణ పద్ధతుల పునరుద్ధరణ అత్యవసరంగా మారింది. అంతేకాదు, భారతీయ సమాజంలో శతాబ్దాలుగా కొనసాగుతున్న స్థానిక పర్యావరణ జ్ఞానం కూడా విలువైన సంపద. నీటి నిర్వహణ, భూసార పరిరక్షణ, సామూహిక వనరుల సంరక్షణకు సంబంధించిన అనేక సంప్రదాయ పద్ధతులు గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కనిపిస్తాయి. ఆధునిక శాస్త్ర సాంకేతికతతో వాటిని అనుసంధానిస్తే మరింత స్థిరమైన ఫలితాలు సాధ్యమవుతాయి. వాతావరణ చర్య అనేది ప్రభుత్వాలకే పరిమితమైనబాధ్యత కాదు. పరిశ్రమలు, విద్యాసంస్థలు, స్థానిక సంస్థలు, పౌర సమాజం, ప్రతి వ్యక్తి ఇందులో భాగస్వాములు కావాలి. శక్తి వినియోగాన్ని తగ్గించడం, నీటిని పొదుపుగా వినియోగించడం, వ్యర్థాలను తగ్గించడం, పచ్చదనాన్ని పెంచడం వంటి చర్యలు వ్యక్తిగత స్థాయిలో చిన్నవిగా కనిపించినా, సమిష్టిగా అవి పెద్ద మార్పుకు దారితీస్తాయి. ప్రకృతి స్ఫూర్తితో ముందుకు సాగే సమాజమే భావితరాలకు సురక్షితమైన, స్థిరమైన ప్రపంచాన్ని అందించగలదు. ●



# భారతీయ నౌకపై దాడి అవాస్తవం

## తప్పుడు సమాచారం నమ్మవద్దని విదేశాంగశాఖ వెల్లడి

**న్యూఢిల్లీ,జూన్ 13:** ఒమన్ తీరం లో భారతీయ సిబ్బంది ఉన్న మరో నౌకపై దాడి జరిగిందన్న సమాచారంపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. మరో నౌకపై దాడి జరిగిందన్న వార్తలు అవాస్తవమని పేర్కొన్నది. భారత సిబ్బందితో ఉన్న లియాకీ ఫ్రీడమ్ అనే నౌక ఒమన్ తీరం వెంబడి ప్రయాణిస్తుండగా దాని నుంచి ఒక్కసారిగా స్పందన ఆగిపోయింది. దాంతో అమెరికా దాడి చేసిందంటూ పలు వార్తా పత్రికల్లో వార్తలు వచ్చాయి. ఈ ఘటనలో నలుగురు భారతీయ నావికులు మరణించారంటూ ప్రచారం జరిగింది. సామాజిక మాధ్యమాల్లో కూడా పెద్దఎత్తున పోస్టులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలోనే విదేశాంగశాఖ స్పందించింది. ఆ నౌకలోని మాస్టర్‌తో మాట్లాడినట్లు పేర్కొన్నది. నౌకపై ఎలాంటి దాడి జరగలేదని ధ్రువీకరించింది. సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారని స్పష్టంచేసింది. ఇలాంటి తప్పుడు వార్తల ప్రచారంపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించింది. కాగా ఇటీవల ఒమన్ తీరం సమీపంలో భారతీయులు ఉన్న నౌకలపై వరుసగా దాడులు జరిగాయి. వారం వ్యవధిలో మూడు నౌకలను అమెరికా సైన్యం లక్ష్యంగా చేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు భారత నావికులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర ఆందోళన రేకెత్తించింది. భారత్ ఈ దాడులను తీవ్రంగా ఖండించింది. తక్షణమే ఈ చర్యలను ఆపేయాలంటూ అమెరికాపై నిరసన వ్యక్తం చేసింది. కాగా హార్మూజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలే లక్ష్యంగా ఇరాన్ డ్రోన్‌లు ప్రయోగించిందని అమెరికా దళాలు ఆరోపించాయి. ఈ ఆరోపణలను ఇరాన్ ఖండించింది.అమెరికాయే దాడులుచేసి తమపై అభియోగాలు నెట్టేస్తోందని ఇరాన్‌ప్రతినిధి ఆరోపించారు.

# మమత, అభిషేక్‌లకు ఉచ్చుబిగిస్తున్న సిఎం సువేందు!



**కోల్‌కత్తా,జూన్ 13:** పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సంబంధించిన సంతకాల ఫోర్జరీ ఆరోపణల కేసు దర్యాప్తు ముమ్మరం అయింది. ఈ కేసులో సీఐడీ దూకుడుగా వ్యవహరిస్తోంది. ఇప్పటివరకు 13 మంది ఎమ్మెల్యేల వాంగ్మూలాలను నమోదు చేసింది. ఈ వ్యవహారంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, లోక్ సభ సభ్యుడు అభిషేక్ బెనర్జీ ఆరోపణలను ఎదుర్కొంటోన్నారు. ఆయనకు సీఐడీ తాజాగా నోటీసులు జారీ చేసింది. అదే సమయంలో ఆయన నివాసంపై కోల్‌కతా పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కేంద్ర బలగాలు సైతం ఇందులో పాలుపంచుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ తెల్లవారు జామున 3 గంటల సమయంలో కోల్ కత కాళీఘాట్ లోని నివాసంలో ఈ సోదాలు ఆరంభం అయ్యాయి. ఉదయం వరకూ కొనసాగాయి. కేంద్ర భద్రతా బలగాల పర్యవేక్షణలో అత్యంత నాటకీయ పరిణామాల మధ్య సాగిన ఈ ఆపరేషన్ పశ్చిమ బెంగాల్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. అభిషేక్ బెనర్జీ వ్యక్తిగత సహాయకుడు సుమిత్ రాయ్‌కు సంబంధించిన ఓ కేసు ఆధారంగా ఈ సోదాలు జరిగినట్లు తెలుస్తోంది. నాలుగు గంటల పాటు సాగిన ఈ శోధన ముగిసిన అనంతరం అభిషేక్ విలేకరులతో మాట్లాడారు. తాళం పగలగొట్టి, ఇంట్లోకి ప్రవేశించి ప్రతి గదిలోనూ సోదాలు చేశారని ఆరోపించారు. ఈ పోలీస్ ఆపరేషన్ విషయం తెలియగానే మాజీ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఆయన నివాసానికి చేరుకున్నారు. రాజకీయ కక్షసాధింపు చర్యలకు అడ్డు అదుపు ఉండట్లేదని, నానాటికీ దిగజారుతున్నాయని మండిపడ్డారు. అసెంబ్లీ సంతకాల ఫోర్జరీ కేసులో అభిషేక్ బెనర్జీని ఇటీవలే సీఐడీ అధికారులు దాదాపు ఆరు గంటల పాటు అభిషేక్ ను సంగతి తెలిసిందే. ఈ విచారణ ముగిసిన రెండు రోజుల వ్యవధిలోనే ఆయన నివాసంపై జరిగిన ఈ తాజా దాడి తృణమూల్ నేతల్లో తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించింది. దర్యాప్తు సంస్థలు మరోసారి ఆయనకు సమన్లు ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు, పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్యే మదన్ మిత్ర కూడా టార్గెట్ అయ్యారు. ఆయనకు చెందిన నివాసాలు, కార్యాలయాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఏకకాలంలో ఏడు చోట్ల సోదాలు నిర్వహించింది. మున్సిపల్ నియామకాల కుంభకోణంలో భాగంగా దక్షిణేశ్వర్‌లోని ఆయన నివాసంలో ఈ తనిఖీలు చేపట్టారు. సుమారు 125 కంటే ఎక్కువ అక్రమ నియామకాలతో మిత్రాకు సంబంధాలు ఉన్నాయని, దళారుల ద్వారా ఆయన పెద్ద ఎత్తున లంచాలు తీసుకున్నారని ఈడీ అధికారులు ప్రాథమికంగా ఆరోపిస్తున్నారు.

# లీకేజిలపై రాహుల్ ఆందోళనలు!



**న్యూఢిల్లీ,జూన్ 13:** పేపర్ లీకేజీ, పరీక్షల్లో స్కాంలు వంటి అంశాల్లో కేంద్ర సర్కార్ వైఫల్యాలపై పోరాడేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతోంది. ఆ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది. ఇటీవల నీట్ పేపర్ లీకేజీ, సీబీఎస్ఈ పరీక్షా ఫలితాల్లో అవకతవకలు, నిరుద్యోగం వంటి అంశాలపై రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టనుంది. ఈ విషయాన్ని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. విద్యార్థులు, యువత, నిరుద్యోగులు, పలు సంస్థలతో కలిసి భారీ ఎత్తున వరుస నిరసనలు చేపడుతామన్నారు. ప్రస్తుతం కేంద్ర వైఫల్యం వల్ల యువత, విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వేణుగోపాల్ అన్నారు. ఈ నేపథ్యంలో అనేక ప్రాంతాల్లో రాహుల్ పర్యటించి ఆందోళన చేస్తారు. ముందుగా జూన్ 17న కోటలో విద్యార్థులతో సమావేశమవుతారు. అనంతరం ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్) జూలై 10న, పాట్నాలో జూలై 11న, జూలై 14న ఢిల్లీలో రాహుల్ విద్యార్థులు, యువతతో కలిసి ఆందోళన చేస్తారు.

దేశంలో వరుసగా జరుగుతున్న పేపర్ లీకేజీలతో మిలియన్లకొద్దీ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వారి తల్లిదండ్రులు అదనపు ఖర్చులు భరించలేకపోతున్నారని, ఉద్యోగాల నియామకాల్లో, పరీక్షల నిర్వహణలో పారదర్శకత లోపించిందని వేణుగోపాల్ విమర్శించారు. ఈ నిరసనల్లో ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, పీసీసీలు, డీసీసీలు పాల్గొంటారని వేణుగోపాలు తెలిపారు. కేంద్రానికి నిరసన తగిలేలా, అందరినీ ఏకం చేసే లక్ష్యంతో ఈ ఆందోళన కార్యక్రమాలుంటాయన్నారు.

# కొత్త ఆర్మీచీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్‌సేథ్!




**న్యూఢిల్లీ,జూన్ 13:** ఆర్మీ కొత్త చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్‌సేథ్ నియమితులయ్యారు. ఆయన నియామకం ఈనెల 30వ తేదీనుంచి అమలులోకి వస్తుంది. ప్రస్తుత చీఫ్ ఆఫ్‌ది ఆర్మీస్టాఫ్ జనరల్‌ఉపేంద్ర ద్వివేది రిటైర్ అవుతున్న సంగతి తెలిసిందే. ఆర్మీస్టాఫ్‌కు వైస్‌చీఫ్‌గా లెఫ్టినెంట్ ఝనరల్ సేథ్ కొనసాగుతున్నారు. నేషనల్ డిఫెన్స్ అకాడమి పూర్వ విద్యార్థి అయిన సాయుధ దళాల్లోకి 1986 డిసెంబరులో వచ్చిచేరారు. నాలుగు దశాబ్దాలపాటు మిలిటరీలో కెరీర్‌ను కొనసాగించారు. నిర్వహణ, వ్యూహాల అమలులో మంచి సామర్థ్యం ఉన్న వ్యక్తి. సంస్థాగతంగా కూడా మంచి పట్టు ఉన్న అధికారిగా పేరుంది. భారత్ ఆర్మీ దళాల తుదముట్టించే వ్యూహాలకు ఆయనే పదును పెడతారు.

దళాల ఆధునీకరణపై లెఫ్టినెంట్ గవర్నర్ ఎక్కువ ఫోకస్‌పెట్టారు. భవిష్యత్తు యుద్ధ తంత్రాలను అమలుచేయడంలో ఆయన దిట్ట అని పేరుంది. జమ్ముకాష్మీర్‌లో కౌంటర్ ఇన్‌సర్జెన్సీ ఫోర్స్‌కు కమాండెట్‌గా వ్యవహరించారు. సుదర్శన్‌చక్ర కార్ప్స్‌కు లెఫ్టినెంట్ జనరల్ హోదాలో పర్యవేక్షణచేసారు. నైరుతి కమాండ్, దక్షిణ కమాండ్‌లను పర్యవేక్షించిన ఆయన సంక్లిష్టపరిస్థితులను అధిగమించే వ్యూహాలు అమలుచేసారు. లెఫ్టినెంట్‌ఝనరల్‌సేత్ వృత్తిపరంగా మిలిటరీ విద్యలో కూడా నిపుణులు. శిక్షణలో కూడా ఆయన ఉన్నతస్థాయి పదవుల్లోకొనసాగారు. ఎన్డీసీలో హైయ్యర్ కమాండ్ కోర్సు కూడా అభ్యసించారు. మధ్యప్రదేశ్‌లోని సైనిక్‌స్కూల్ పూర్వ విద్యార్థి. 1984లో జమ్ముకాశ్మీర్ రైఫిల్స్‌కు 1984లో పర్యవేక్షించారు

# శత్రు మిస్సైళ్లను ఎదుర్కొనే రక్షణ వ్యవస్థ

### - యాంటీ షిప్ మిస్సైళ్లను ఢీకొట్టే టెక్నాలజీని పరీక్షించిన డిఆర్‌డిఒ - పెరిగిన స్వదేశీ రక్షణ సామర్థ్యం - బిఎండి సామర్థ్యం ఉన్న ఎలైట్ దేశాల్లో భారత్



**న్యూఢిల్లీ,జూన్ 13:** భారత రక్షణ పరిశోధనా అభివృద్ధి సంస్థ అత్యాధునిక డిఫెన్స్ సిస్టమ్‌ను పరీక్షించింది. బాలిస్టిక్ క్షిపణులను ఎదుర్కొనే రక్షణ వ్యవస్థలతో పాటు యాంటీ షిప్ మిస్సైళ్లను ఎదుర్కొనే టెక్నాలజీని పరీక్షించినట్లు శనివారం డీఆర్డీవో వెల్లడించింది. ఈ ట్రయల్ పరీక్షలు జూన్ 10,11వ తేదీల్లో నిర్వహించారు. ప్రస్తుతం ఆధుని టెక్నాలజీతో వస్తున్న క్షిపణులు, మారీటైం ముప్పును ఎదుర్కొనే రీతిలో ఉండే కొత్త తరహా టెక్నాలజీ ఆధారిత ఆయుధాలను పరీక్షించినట్లు డీఆర్డీవో పేర్కొన్నది. స్వదేశీ రక్షణ సామర్థ్యాన్ని పెంచుకోవాలన్న దీక్షతో భారత్ తన ఆయుధ పరీక్షలను చేపట్టింది. మూడు రకాల ఫ్లయిట్ టెస్ట్‌లను నిర్వహించినట్లు రక్షణ శాఖ ప్రకటించింది. ఈ విన్యాసాల్లో భాగంగా ఇంటర్‌సెప్టార్ క్షిపణులను లాంచ్ చేశారు. నిర్దేశిత టార్గెట్లపై వాటిని పరీక్షించారు. అనుకున్న లక్ష్యాలను అందుకున్నట్లు తెలిసింది. బాలిస్టిక్ మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్‌కు చెందిన పలు దశలను ఈ పరీక్షల్లో టెస్ట్ చేశారు. దూసుకు వస్తున్న క్షిపణులను నిర్వీర్యం చేసేందుకు కావాల్సిన టెక్నాలజీని పరీక్షించారు. మిస్సైల్‌ను డిటెక్ట్ చేసి, ట్రాక్ చేసి దాన్ని ధ్వంసం చేసే టెక్నాలజీని పరీక్షించారు. భారత వ్యూహాత్మక భద్రత అంశంలో ఇదొక ముందడుగు అని ప్రభుత్వ అధికారులు పేర్కొన్నారు. బాలిస్టిక్ క్షిపణుల నుంచి వచ్చే ముప్పును ఎదుర్కొనే దేశాల్లో ఇప్పుడు ఇండియా కూడా చేరినట్లు రక్షణ శాఖ పేర్కొన్నది. కొన్ని దేశాల వద్ద మాత్రమే ఈ టెక్నాలజీ అందుబాటులో ఉన్నది. బాలిస్టిక్ నుంచి ఖండాతర క్షిపణులను కూడా ఎదుర్కొనే రీతిలో కొత్త టెక్నాలజీని పరీక్షించారు. బీఎండీ సామర్థం ఉన్న ఎలైట్ దేశాల్లో ఇండియా చేరినట్లు రక్షణ శాఖ తెలిపింది. నావల్ యాంటీ షిప్ మిస్సైల్ మీడియం రేంజ్ పరీక్ష కూడా డీఆర్డీవో విజయవంతంగా పరీక్షించింది. యాంటీ షిప్ మిస్సైల్ ముప్పును కూడా సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. అయితే మారీటైం దళాలకు ఇది చాలా శక్తిని ఇస్తుందని అధికారులు చెబుతున్నారు. సముద్రం మార్గంలో ఉన్న శత్రువులను చిత్తు చేసేందుకు యాంటీషిప్ మిస్సైల్ టెక్నాలజీ మన నౌకాదళాన్ని బలోపేతం చేస్తుందన్నారు. విదేశీ రక్షణ వ్యవస్థల కన్నా స్వదేశీ రక్షణ వ్యవస్థలపై ఆధారపడే రీతిలో డీఆర్డీవో పరీక్షలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇవాళ డీఆర్డీవోకు శుభాకాంక్షలు తెలిపారు. మూడు రకాల పరీక్షల్లో పాల్గొన్న బృందాలకు ఆయన కంగ్రాట్స్ చెప్పారు. దేశ రక్షణ సామర్థ్యాన్ని పెంచే కీలకమైన టెక్నాలజీ పరీక్షలను భారత్ విజయవంతంగా చేపట్టినట్లు ఆయన తన ఎక్స్ అకౌంట్‌లో పేర్కొన్నారు. విభిన్న రకాల శత్రువులను ఎదుర్కొన్న రీతిలో ఆ రక్షణ పరీక్షలు జరిగినట్లు ఆయన వెల్లడించారు. లాంగ్ రేంజ్ బాలిస్టిక్ మిస్సైళ్లు, యాంటీ షిప్ మీడియం రేంజ్ సామర్థ్యాన్ని పరీక్షించినట్లు ఆయన చెప్పారు. బీఎండీ పరీక్షలో భాగంగా ఇంటర్‌సెప్టార్‌లు కచ్చితత్వంతో టార్గెట్లను ఛేధించినట్లు తెలిపారు. ఐసీబీఎంలను కూడా ఎదుర్కొనే సామర్థం భారత్ వద్ద ఉందన్నారు.

# కోర్టులో విడాకుల కేసు నడుస్తున్నా.. మామపై అల్లుడి దయాగుణం

### సొంతడబ్బుతోఖరీదైన వైద్యం..

### కోర్టులోనే కాళ్లపైపడి క్షమాపణ కోరిన భార్య



**న్యూఢిల్లీ,జూన్ 13:** విడాకులకోసం దరఖాస్తుచేసి భర్త, ఆమె కుటుంబాన్ని ముప్పుతిప్పలు పెట్టిన మామకు అత్యున్నతస్థాయి చికిత్సను అందించి ఆదుకున్న యువకుడి ఉదంతం అన్నివర్గాలప్రశంసలకు నోచుకుంది. ఢిల్లీకి చెందిన శిఖ, సౌరభ్‌లమధ్య చిన్నపాటి అహంకార పోరాటంతో విచ్ఛిన్నం అయింది. 2020లో శిఖ, సౌరభ్‌ల వివాహం ఎన్నో ఆశల మధ్య వైభవంగా జరిగింది. పెళ్లయిన కొద్దిరోజులకే వారి మధ్య అభిప్రాయ బేధాలు తలెత్తాయి. ఒకరినొకరు అర్థం చేసుకునే సహనం లోపించింది. ఈ క్రమంలో శిఖ భర్తపై, అతని కుటుంబంపై కోర్టులో వరకట్న వేధింపుల కేసు నమోదు చేసింది. ఆ క్షణం నుంచి ఆ కుటుంబంలో ప్రశాంతత కరువైంది. ఏ తప్పు చేయని భర్త, అతని తల్లిదండ్రులు కోర్టుల చుట్టూ, లాయర్ల చుట్టూ తిరగాల్సి వచ్చింది. ఏళ్ల తరబడి విచారణలు సాగాయి కానీ, అటు శిఖ అహం తగ్గలేదు ఇటు సౌరభ్ వైపు నుంచి సయోధ్య కుదరలేదు. న్యాయపోరాటాలు ఎప్పుడూ ఇరువైపులా విధ్వంసాన్నే మిగులుస్తాయి. కూతురి పెళ్లి పేరిట కోర్టుల చుట్టూ తిరగడం, లాయర్ల ఫీజులు భరించడం, సమాజంలో తలెత్తుకోలేకపోవడం శిఖ తండ్రిని తీవ్ర మానసిక క్షోభకు గురిచేసింది. కూతురి భవిష్యత్తు ఏమైపోతుందోనన్న ఆందోళన, నిరంతర ఒత్తిడి ఆయన ఆరోగ్యాన్ని క్షీణింపజేశాయి. ఒకరోజు ఆ భారం తట్టుకోలేక ఆయనకు తీవ్రమైన గుండెపోటు వచ్చింది. అత్యవసర స్థితిలో ఆయనను ఒక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల, సరైన వైద్య సదుపాయాలు అందక ఆయన అక్కడ మరణంతో పోరాడుతున్నారు. కూతురు పెట్టిన కేసు చివరికి కన్నతండ్రి ప్రాణాలకే ముప్పుగా పరిణమించిన దారుణ పరిస్థితి అది. తనను, తన కుటుంబాన్ని కోర్టుల చుట్టూ తిప్పి నరకం చూపించిన భార్య తండ్రి చావుబతుకుల్లో ఉన్నాడనే వార్త భర్త సౌరభ్‌కు తెలిసింది. సాధారణంగా అయితే కక్ష సాధింపులు, కేసు వ్యవహారాలు.. వాళ్ల మధ్య దూరాన్ని పెంచుతాయి. కానీ, సౌరభ్ తనలోని అహాన్ని పక్కన పెట్టాడు. తక్షణమే స్పందించి, ఆయన్ను ప్రభుత్వ ఆసుపత్రి నుండి దేశంలోనే అత్యుత్తమమైన కార్పొరేట్ హాస్పిటల్ మెదాంత్తకు తరలించాడు. తన సొంత డబ్బు ఖర్చు పెట్టి, దగ్గరుండి పర్యవేక్షించి, ఒక కన్నకొడుకులా నిలబడి ఆ ముసలి ప్రాణాన్ని కాపాడాడు. ఆ తర్వాత కొద్దిరోజులకే కోర్టులో తదుపరి విచారణ వాయిదా వచ్చింది. జడ్జి బెంచ్ మీదకు వచ్చారు. లాయర్లు తమ వాదనలు వినిపించడానికి సిద్ధమయ్యారు. విడాకుల పత్రాలు టేబుల్ మీద ఉన్నాయి. అందరినీ దిగ్భ్రాంతికి గురిచేస్తూ శిఖ ముందడుగు వేసింది. లాయర్ చేతిలోని విడాకుల పత్రాలను లాక్కుని, జడ్జి ముందే వాటిని ముక్కలు ముక్కలుగా చింపేసింది. కన్నీళ్లతో భర్త సౌరభ్ కాళ్లపై పడింది. ఏ చట్టాలు, ఏ లాయర్లు, ఏళ్ల తరబడి సాగిన కోర్టు వాదనలు మార్చలేని ఆమె కఠిన హృదయాన్ని భర్త చూపిన ఆ ఒక్క మానవత్వం, నిష్కల్మషమైన కరుణ పూర్తిగా మార్చేసింది. తప్పుడు కేసుల కంటే, ఈగోల కంటే బంధం గొప్పదని గ్రహించిన ఆమె భర్తతో కలిసి జీవించడానికి సిద్ధమైంది. ఈ విడాకుల ఉదంతం నేటి ఆధునిక సమాజానికి, ముఖ్యంగా వైవాహిక బంధాల్లో ఉన్నవారి సంబంధాలకు అద్దం పడుతోంది. కోర్టులు, కాగితాలు మనసులను కలపలేవు.

# జులై 9న ఖొమేనీ అంత్యక్రియలు



**టెహ్రాన్,జూన్ 13:** ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్య క్రియలు వచ్చే నెల 9న జరగనున్నాయి. ఖమేనీ స్వస్థలమైన మషాద్‌లో అంత్య క్రియలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఇరాన్ ప్రభుత్వం ప్రకటించింది. జూలై 4 నుంచి ఖమేనీ అంత్యక్రియల ప్రక్రియ మొదలవుతుందని తెలిపింది. అమెరికాఇజ్రా యెల్ సైన్యాలు ఫిబ్రవరి 28న ఇరాన్ పై చేసిన దాడుల్లో ఖమేనీ మరణించారు. అయితే భీకర యుద్ధం కారణంగా ఆయన అంత్య క్రియలు వాయిదాపడుతూ వస్తున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, భద్రతా కారణాలు, మొహర్రం మాసంలో ప్రజల సంతాప కార్యక్రమాలు ఉన్నందున వాయిదా పడ్డాయి. ఇస్లామిక్ ప్రకారం మొదటి నెల అయిన మొహర్రం ప్రారంభంలో మూడు రోజుల కార్యక్రమాన్ని నిర్వహించాలని ఇరాన్ అంతకుముందు భావించింది. అయితే కర్బలా యుద్ధంలో అమరులైన ప్రముఖ షియా నాయకుడు ఇమామ్ హుస్సేన్ స్మారకార్థం సంతాప కార్యక్రమాలను పూర్తి చేసుకునేందుకు అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించారు.

# భారత్‌కు భద్రతామండలి సభ్యత్వం సహేతుకమే


### అంతర్జాతీయ అణుఇంధనసంస్థ ఛీఫ్ మారియానో గ్రాస్సీ



**వియన్నా,జూన్ 13:** అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయాలు వేగంగా మారుతున్న తరుణంలో అంతర్జాతీయ వేదికపై భారత్‌కు అరుదైన మైలేజ్ లభించింది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం లభించాలనే డిమాండ్ అత్యంత సహేతుకమైనదని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ అధినేత రాఫెల్ మరియానో గ్రాస్సీ స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి తదుపరి సెక్రటరీ జనరల్ రేసులో అత్యంత కీలక అభ్యర్థిగా ఉన్న గ్రాస్సీ వియన్నాలో ప్రత్యేక ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ అణు పర్యవేక్షణ సంస్థ అధినేతగా, సుదీర్ఘ అనుభవం ఉన్న అంతర్జాతీయ దౌత్యవేత్తగా ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు భద్రతా మండలి విస్తరణపై భారత్ చేస్తున్న సుదీర్ఘ పోరాటానికి బలమైన మద్దతుగా నిలిచాయి. ఐక్యరాజ్యసమితి ప్రస్తుత నిర్మాణాన్ని మార్చాల్సిన అవసరాన్ని రాఫెల్ గ్రాస్సీ బలంగా సమర్థించారు. భారత్ లాంటి దేశాలు ఈ రకమైన ఆకాంక్షను కలిగి ఉండటం కేవలం సహేతుకమే. ఎందుకంటే 1945 నాటి ప్రపంచం వేరు, ప్రస్తుత 2026 నాటి ప్రపంచం వేరని ఆయన వ్యాఖ్యానించారు. ఐక్యరాజ్యసమితి ప్రస్తుత నిర్మాణం పాతబడిపోయిందని, సమకాలీన వాస్తవాలకు అనుగుణంగా తక్షణ సంస్కరణలు అవసరమని భారత్ ఎప్పటి నుంచో చెప్తున్న వాదనతో ఆయన ఏకీభవించారు. అయితే ఒక దౌత్యవేత్తగా సమతుల్యతను పాటిస్తూ సమితి సెక్రటరీ జనరల్ పదవికి కొన్ని పరిమితులు ఉంటాయని ఎవరికి సభ్యత్వం ఇవ్వాలనేది సభ్య దేశాల మధ్య విస్తృతమైన ఒకకాభిప్రాయంపైనే ఆధారపడి ఉంటుందని గుర్తుచేశారు. కానీ అధికారిక సభ్యత్వంతో సంబంధం లేకుండానే నేడు ప్రపంచంలో భారత్ యొక్క ప్రభావం, ఆర్థిక, భౌగోళిక రాజకీయ బలం ఎవరూ తిరస్కరించలేని విధంగా పెరిగిందని ఆయన కొనియాడారు. ప్రస్తుత యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్ రెండో విడత పదవీ కాలం 2026 డిసెంబర్ 31తో ముగియనుంది. దీంతో 2027 జనవరి నుంచి కొత్త చీఫ్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ రేసులో రాఫెల్ గ్రాస్సీ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.

అయితే ఈసారి ఐరాస చరిత్రలోనే మొదటి సారిగా ఒక మహిళా నేతకు ఈ అత్యున్నత పీఠాన్ని అప్పగించాలనే డిమాండ్ కూడా బలంగా ఉంది. చిలీ మాజీ అధ్యక్షురాలు మిచెల్ బాచెలెట్, సీనియర్ ఐరాస అధికారి రెబెకా గ్రిన్‌స్పాన్ వంటి మహిళా నేతలు ఈ రేసులో ఉన్నారు.

# ట్రంప్ 80వ బర్త్‌డేకు వైట్‌హౌస్‌లో ప్రత్యేక ఏర్పాట్లు!



**వాషింగ్టన్,జూన్ 13:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ 80వ పుట్టినరోజు వేడుకలు వేడుకలు స్పెషల్‌గా నిర్వహించేందుకు వైట్‌హౌస్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు వైరల్ అవుతున్నాయి. జూన్ 14న నిర్వహించే రాత్రి ఈవెంట్‌కు దాదాపు రూ.500 కోట్లు ఖర్చు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇక ట్రంప్ పుట్టినరోజును పురస్కరించుకుని వైట్‌హౌస్ దగ్గర అల్టిమేట్ ఫైటింగ్ ఛాంపియన్‌షిప్ ఫ్రీడమ్ 250 ఈవెంట్‌గా నిర్వహిస్తున్నారు. ఇందు కోసం సన్నాహాలు జరుగుతున్నాయి. పలు దేశాలకు చెందిన ఫైటర్లు ఇందులో పాల్గొననున్నారు. ఒకవైపు ట్రంప్ బర్త్‌డే వేడుకలు ఇంకోవైపు ఛాంపియన్‌షిప్ క్రీడలతో వైట్‌హౌస్ కళకళలాడుతోంది. ఈ వేడకను అమెరికన్ పోరాట స్ఫూర్తికి తరంలో ఒక్కసారే వచ్చే వేడుక అని వైట్ హౌస్ అభివర్ణించింది. ఇక అమెరికా 250 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫ్రీడం 250 అని ఈవెంట్‌కు పేరు పెట్టారు. గతేడాది రెండోసారి ట్రంప్ అధికారంలోకి వచ్చారు.

అయితే ఈసారి చాలా దూకుడుగా వెళ్తున్నారు. రెండోసారి అధికారంలోకి రాగానే ప్రపంచ దేశాలపై వాణిజ్య యుద్ధాన్ని ప్రకటించారు. ఇక ఏడాది ప్రారంభంలో వెనిజులా అధ్యక్షుడు మదురోను కిడ్నాప్ చేయించారు. ఇక ఇరాన్‌పై యుద్ధం ప్రకటించారు. ప్రస్తుతం ఇరాన్‌తో శాంతి ఒప్పందం దిశగా ట్రంప్ వెళ్తున్నారు. ఇలాంటి తరుణంలో ట్రంప్ బర్త్‌డే సెలబ్రేషన్స్ చేసుకుంటున్నారు. ఇక వచ్చే వారం ఫ్రాన్స్‌లో జరిగే జీ7 సదస్సుకు కూడా హాజరు కాబోతున్నారు.

# సంక్షిప్త వార్తలు

## 130 కిలోమీటర్లు కారు డ్రైవ్ చేసిన సిఎం విజయ్

**చెన్నై,జూన్ 13:** తమిళనాడు రాజకీయాల్లో సంచలన విజయం సాధించి, ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన కోలీవుడ్ స్టార్ విజయ్ తనదైన స్టైల్‌తో అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. పరిపాలన చేపట్టిన కొన్ని రోజులకే తన అసాధారణమైన శైలితో వార్తల్లో నిలుస్తున్నారు. తాజాగా నిన్న ఆయన కర్ణాటకలోని ప్రముఖ కొల్లూరు మూకాంబిక అమ్మవారి ఆలయాన్ని సందర్శించిన సంగతి తెలిసిందే. అక్కడ దర్శనం ముగించుకున్న తర్వాత ఆయన చేసిన ఒక పని ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. గుడి నుంచి ఎయిర్‌పోర్ట్ వరకు దాదాపు 130 కిలోమీటర్ల మేర తన కారును ఆయనే స్వయంగా డ్రైవ్ చేసుకుంటూ వెళ్లారు. కొల్లూరు మూకాంబిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన సీఎం విజయ్.. అమ్మవారికి 1.6 కేజీల బరువున్న భారీ వెండి ఖడ్గాన్ని కానుకగా సమర్పించారు.

## టెక్సాస్‌లో కాల్పులు.. ఒకరి మృతి, 10 మందికి గాయాలు



**హూస్టన్,జూన్ 13:** అమెరికాలోని టెక్సాస్‌లో కాల్పుల ఘటన జరిగింది. ఓ ఆగంతకుడు జరిపిన కాల్పుల్లో ఒకరు మృతిచెందగా, మరో పది మంది గాయపడ్డారు. పోలీసులతో జరిగిన ఎదురుకాల్పుల్లో అనుమానిత షూటర్ హతమయ్యాడు. శుక్రవారం తెల్లవారుజామున వెస్ట్ టెక్సాస్ మిడ్‌లాండ్ ఆయిల్ సిటీలో ఈ ఘటన జరిగింది. షూటింగ్ జరుగుతున్న ఎమర్జెన్సీ కాల్స్ రావడంతో ఆ ప్రాంతానికి పోలీసులు వెళ్లారు. ఆ షూటర్‌ను తరిమే ప్రయత్నం చేశారు. ఆ క్రమంలో ఎదురుకాల్పులు జరిగాయి. ఓ వెటర్నరీ క్లినిక్‌లోకి ప్రవేశించిన దుండగుడిని చుట్టుముట్టి కాల్చేశారు.

## అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టులో రూ.4.27 కోట్ల బంగారం స్వాధీనం

**అహ్మదాబాద్,జూన్ 13:** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు రూ.4.27 కోట్ల విలువైన బంగారాన్ని స్వాధీనంచేసుకున్నారు. ఈమొత్తం బంగారం ఒక స్పీకర్ బాక్స్‌లో ఉంచి విమానం మరుగుదొడ్డిలో ఉంచారు. సర్దార్ వల్లభ్‌భాయ్‌పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం ఇండిగో విమానంలో ఈ సంఘటన జరిగింది. దుబాయ్‌నుంచి వచ్చిన ఈ విమానంలో బంగారం స్మగ్లింగ్ జరుగుతోందన్న సమాచారంతో కస్టమ్స్ అధికారులు నిఘావేసారు. విమానం క్షుణ్ణంగా ఇంజినీర్లతోకలిసి తనిఖీచేసారు. నల్లటి ప్లాస్టిక్ టేపులు వేసి ఉన్న రెండు పౌచ్‌లు స్పీకర్‌బాక్స్‌లో ఉంచినట్లు గుర్తించారు.

## అమెరికా దాడులు.. రక్తపిపాసి హతం

**వాషింగ్టన్, జూన్ 13:** వెనుజులాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌పై దృష్టి పెట్టిన అగ్రరాజ్యం అమెరికా తాజాగా కీలక ఆపరేషన్ చేపట్టింది. ఇందులో డ్రగ్స్‌ముఠా ట్రెన్ డి ఆరాగ్వా గ్యాంగ్‌కు చెందిన లీడర్ హెక్టర్ రస్తెన్‌ఫోర్డ్ గురెరో ఫ్లోర్స్ హతమయ్యాడు. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా వెల్లడించారు. 'ట్రెన్ డి ఆరాగ్వా ఉగ్రవాదులకు వెనుజులాలోనే కాదు.. ఈ భూమ్మీద ఎక్కడా సురక్షిత స్థావరం ఉండదు. హంతకులు, డ్రగ్ లార్డ్స్ ఎక్కడున్నా వేటాడుతాం. వారిని నరకానికి పంపిస్తాం' అని ట్రంప్ వెల్లడించారు. ఈ వారం ఆరంభంలో అమెరికా ఈ ఆపరేషన్‌ను చేపట్టింది. అత్యంత పక్కా సమాచారంలో ట్రెన్ డి ఆరాగ్వా ముఠాకు చెందిన ఓ కాంపౌండ్‌పై బాంబుల వర్షం కురిపించింది.

## దారి మళ్లించిన షార్జా సౌదీ అరేబియా విమానం!

**కొచ్చిన్, జూన్ 13:** షార్జా నుంచి కోజికోడ్ చేరుకోవాల్సిన ఎయిర్ అరేబియా విమానాన్ని శనివారం దారి మళ్లించారు. ఆ విమానం కొచ్చిన అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అయ్యింది. సాంకేతిక సమస్య తలెత్తడం వల్ల దాన్ని దారి మళ్లించారు. ఎయిర్ అరేబియా ఫ్లయిట్ జీ9 454 విమానంలోని ఇంజిన్ రివర్స్ త్రస్ట్ సిస్టమ్‌లో సాంకేతిక సమస్య తలెత్తిందని, దాని వల్ల దాన్ని కొచ్చిన్‌లో దించారని కొచ్చిన ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ ప్రతినిధి తెలిపారు. ప్రొటోకాల్ ప్రకారం ఇవాళ తెల్లవారుజామున కొచ్చిన్ విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ప్రకటించారు.





## అభివృద్ధి పనులు, ప్రయాణికుల సౌకర్యాల సమీక్ష

### తిరుపతి రైల్వే స్టేషన్‌లో సౌత్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్

**తిరుపతి,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:** సౌత్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథూర్ శనివారం తిరుపతి రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేశారు. కొత్తగా ఏర్పాటైన సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటైన అనంతరం, ఈ విభాగంలో ఆయన తొలి తనిఖీచేపట్టారు. విజయవాడ- గూడూరు- తిరుపతి రైల్వే మార్గంలో విస్తృత తనిఖీలు నిర్వహించిన అనంతరం, తిరుపతి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న వివిధ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు, ప్రయాణికుల సౌకర్యాల కల్పనపై ఆయన సమీక్ష నిర్వహిం చారు. ముఖ్యంగా స్టేషన్ పునర్వికాస ప్రాజెక్టు పురోగతిని పరిశీలించిన జనరల్ మేనేజర్, సర్క్యులేటింగ్ ఏరియా, లిఫ్టులు, ఎస్కలేటర్లు, ప్లాట్‌ఫారాలు, కాంకోర్స్ ప్రాంతం తదితర సౌక ర్యాలను తనిఖీ చేశారు. నిర్మాణ పనులు నిర్వ హిస్తున్న అధికారులతో మాట్లాడి, పనుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు.నిర్దేశిత గడువులో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం గుం తకల్ రైల్వే డివిజన్ అధికారులు నిర్వ హించిన సమగ్ర ప్రజెంటేషన్‌లో కొనసాగుతున్న ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలు, ఆపరేషనల్ విజయాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళి కలపై జనరల్ మేనేజర్‌కు వివరించారు. ఈ తనిఖీల సందర్భంగా సౌత్ కోస్ట్‌రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ బీఎస్‌కే రాజ్‌కుమార్, ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్ టెలికాం ఇంజనీర్ ఓబీ సురేష్ కుమార్, ప్రిన్సిపల్ చీఫ్‌ఆపరేషన్స్ మేనేజర్ వినీత్ కుమార్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అంకుష్ గుప్తా,గుంతకల్ డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా, తిరుపతి స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## ముక్కంటీశుని చెంత రాహుకేతుదోష నివారణ పూజలు

**శ్రీకాళహస్తి, జూన్ 13 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం భక్తులతో కిట కిట లాడింది. త్రయోదశి కావటంతో భక్తులు కడలి తరంగాల్లా కదలి వచ్చారు. శనీశ్వరునికి మూడు సార్లు అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆల యం లో ఎటు చూసినా భక్తుల శివనామస్మ రణతో పునీతమైంది. శనీశ్వరుని ఆలయం వద్ద భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. వేదపండితులు, అర్చకులు స్వామి సన్నిధిలో వేద మంత్రాలను పఠిస్తూ షోడశాభిషేకాలు జరిపారు. ఇక రాహు కేతుదోష నివారణ పూజలు కూడా రికార్డు స్థాయిలో జరిగాయి. ఆలయంలో అడుగుపెడితే భక్తిభావంతో తన్మయత్వం చెందుతున్నారు. స్వామి వారిని దర్శించుకొని వచ్చిన భక్తులకు 'అభయ వెంకటేశ్వరస్వామి' దర్శనం పునీతం చేస్తుంది. ముఖ్యంగా రాహు కేతుదోష నివారణ పూజలు జరిపించుకుంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. శనివారం ఓ వైపు సామాన్య భక్తుల తాకిడి మరోవైపు అతిథులతో కళకళ లాడింది.

దేవస్థానం అందించిన సమాచారం మే రకు సుమారు 30వేల మంది శనివారం స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకున్నారని ఆలయాధికారులు చెబుతున్నారు. రికార్డుస్థాయిలో రాహుకేతుదోష నివారణ పూజలు జరిగినట్లు వివరించారు.

## డీఎస్సీ నియామకాలపై సీబీఐ విచారణ జరిపించాలి: మాజీ సిఎం జగన్

**విజయవాడ జూన్ 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహించిన డీఎస్సీ నియామకాలపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. మెగా డీఎస్సీగా ప్రచారం చేసిన నియామక ప్రక్రియ వాస్తవానికి మెగా స్కామ్‌గా మారిందని ఆరోపిస్తూ ఈ వ్యవహారంపై స్వతంత్ర సీబీఐ దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో స్పందించిన జగన్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ కుట్ర కారణంగా లక్షలాది మంది అభ్యర్థుల భవిష్యత్తు దెబ్బతిన్నదని విమర్శించారు. 16వేల టీచర్ పోస్టుల భర్తీలో పాదర్శకత పూర్తిగా దెబ్బతిందని నియామక ప్రక్రియపై ఆనేక అనుమానాలు నెలకొన్నాయని పేర్కొన్నారు. డీఎస్సీ ప్రక్రియలో ప్రభుత్వ సంస్థాగత భద్రతా వ్యవస్థలను కావాలనే నిర్వీర్యం చేశారని జగన్ ఆరోపించారు. ప్రశ్నపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ వంటి కీలక బాధ్యతలను ఒకే అధికారికి అప్పగించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. అలాగే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గోప్యమైన బాధ్యతలు అప్పగించడం కూడా ప్రశ్నలు రేకెత్తిస్తోందని పేర్కొన్నారు. ప్రశ్నపత్రాల తయారీ ప్రక్రియలో భాగమైన ఒక ఉద్యోగి ఫస్ట్ ర్యాంక్ సాధించడం పేపర్ లీక్‌కు నిదర్శనమని ఆరోపించారు.

## బిజెపి పాలనలో ప్రజలకు మేలు శూన్యం

### రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు ఏమయ్యాయి!

### కాణిపాకం దేవస్థాన ఉద్యోగాల్లో దళితులకు ప్రాధాన్యత: మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్

**కాణిపాకం, జూన్ 13 ప్రభాతవార్త:** గత పన్నెండు సంవత్సరాల భారతీయ జనతా పార్టీ పాలనలో దేశంలో ప్రజలకు జరిగిన మేలు శూన్యమని, ప్రతి ఇంట్లో ఆర్థిక సంక్షోభం కన్పిస్తోందని, దళితులు దుర్భర జీవితాలను గడుపుతున్నారని మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్ అన్నారు. 11 సంవత్సరాలు వైఎస్ కుటుంబం, 19 సంవత్సరాలు నారా వారి కుటుంబం కలిపి 30 సంవత్సరాలు రాష్ట్రంను రెండు కుటుంబాలు పాలించాయని, తద్వారా ఆ రెండు కుటుంబాలు కోటీశ్వరులు అయ్యాయని విమర్శించారు. ప్రస్తుతం గ్యాస్ ధర, ఎరువులు, పెట్రోల్,



కాణిపాకం ఎస్సీకాలనీలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్

డిజీల్, బియ్యం, మందులు, నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, కానీ సామాన్యుల జీవితాల్లో మార్పు రాలేదని చింతా మోహన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలన చూశాక తమిళనాడు రాష్ట్రం తరహాలో ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని, కాంగ్రెస్ మళ్ళీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఇదిలా వుండగా కాణిపాకం దేవస్థానంలో ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో దళితులకు ప్రాధాన్యత కల్పించాలని మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. దేవస్థానంలో కాణిపాకం ఎస్సీ కాలనీకు చెందిన దళితులు ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్దతిలో చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తున్నారని వారికి వయో పరిమితి విధించి విధుల నుండి తొలగించడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి తొలగించిన కార్మికులను సత్వరం విధుల్లోకి తీసుకోవాలని చింతామోహన్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి మాజీ కార్యదర్శి పరదేశి తదితరులు పాల్గొన్నారు.

శనివారం కాణిపాకం ఎస్సీ కాలనీలో మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్ పర్యటించి దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాజీ కేంద్ర మంత్రి విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెండేళ్ళ పాలన, అభివృద్ధిపై తిరుపతిలో కోట్ల రూపాయలు ఖర్చు చేసి సభ నిర్వహించారని, దీనివల్ల ఉపయోగమేమిటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రానికి 23 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు తీసుకువచ్చామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్తున్నారని, అయితే శ్రీకాకుళం నుండి చిత్తూరు జిల్లా వరకకు ఏ జిల్లాలో అభివృద్ధి మాత్రం కన్పించడం లేదని ఎద్దేవా చేశారు. పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఎస్సీ, ఎస్టీ, ఓబిసీ కార్పొరేషన్లను చంద్రబాబునాయుడు, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాలు రద్దు చేశాయని ధ్వజమెత్తారు. రద్దు చేసిన ఈ కార్పొరేషన్లను తిరిగి పునరుద్దరించాలని చింతామోహన్ డిమాండ్ చేశారు. 19 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు రాష్ట్రానికి చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని నిలదీశారు.

# యూరియాపై అపోహలు వీడండి

## జిల్లాలో సమృద్ధిగా యూరియా: కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**కోవూరు (నెల్లూరు), జూన్ 13, ప్రభాతవార్త :** రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి పేర్కొన్నారు. శనివారం నెల్లూరులోని తమ కార్యాలయం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో సమృద్ధిగా యూరియా నిల్వలు ఉన్నాయని, అన్నదాతలు యూరియా పై అపోహలు వీడాలని అన్నారు. కోవూరు నియోజకవర్గంలో యూరియా కొరత ఉందనేది కేవలం అపోహ మాత్రమే అన్నారు. ప్రతిపక్షాలు పనిలేక చేస్తున్నారని, రైతులు అర్థం చేసుకోవాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో కోవూరు నియోజకవర్గంలో మొత్తం 55 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారన్నారు. ఇప్పటికే 42 వేల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయన్నారు. మరో 10 రోజుల్లో మిగతా 13 వేల ఎకరాల్లో నాట్లు పూర్తవుతాయన్నారు. నియోజకవర్గానికి మొత్తం 7 వేల టన్నుల యూరియా అవసరం ఉండగా ఇప్పటికి 4.5వేల టన్నుల యూరియా పంపిణీ చేశామన్నారు. ప్రస్తుతం వెయ్యి టన్నులు రైతులకు అందుబాటులో యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. అదనంగా కోవూరు మండలంలోని



ఇనమడుగు గోదాముల్లో మరో 2.5 వేల టన్నులు సిద్ధంగా ఉన్నాయన్నారు. అవసరమైతే కొన్ని గంటల్లోనే సొసైటీలు, డీలర్ల వద్దకు చేరుతాయన్నారు. కోవూరు మండలంలో 9 వేల ఎకరాలకు గాను 850 టన్నులు ఇచ్చామని, కొడవలూరు మండలంలో 10,200 ఎకరాలకు గాను 1100 టన్నులు ఇచ్చామన్నారు. విడవలూరు మండలంలో 8,800 ఎకరాలకు గాను 1 వెయ్యి టన్నులు పంపిణీ చేయగా, బుచ్చిరెడ్డిపాళెం మండలంలో 7600 ఎకరాలకు గాను 1350 టన్నులు ఇచ్చామన్నారు. ఇందుకూరుపేటలో 6 వేల ఎకరాలకు గాను 600 టన్నులు ఇవ్వడం జరిగిందన్నారు. క్షేత్ర స్థాయిలో రైతులకు యూరియా కొరత ఉండకూడదని, యూరియా పంపిణీలో అక్రమాలకు తావు లేకుండా ఉండాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏపీ ఏఐఎంఎస్ యాప్ తీసుకువచ్చిందన్నారు. ఈ యాప్ ప్రయోగాత్మకంగా నెల్లూరులో ప్రారంభించడం జరిగిందన్నారు. జిల్లాలో వ్యసాయశాఖ యాప్ ద్వారానే యూరియా పంపిణీ చేస్తోందన్నారు. యాప్‌లో మొదట ఎకరాకు ఒకటిన్నర బస్తాలు ఉండగా అది సరిపోదని సిఎం నారా చంద్రబాబు నాయుడుకి, మంత్రుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారు రెండున్నర బస్తాలకు పెంచారన్నారు. రైతుల విజ్ఞప్తి మేరకు మళ్లీ సంప్రదించి ఇప్పుడు ఎకరాకు 3 బస్తాలు వచ్చేలా చేశామన్నారు. భూమి యజమానులకు, చెరువు భూములు, వెబ్‌ల్యాండ్ రిజిస్టర్ కాని వారికి కూడా యాప్‌లో సమస్యలు లేవన్నారు. కేవలం కొందరు కౌలు రైతులకు మాత్రమే పంపిణీలో ఆలస్యం అవుతోందని, కౌలు రైతులకు భూమి యజమాని వివరాలు తెలియక పోవడమే ఈ ఆలస్యానికి కారణమన్నారు. వ్యవసాయ శాఖా అధికారులు రైతుల వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నారని త్వరలోనే సమస్య తీరిపోతుందన్నారు. బుచ్చిరెడ్డిపాలెంలో 7600 ఎకరాలకు 1350 టన్నుల యూరియాను ఈపాటికి అందజేశామని,రాష్ట్ర అభివృద్ధి చూసి ఓర్వలేక వేరే పని లేక యూరియాపై రాద్ధాం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పెన్నాడెల్టా కమిటి ఛైర్మెన్ జెట్టి రాజగోపాల్ రెడ్డి, రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ రావిళ్ల వీరేంద్రనాయుడు, కోవూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, సీనియర్ టిడిపి నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, కొల్లారెడ్డి సునీల్ కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# వైభవంగా నృసింహుని కల్యాణోత్సవం

### రాబడి రూ. 11,79,036

**రాపూరు (నెల్లూరు), జూన్ 13, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో పెద్ద ఎత్తున శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులతో శనివారం ఆలయ ప్రాంగణం నిండిపోయింది. పెద్ద ఎత్తున భక్తులు కోనకు చేరుకోని తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోని స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. ఇందులో బాగంగా తెల్లవారుజామున స్వామి వారి మూల మూర్తికి ప్రత్యేకంగా అభిషేకం, గోపూజ, పూలాంగి సేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారికి ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లతో వైభవంగా స్వామి వారి కళ్యాణాన్ని ఆలయ అర్చక స్వాములు, వేద పండితులు వేదమంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి తిరుచ్చి ఉత్సవం, గిరిజన వాయిద్యాల నడుమ వేడుకగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన, వసతి సౌకర్యాలతో పాటు, క్యూలైన్లలో భక్తులకు మంచినీరు, మజ్జిగ పంపిణీ వంటి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి ప్రత్యక్ష



పర్యవేక్షణ నిర్వహించారు. శనివారం స్వామి వారికి భక్తుల ద్వారా రూ.11,79,036 రాబడి వచ్చినట్లు ఆలయ ఉప కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి తెలిపారు. స్వామి వారి నిత్య అన్నదానానికి విరాళల రూపేణా రూ.4,23,460లు, శ్రీవారి అభిషేకం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ. 29,250లు, నిత్య కళ్యాణం ద్వారా రూ, 50,061లు, 100 రూపాయిల ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.2,22,200లు,దేవస్థానం వసతి ద్వారా రూ.27,500లు, తలనీలలు 2,799 మంది సమర్పించగా తద్వారా రూ. 1,11,900 లు, లడ్డు ప్రసాదాల విక్రయం ద్వారా రూ. 2,77,250లు, పులిహోరా విక్రయం ద్వారా రూ.36,350లు,వాహనాల పూజల ద్వారా రూ.1,065లు చోప్పున మొత్తం రూ.13,62,798 రాబడి వచ్చినట్లు జనార్ధన్ రెడ్డి తెలిపారు. స్వామి వారి అన్న ప్రసాదాన్ని 2466 మంది స్వీకరించారని, రాత్రి 7 గంటల 20 నిమిషాల వరకు మొత్తం 9,950 మంది భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరిడెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ, ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చక స్వామి గుండ్లూరు శశి స్వామి, అర్చక స్వాములు మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలాజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి, దేవస్థానం సిబ్బంది తదితరులున్నారు.

# గుంతకల్ డివిజన్‌లో విస్తృత తనిఖీలు

**గుంతకల్ రైల్వే జూన్ 13, ప్రభాతవార్త :** గుంతకల్ రైల్వే డివిజనల్ లో దక్షి ణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథూర్ గుంకల్ డివిజన్ పరిధిలోని తిరుపతి నుండి గుంతకల్ డివిజన్ పరిధిలోని ప్రధాన రైల్వే స్టేషన్లు, ముఖ్యంగా తిరుపతి రైల్వే స్టేషన్ మరియు తిరుపతి, గుంతకల్ సెక్షన్‌లో విస్తృత తనిఖీ నిర్వహిం చారు. కొత్తగా ఏర్పడిన దక్షి ణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటైన తరువాత సెక్షన్‌లో ఆయన చేపట్టిన తొలి తనిఖీ నిర్వహించారు. తనిఖీలో భాగంగా సందీప్ మాథూర్ రాయచోటి,రాజంపేట రైల్వే స్టేషన్‌ను సందర్శించి, సర్క్యులేటింగ్ ఏరియా, వెయిటింగ్ హాల్, పార్కింగ్ ప్రాంతం మరియు ఇతర ప్రయాణికుల సౌకర్యాల అభివృద్ధి పనులను సమీక్షి ంచారు. కడప రైల్వే స్టేషన్‌లో అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద జరుగుతున్న పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించి, సర్క్యులేటింగ్ ఏరియా, ప్లాట్‌ఫారాలు మరియు ఇతర ప్రయాణికుల సౌకర్యాలను వివరంగా పరిశీలించారు. పనుల నాణ్యతను అంచనా వేసి, అన్ని ప్రాజెక్టులను సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

జనరల్ మేనేజర్ తాడిపత్రి, గుత్తి మధ్య విండో ట్రైలింగ్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించి, ట్రాక్ పరిస్థితులు, భద్రతా అంశాలు మరియు కొనసాగుతున్న పనులను సమీక్షి ంచారు. గుత్తి లో యార్డ్ రీమోడలింగ్ పనులను పరిశీలించి, వాటిని వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గుంతకల్లు లో రైల్వే స్టేషన్ లో ఏర్పాటు చేసిన పాత వస్తువులతో తయారుచేసిన నమూనాలను పరిశీలించారు. రైల్వే డ్రైవర్ల క్రూ లాబీని తనిఖీ చేసి, క్రూ నిర్వహణ వ్యవస్థలు, సంక్షేమ సదుపాయాలు, భద్రతా విధానాలు, అత్యవసర ప్రక్రియలను పరిశీలించారు. గుంతకల్లు లో నార్త్ కాలనీ లో నూతన అధికారుల భవనాలను రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక గుంతకల్ డిఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా మరియు ఎడిఆర్‌ఎం శివప్రసాద్ మరియు ఈ తనిఖీలో ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ బి.ఎస్.కె. రాజ్‌కుమార్, ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్ టెలికాం ఇంజినీర్ ఓ.బి. సురేష్ కుమార్, ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ వినీత్ కుమార్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అంకుష్ గుప్తా వై. బాలాజీ కిరణ్ (ముఖ్య ప్రజా సంబంధాల


## భూగర్భజలాల పెంపునకు రీఛార్జ్ బావులు నిర్మించాలి : కలెక్టర్ బాలాజీ

**గన్నవరం, జూన్ 13, ప్రభాతవార్త :** రోజురోజుకీ అడుగంటిపోతున్న భూగర్భజలాల మట్టాన్ని పెంపొందించేందుకు చేపట్టిన రీఛార్జ్ బావుల నిర్మాణాన్ని సక్రమంగా పూర్తిచేయాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డికె.బాలాజీ అధికారులను ఆదేశించారు. గన్నవరం మండలం ముస్తాబాద గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన రీఛార్జ్‌బావి పనులను కలెక్టర్ శనివారం పరిశీలించారు. ప్రాజెక్టు అమలు విధానం, నిర్మాణ వ్యయం, భూగర్భజలాల పునరుద్దరణకు కలిగే ప్రయోజనాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఒక్కొక్క రీఛార్జ్ బావి నిర్మాణానికి రూ. 2లక్షలు ఖర్చు అవుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈప్రాజెక్టు నిర్మాణంలో ఎదురైన అనుభవాలను సమీక్షించి భూగర్భజలశాఖ గుర్తించిన ఇతర ప్రాంతాల్లోనూ బావుల నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఇదే గ్రామంలో ఉపాధిహామీ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామంలో పంటబోదె పూడికతీత పనులను పరిశీలించిన కలెక్టర్ కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో డ్వామా పిడి శివప్రసాద్, ఇరిగేషన్ ఎస్ఈ గుణకర్ తదితరులు పాల్గొన్నారు.



ముస్తాబాద గ్రామంలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న కృష్ణా కలెక్టర్ బాలాజీ

## ప్రభుత్వ ప్రోత్సాహాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి : ఎన్‌టిఆర్ కలెక్టర్




అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశా

**విజయవాడ, జూన్ 13, ప్రభాతవార్త :** మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఎన్‌టిఆర్‌జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలోని రైజ్‌సెంటర్‌లో మహిళలకు సోలార్ డ్రైయింగ్ పౌడర్ ప్రాసెసింగ్‌పై శనివారం అవగాహనా సదస్సును కలెక్టర్ ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సాధికారతకు నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలు అత్యంత కీలకమన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో సహజ సిద్ధమైన ఆహార ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సోలార్ డ్రైయింగ్ సాంకేతికత ద్వారా విలువ అధారిత ఉత్పత్తులను తయారు చేయగలిగితే మంచి ఆదాయం వస్తుందన్నారు. వ్యవసాయ, ఉద్యాన, పంటలతోపాటు పలు రకాల పండ్లను సోలార్ డ్రైయింగ్ ద్వారా నిల్వచేసి పొడిరూపంలోకి మార్చి విక్రయించటం ద్వారా మంచి లాభాలు ఆర్జించవచ్చాన్నారు. మార్కెట్‌లో కూరగాయ పంటలకు గిట్టుబాటు ధరలు లేని సమయంలో వాటని ఈపద్ధతిలో ప్రోసెసింగ్ చేయటం ద్వారా గిట్టుబాటుధరలు పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. రైజ్‌సెంటర్ ద్వారా అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈసందర్భంగా సోలార్‌డ్రైయింగ్ ప్రక్రియ, ఉత్పత్తుల తయారీ, నాణ్యత ప్రమాణాలు, మార్కెటింగ్ అవకాశాలపై నిపుణులు వివరించారు.

## రేపు గన్నవరం విమానాశ్రయంలో ప్రత్యేక కార్యక్రమాలు

**విజయవాడ, జూన్ 13, ప్రభాతవార్త :** విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో గత 12ఏళ్ళ ప్రగతిని పురస్కరించుకుని ఈనెల 15వతేదీ యాత్రీ సువిధా దివస్ నిర్వహించేందుకు విమానాశ్రయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 15వతేదీ విమానాశ్రయం నుండి రాకపోకలు సాగించే ప్రయాణికులకు తిలకంతో బొట్టుపెట్టి స్వాగతం పలుకనున్నారు. ప్రయాణికుల కోసం ఉచిత వైద్యశిబిరాలు, రక్తదాన శిబిరం నిర్వహించటంతోపాటు, వృక్షారోహణ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. విమానాశ్రయంపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులకు విమానాశ్రయం పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేసి విమానాశ్రయంలోని వివిధ విభాగాలను విద్యార్థులు చూపించనున్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా విమానాశ్రయం టెర్మినల్ భవనాన్ని ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు.

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దారుణహత్య

**గంగవరం, జూన్ 13, ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలం దండపల్లె కురప్పల్లెలో సాఫ్ట్ వేర్ ఉద్యోగి జయదీప్ దారుణహత్యకు గురయ్యాడు. అమ్మాయి పిలిచిందని వెళితే అమ్మాయి బంధువులు కుటుంబ సభ్యులు జయదీప్‌ను కొట్టి మిద్దెపై నుండి కిందకు పడవేసినట్లు ఆరోపణలు వెలువడుతున్నాయి. ఈ నెల 3న అర్థరాత్రి జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి రాగా తీవ్రంగా గాయపడ్డ జయదీప్ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. బంగారుపాళ్యం మండలం జి.కురప్పల్లెకు చెందిన హేమావతి కుమారుడు జయదీప్ బెంగళూరులో సాఫ్ట్ వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 3న సొంతగ్రామానికి వచ్చిన జయదేవ్‌కు దండపల్లె కురప్పల్లెలో ఒక అమ్మాయి నుండి ఫోన్‌కాల్ వచ్చినట్లు ఇంటివద్ద ఎవరూలేరు వెంటనే బయలుదేరి రావాలని ఫోన్‌చేసినట్టు సమాచారం. ఫోన్‌కాల్ అందుకున్న జయదేవ్‌ను వినీత్ అనే మరో యువకుడు మోటార్ సైకిల్‌పై ఈ నెల 3న సాయంత్రం 5గంటల సమయంలో దండపల్లె కురప్పల్లెలో లింగప్ప ఇంటికి తీసుకు వచ్చినట్లు తెలుస్తోంది. ఐతే నలుగురు యువకులు కొట్టి మిద్దెపైనుండి కిందకు తోసివేయడంతో జయదేవ్ అపస్మారక స్థితిలో పడిపోయాడు. విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన మునిరాజ్ వెంటనే వేలూరు సిఎంసి ఆసుపత్రికి తరలించారు. 9 రోజుల పాటు చికిత్సపొందినా ఫలితంలేక పోవడంతో తగిన స్థోమత లేక పలమనేరులో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ జయదేవ్ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. ఐతే ప్రమాదవశాత్తు మిద్దెపైనుండి పడ్డాడని లింగప్ప కుటుంబ సభ్యులు చెపుతుండగా కొట్టి చంపేశారని మృతుని బంధువులు ఆరోపిస్తున్నారు. మృతదేహాన్ని శవ పరక్ష నిమిత్తం పలమనేరు ప్రభుత్వఆసుపత్రిలో వుంచారు. గంగవరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## తప్పుడు ప్రచారకర్తలపై కఠిన చర్యలు : ఇఒ వికె శీనా నాయక్

**ఇంద్రకీలాద్రి, జూన్ 13, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంలో ఈనెల 17న మహామండపంలోని 6వ అంతస్థులో నిజ జేష్ఠమాస తదియ నాడు దేవస్థానం ఆధ్వర్యంలో ఉచితంగా 250 మందికి నిర్వహించబోయే సామూహిక అక్షరాభ్యాసాల కార్యక్రమానికి సంబంధించి ప్రచారంలో వున్న తప్పుడు ప్రచారాలపై ఇఒ వికె శీనా నాయక్ హెచ్చరికలు చేశారు. దేవస్థానానికి సంబంధించిన అంశాలపై తప్పుడు ప్రచారాలు చేసే వారిని కఠినంగా చట్టప్రకారం శిక్షిస్తామన్నారు. శాఖంభరీ ఉత్సవాలు, ఆషాఢ సారె, ఉచిత అక్షరాభ్యాసాలు మరియు కృష్ణానదీ పుణ్య హారతులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవన భద్రతను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లేందుకు యాక్షన్ ప్లాన్‌ను అమలు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె.శీనా నాయక్ తెలిపారు. దుర్గమ్మ వారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి రు.1,00,116 విరాళాన్ని కడపకు చెందిన కె గోపిరెడ్డి వారి కుటుంబీకులు అయ్య వరమ్మ అందించారు. విజయవాడకు చెందిన వై.కనకదుర్గ మరియు కుటుంబీకులు పేరున రూ.1,01,116లు విరాళమును, విశాఖపట్నంకు చెందిన గోగినేని సావిత్రి, మౌత్విక, మోహినీష్ సాయి ల పేరిట శనివారం రు.1లక్ష విరాళం అందించారు.

# హెల్త్ అవేర్‌నెస్ వీక్ ద్వారా కీలక సంస్కరణలు, సేవల విస్తరణ



### ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో ఆరోగ్య శాఖ పనితీరు ప్రశంసనీయం

### అధికారులు, వైద్యులు, సిబ్బందిని అభినందించిన తెలంగాణ మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో హెల్త్ అవేర్‌నెస్ వీక్ ద్వారా ఆరోగ్య రంగంలో కీలక సంస్కరణలు, సేవల విస్తరణ చేపట్టినట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యక్రమం విజయవంతంగా ముగిసిన సందర్భంగా ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది, క్షేత్రస్థాయి ఆరోగ్య కార్యకర్తలను మంత్రి దామోదర రాజనర్సింహ అభినందించారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆరోగ్యశాఖ చేపట్టిన కార్యక్రమాలు ప్రజల్లో విశేష స్పందన పొందాయని, ప్రభుత్వ లక్ష్యాల సాధనలో ఆరోగ్యశాఖ కీలక పాత్ర పోషించిందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రివర్గ సహచరులు, ప్రజా ప్రతినిధులు ఆరోగ్య శాఖ పనితీరును ప్రత్యేకంగా అభినందించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ప్రజలకు అత్యంత అవసరమైన విద్య, వైద్య రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఆరోగ్య తెలంగాణ నిర్మాణ లక్ష్యంతో వైద్య సేవల విస్తరణ, ఆధునీకరణ, మానవ వనరుల బలోపేతం, ప్రజా రోగ్య అవగాహన కార్యక్రమాలను సమాంతరంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 6 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించిన హెల్త్ అవేర్‌నెస్ వీక్ రాష్ట్రవ్యాప్తంగా విశేష విజయాన్ని సాధించిందన్నారు. వారంరోజుల పాటు 20కిపైగా ప్రధాన కార్యక్రమాలను నిర్వహించి ఆరోగ్యకర జీవనశైలి, వ్యాధుల నివారణ, మాతాశిశు ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం, ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ సేఫ్టీ, హెచ్ఐవీ నియంత్రణ, క్యాన్సర్ అవగాహన వంటి అంశాలపై ప్రజల్లో విస్తృత చైతన్యం కల్పించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 35 ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో డీ అడిక్షన్ కౌన్సెలింగ్ సెంటర్లు, స్పెషల్ ఇంటర్వెన్షన్ కేర్ యూనిట్లను ప్రారంభించి మత్తు వ్యసన బాధితులకు స్క్రీనింగ్, చికిత్స, కౌన్సెలింగ్, పునరావాస సేవలను అందు బాటులోకి తీసుకు వచ్చామన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన పెంపొం దించేందుకు హైదరాబాద్ కేబుల్ బ్రిడ్జిపై భారీ మానవహారం నిర్వహించామని, రాష్ట్రవ్యాప్తంగా హెచ్ఐవీ, టీబీ స్క్రీనింగ్ క్యాంపులు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన ఔషధాలు అందుబాటులో ఉండేలా, యాంటీబయాటిక్స్ దుర్వినియోగాన్ని అరికట్టేలా డ్రగ్ కంట్రోల్ అండ్ రెగ్యులేటరీ స్ట్రెంథనింగ్ డే నిర్వహించామని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించి యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించామని పేర్కొన్నారు. నకిలీ మందులు, నాసిరకం ఔషధాలు, మెడిసిన్ల దుర్వినియోగంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుం టోందని తెలిపారు. 692 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులు, 174 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు సహా మొత్తం 866 మంది వైద్యులకు నియామక పత్రాలు అందజేశామని తెలిపారు. 2322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేశామని పేర్కొ న్నారు. గత రెండున్నర సంవత్సరాల్లో ఆరోగ్యశాఖలో భర్తీ చేసిన ఉద్యోగాల సంఖ్య సుమారు 15 వేలకు చేరుకుందని వెల్లడించారు. వైద్య విద్య, సేవల విస్తరణలో భాగంగా మహబూబ్‌నగర్‌ను దక్షి ణ తెలంగాణ మెడికల్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు చర్యలు ప్రారంభించామని, ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రుల మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన హెల్త్ అవేర్‌నెస్ వీక్ ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో, ప్రజారోగ్యంపై అవగాహన పెంపొం దించడంలో, ఆధునిక వైద్య సేవలను విస్తరించడంలో, ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించిందని మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్యశాఖ కృషి కొనసాగిస్తుందని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు.

## తెలంగాణ పోలీసు శాఖకు ఇన్‌స్టిట్యూషనల్ ఫెర్ఫార్మెన్స్ అవార్డు

### 19న ఢిల్లీలో అందుకోనున్న డిజిపి ఆనంద్

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** పాస్‌పోర్టుల దరఖాస్తుల పరిశీలన, ధ్రువీకరణ ప్రక్రియ వేగవంతంగా నిర్వహిస్తున్నందుకు తెలం గాణ పోలీసు శాఖకు కేంద్ర విదేశాంగ శాఖ ఇన్‌స్టిట్యూషనల్ ఫెర్ఫా ర్మెన్స్ అవార్డును ప్రకటించింది. ఈ మేరకు విదేశాంగ శాఖ నుంచి పోలీసు శాఖకు శనివారం సమాచారం అందింది. దీనికి సంబం ధించిన అవార్డును ఈ నెల 19న ఢిల్లీలో జరిగే ఓ కార్యక్రమంలో డిజిపి సి.వి ఆనంద్ అందుకోనున్నారు. రాష్ట్ర పోలీసు శాఖకు మరో అవార్డు వరించింది. టెక్నాలజీని వాడడం, నేరాల నియంత్రణ, సిటిజెన్ సర్వీసులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నందుకు అనేక అవార్డులు రాగా పాస్‌పోర్టుల దరఖాస్తుల పరిశీలన, వాటికి సంబం ధించిన ధ్రువీకరణ ప్రక్రియను దేశంలోనే వేగంగా చేస్తున్నందుకు విదేశాంగ శాఖ 2025-26కు ఇన్‌స్టిట్యూషనల్ ఫెర్ఫార్మెన్స్ అవార్డును తెలంగాణ పోలీసు శాఖకు ప్రకటించింది. పాస్‌పోర్టుల దరఖాస్తుల పరిశీ లన, ఇతర అంశాలను వేగంగా నిర్వహించినందుకు రాష్ట్ర పోలీసు శాఖకు ఇంతకుముందు పలు అవార్డులు వరించాయి. ఇప్పుడు వీటి సరసన ఇన్‌స్టిట్యూషనల్ ఫెర్ఫార్మెన్స్ అవార్డు చేరింది. ఈ అవార్డును ఈ నెల 19న కేంద్ర విదేశాంగశాఖ మంత్రి జయశంకర్ నుంచి డిజిపి ఆనంద్ అందుకోనున్నారు. కాగా రాష్ట్ర పోలీసు శాఖకు ఇన్‌స్టిట్యూ షనల్ ఫెర్ఫార్మెన్స్ అవార్డు రావడంపై డిజిపి ఆనంద్ సంతోషం వ్యక్తం చేశారు. పాస్‌పోర్టుల దరఖాస్తుల పరిశీలనలో ధ్రువీకరణ ప్రక్రియ కీలకమైన అంశమని, దీనిని నిర్వహిం చడంలో రాష్ట్ర పోలీసులు పారదర్శకంగా, సమర్థవంతంగా సేవలందించారని డిజిపి తెలిపారు.

# ఎల్‌నినోపై లఘుచిత్రం

### పంటల సాగుపై రైతులకు మెలకువలు

### రాష్ట్ర వ్యవసాయ శాఖ వినూత్నప్రచారం

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావం నైరుతి రుతు పవనాలపై పడి వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఎదురయ్యే ముప్పు మరింత వాస్తవరూపం దాల్చనున్నట్లు కనిపిస్తోంది. పంటల సాగులో ఎల్‌నినో పర్యవసానాలపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ సిద్ధమైంది. ఇందుకు ప్రత్యేకంగా ఒక లఘు చిత్రాన్ని రూపొందింప చేసింది. ఎల్‌నినో తీవ్రత, అలాగే వర్షాలు సరిగ్గా కురవకపోవడం వల్ల కలిగే ప్రభావాలను నివారించడానికి రాష్ట్రంలోని రైతులు ఏమి చేయాలో తెలియ జేస్తూ ఒక లఘు చిత్రాన్ని రాష్ట్రంలోని అన్ని సినిమా థియేటర్లలో ప్రదర్శిం చనున్నారు. సుమారు నాలుగు నిమిషాల నిడివి గల ఈ లఘు చిత్రంలో, ఖరీఫ్ పంట కాలం ప్రారంభమవుతున్న తరుణంలో, ఎల్‌నినో అంటే ఏమిటి, ప్రత్యా మ్నాయ సాగు పద్దతులు, స్వల్పకాలిక పంటలపై ఇచ్చే సలహాలను ఎందుకు పాటించాలి, అలాగే వ్యవసాయ శాఖ మార్గ దర్శకా లను ఎందుకు అనుసరించాలి అనే విషయాలపై రైతులు చర్చిస్తున్నట్లు ఈ లఘు చిత్రంలో చూపించారు. ఈ సీజన్‌లో ఎల్‌నినో అవగాహన, సురక్షి త వ్యవసాయ పద్ధతులపై రూపొందించిన ఈ లఘుచిత్రం ప్రదర్శించడం రైతుల్లో మరింత చర్చను తీసుకురావడమే లక్ష్యంగా రూపొందించబడిందని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. వ్యవసాయ శాఖ రూపొం దించిన ఇలాంటి అనేక ఇతర లఘుచిత్రాలను ఇప్పటికే వాట్సాప్ ద్వారా లక్షలాది మంది రైతులతో పంచుకోగా, వ్యవసాయ శాఖ తన ఎక్స్ హ్యాం డిల్‌లో కూడా వాటిని పొందుపరచింది. ఇప్పుడు వీటికి అదనంగా ఈ లఘుచిత్రాన్ని థియేటర్లలో విడుదల

## ప్రభుత్వ బడుల మూసివేత ప్రకటనను ముఖ్యమంత్రి ఉపసంహరించుకోవాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల మూసివేతపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనను ఉపసం హరించు కోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశా రు. రాష్ట్రంలోని 23వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేసి, వాటిని కేవలం 4వేలకు కుదిస్తామంటూ ముఖ్యమంత్రి ఒక ఇంటర్వ్యూలో చేసిన ప్రకటనను జాన్‌వెస్లీ తీవ్రంగా ఖండించారు. తక్షణమే ప్రభుత్వ పాఠశాలల మూసివేత ఆలోచనను వెనక్కి తీసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేవిధంగా ఆలోచించాలని డిమాండ్ చేశా రు. విద్యార్థుల ఆవాసాలకు సమీపంలోనే పాఠశాల అందుబాటులో ఉండాలని, ఈ బాధ్యతను ప్రభుత్వమే తీసుకో వాలని విద్యా హక్కు చట్టం 2009లో ప్రాథమిక హక్కుల్లో పొందు పర్చారని, కానీ ముఖ్యమంత్రి వ్యాఖ్యలు గ్రామీణ, పేద, దళిత, గిరిజన పిల్లల ప్రాథమిక విద్యా హక్కును కాలరాసే విధంగా ఉందన్నారు.

**ఉద్యోగ నోటిఫికేషన్ ప్రాసెసింగ్ ఫీజుల పెంపు భారం తగదు**

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఉద్యోగ దరఖాస్తుల ప్రాసె సింగ్ ఫీజును రూ. 200 నుండి రూ. 1,000కి పెంచడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, టీజీపీఎస్సీ స్పందించి ఈ ఫీజు పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు.



## జాతీయ రహదారిపై ఘోరప్రమాదం

### ఇద్దరు మృతి.. మరో నలుగురికి గాయాలు

**రఘునాథపల్లి, జూన్ 13, ప్రభాతవార్త :** వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం గోవర్ధనగిరి గ్రామంవద్ద శనివారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం జరిగింది. ఈప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురికి గాయాల్లయ్యాయి. హైదరాబాద్ నుంచి హన్మకొండ వైపు వెళ్తున్న టీజీ24 బి9237 నెంబర్‌గల ఎర్టిగా కారు ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ప్రయాణిస్తున్నారు. తెల్లవారుజామున సుమారు 2.30గంటల సమయంలో గోవర్ధనగిరి గ్రామం దర్గా సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డుదిగి పక్కనే ఉన్నకాలువలో పడిపోయింది. ఈప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. మృతిచెందిన వారిలో ఎండి.అసద్ (26) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, అఫ్సా హబీబ్ (27) బీడీఎస్ వైద్యురాలుగా గుర్తించారు. వీరు వరంగల్‌లోని నయీంనగర్‌కు చెందినవారని పోలీసులు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన రహముద్దీన్ ఖాన్ (డ్రైవర్), షాహీన్‌బేగం, ఇలేషా, రేష్మాలను వెంటనే జనగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.నరేష్ తెలిపారు.

**ఘటన స్థలాన్ని పరిశీలించిన జనగామ డిసిపి**

వరంగల్ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారు జామున రఘు నాథపల్లి మండలం గోవర్ధనగిరి వద్ద జరిగిన రోడ్డుప్రమాద స్థలాన్ని జనగామ డిసిపి రాజమహేంద్ర నాయక్ సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి ఆయన భాధిత కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వరంగల్ నుండి కర్ణాటకలోని వివాహ రెసెప్షన్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన చోటు చేసుకున్నట్లు భాదితు కుటుంబసభ్యులు పోలీసులకు వివరించారు. డ్రైవర్ అజాగ్రత్తవల్లే ఈ ప్రమాదం సంభవించినట్లు వారు భావిస్తున్నారు. డ్రైవర్‌పై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డిసిపి వెల్లడించారు. ఆయనవెంట ఎస్ఐ నరేష్ తదితరులు ఉన్నారు.

## ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు

# టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలి

### ప్రభుత్వానికి తపస్ డిమాండ్

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్) నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర అధ్య క్షుడు వొద్నాల రాజశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్య దర్శి హన్మంత్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తపస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం శని వారం జరిగింది. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ఎన్‌సిటిఈ నిబంధనలకు అనుగుణంగా సెప్టెంబరు 1, 2025లో సుప్రీం కోర్టు తీర్పు వెలువడిందని, దీంతో ఆందోళన చెందిన సర్వీస్ ఉపాధ్యాయులు 65 రివ్యూ పిటి షన్స్ వేశారని తపస్ నేతలు తెలిపారు. నిబం ధనల ఆధారంగానే సుప్రీంకోర్టు ఆ రివ్యూలను కొట్టివేస్తూ 2028 ఆగష్టు 31 లోపు ఇన్ సర్వీస్ టీచర్స్‌కు చివరి అవకాశమని తీర్పు ఇచ్చింద న్నారు. దీని ప్రకారం సర్వీస్ రిమూవ్ చేసే అవకాశం ఉందని, తెలంగాణలో 30వేల మంది ఉపాధ్యా యులకు టెట్ పాస్ కావాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఇన్‌సర్వీస్ టీచర్లకు ప్రత్యేకంగా 2సార్లు టెట్ నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం కాస్త ఊరట మాత్రమేన న్నారు. విద్యా హక్కు చట్టం అమలు ద్వారా టెట్ అంశం ప్రస్తావనకు వచినచందన్నారు. ఏప్రిల్ 1,2010 కంటే ముందు న్యాయబద్ధంగా నోటి ఫికేషన్ వచ్చి నియామకం అయిన ఉపాధ్యా యులకు ఆనాడు టెట్ అవసరం లేదు స్పష్టంగా పేర్కొనడం జరిగిందని, తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్‌లో టెట్ అర్హత ఆధారంగానే నియా మకాలు జరుగుతున్నాయన్నారు. గత 30 సంవత్సరాల నుండి ఉపాధ్యాయులు ఎంపిక చేసుకున్న విషయంలో భోదిస్తున్నారని, టెట్‌లో మాత్రం అన్ని విషయాలు కలిపి పరీక్షలు పెట్టడం జరుగుతుందని, దీంతో భాషా ఉపాధ్యాయులకు, ఇతర సబ్జెక్టు ఉపాధ్యాయులు కూడా తమ బోధ నకు సంబంధం లేని సబ్జెక్టు చదవి పరీక్షలు రాయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాంట పుడు ప్రత్యేకంగా టెట్ ఎన్ని సార్లు పెట్టిన ప్రయోజనం లేదనే భావన ఉపాధ్యాయుల్లో ఉంద న్నారు. ఎన్‌సిఈఆర్‌టీ, ఎస్‌సీఈ ఆర్‌టీ ఆధ్వ ర్యంలో, దీక్ష నిష్ఠ, లాంటి అనేక ఆన్‌లైన్ వృత్యంతర శిక్షణ ఇస్తూనే ఉన్నారన్నారు.

# దేశ భద్రతలో సీఐఎస్‌ఎఫ్ పాత్ర కీలకం

### హకీంపేటలో ఎన్ఐఎస్ఏ దీక్షాంత్‌పెరేడ్‌లో పాల్గొన్న తెలంగాణ గవర్నర్ శివప్రతాప్‌శుక్లా



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 13:** దేశ భద్రతా వ్యవస్థలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) కీలక పాత్ర పోషిస్తుందని గవర్నర్ శివప్రతాప్‌శుక్లా అన్నారు. హకీంపేటలోని నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ (ఎన్ఐఎస్ఏ) ప్రాంగణంలో శనివారం నిర్వహించిన 39వ బ్యాచ్ అసిస్టెంట్ కమాండెంట్ ప్రొబేషనర్లు, 9వ బ్యాచ్ సబ్‌ఇన్‌స్పెక్టర శిక్షణార్థుల దీక్షాంత్ పరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కఠినమైన శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన 76 మంది అసిస్టెంట్ కమాండెంట్ ప్రొబేషనర్లు, 124 మంది సబ్‌ఇన్‌స్పెక్టర్ శిక్షణార్థులను గవర్నర్ అభినందించారు. పరేడ్‌లో ప్రదర్శించిన క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, వృత్తి నైపుణ్యం వారి అంకితభావానికి నిదర్శనమని పేర్కొన్నారు.దేశంలోని విమానాశ్రయాలు, ఓడరేవులు, అణు కేంద్రాలు, అంతరిక్ష సంస్థలు, ఇంధన ప్రాజెక్టులు, మెట్రో నెట్‌వర్క్‌లు, కీలక పారిశ్రామిక సంస్థల భద్రతలో సీఐఎస్ఎఫ్ విశిష్ట సేవలందిస్తోందని గవర్నర్ అన్నారు. సంస్థల భద్రతతో పాటు దేశ ఆర్థికాభివృద్ధి, ప్రజల విశ్వాసాన్ని కాపాడటంలో కూడా సీఐఎస్ఎఫ్ పాత్ర ఎంతో కీలకమని తెలిపారు.ప్రస్తుత కాలంలో ఉగ్రవాదం, సైబర్ నేరాలు, డ్రోన్ ఆధారిత ముప్పులు వంటి సవాళ్లు పెరుగుతున్న నేపథ్యంలో భద్రతా సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, వృత్తి నైపుణ్యం, వేగవంతమైన నిర్ణయ సామర్థ్యంతో యువ అధికారులు ఈ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటారని విశ్వాసం వ్యక్తం చేశారు.అధికారుల భుజాలపై అలంకరించిన నక్షత్రాలు కేవలం హోదాకు ప్రతీకలు మాత్రమే కాకుండా దేశం ఉంచిన విశ్వాసానికి, బాధ్యతకు, కర్తవ్యనిష్ఠకు సంకేతాలని గవర్నర్ అన్నారు. నాయకత్వానికి అధికారం కంటే వ్యక్తిత్వం, నిజాయితీ, ధైర్యం, సేవాభావమే నిజమైన పునాదులని సూచించారు.సాయుధ దళాల్లో సేవలందించిన అనంతరం మళ్లీ యూనిఫాం సేవను ఎంచుకున్న మాజీ సైనిక శిక్షణార్థులను ప్రత్యేకంగా అభినందించిన గవర్నర్, వారి దేశభక్తి, అంకితభావం ఆదర్శప్రాయమని కొనియాడారు.ఎన్ఐఎస్ఏ డైరెక్టర్ హర్ ప్రీత్ కౌర్ సోహి పాసింగ్ అవుట్ అవుతున్న అధికారులతో ప్రమాణ స్వీకారం చేయించారు.అనంతరం అసిస్టెంట్ కమాండెంట్ లలోప్రతిభ కనబర్చిన శిక్షణార్థులు సుమిత్ లాత్వల్ (ఆల్ రౌండర్ , స్వోర్డ్ ఆఫ్ ఆనర్ కేటగిరి) ,ఆర్యన్ తివారి ( బెస్ట్ ఇన్ అవుట్ డోర్),అలోక్ తోమర్ ( బెస్ట్ ఇన్ ఇండోర్), సురేంద్ర కుమార్ మీనా ( బెస్ట్ ఇన్ ఫైరింగ్),సబ్ ఇన్స్పెక్టర్ ( ఎక్స్ సర్వీస్ మెన్ ) కేటగిరి లో ప్రతిభ కనబర్చిన సురేష్ కుమార్ (ఆల్ రౌండర్ కేటగిరి) , దీపక్ కుమార్ సింగ్( బెస్ట్ ఇన్ అవుట్ డోర్),గౌరవ్ శర్మ ( బెస్ట్ ఇన్ ఇండోర్), సురేంద్ర ధర్మేందర్ సింగ్( బెస్ట్ ఇన్ ఫైరింగ్) లకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పురస్కాలు అందించి అభినందించారు.అంతకు ముందు గవర్నర్ దేశ సేవలలో అమరులైన సిఐఎస్ఎఫ్ అధికారులకు నివాళులు అర్పించారు.కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ ప్రవీర్ రంజన్, అదనపు డైరెక్టర్ జనరల్ ( హెడ్ క్వార్టర్స్) విజయ్ ప్రకాశ్, ఎన్ఐఎస్ఏ డైరెక్టర్ హర్ ప్రీత్ కౌర్ సోహి, సీఐఎస్ఎఫ్ సీనియర్ అధికారులు, శిక్షకులు, శిక్షణార్థులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న అమ్మకానికి టెండర్లు

### మూడు విడతలుగా విక్రయాలు

### రేపు 4.60 లక్షల టన్నుల వేలం

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని రైతుల నుండి సేకరించిన మొక్కజొన్న నిల్వలను విక్రయించాలని తెలంగాణ రాష్ట్ర కోపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ (మార్క్‌ఫెడ్) నిర్ణయిం చింది. ఈ నేపథ్యంలో ఈ మొక్కజొన్న నిల్వల విక్రయానికి మార్క్‌ఫెడ్ ఈ నెల 7వ తేదీన ఈ టెండర్లను అహ్వానించింది. రాష్ట్ర వ్యాప్తంగా నిల్వ ఉంచిన మొక్కజొన్నను మూడు విడతలుగా వేలం వేయడం ద్వారా విక్రయించనున్నారు. మొదటి విడతలో 16 లాట్లను ఈ నెల 15న వేలం వేసి విక్రయించనుండగా, రెండవ విడతకు జూలై 16, 17 తేదీలలో మరో రెండు విడతల్లో బిడ్లు నిర్వహిస్తారు. ప్రతి విడతలో సగటున 4.60 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న వేలం వేయనున్నట్లు మార్క్‌ఫెడ్ అధికారవర్గాల సమాచారం. కాగా తెలంగాణలో వరి తర్వాత మొక్కజొన్న అత్యంత ప్రాముఖ్యమైన రెండవ ప్రధాన పంట.

రాష్ట్ర వ్యాప్తంగా యాసంగి సీజనుకు సంబంధించి 16.37 లక్షల ఎకరాల్లో మొక్క జొన్న పంటను రైతులు సాగు చేశారు. తద్వారా మొత్తంగా 43 లక్షల టన్నుల మొక్కజొన్న ఉత్పత్తి అయ్యింది. రాష్ట్రంలోని నిర్మల్, వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్, కొత్త గూడెం, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అత్యధికంగా మొక్కజొన్న పంటను రైతాంగం సాగు చేసింది. రైతులు నష్టపోకూడదనే ఉద్దేశ్యంతో, రాష్ట్ర ప్రభుత్వం నేరుగా మార్క్‌ఫెడ్ ద్వారా మొక్క జొన్నను కొనుగోలు చేస్తూ ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో 22 లక్షల టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినా, మార్క్‌ఫెడ్ రాష్ట్రం మొత్తం మీద దాదాపు 15 లక్షల టన్నులకు వరకూ మాత్రమే రైతుల వద్ద నుండి కొనుగోలు చేసింది. ఈ లెక్కన నిర్ధారించిన లక్ష్యం కన్నా ఇంకా సుమారు 7 లక్షల టన్నులకు పైగా మొక్కజొన్న తక్కువగా కొనుగోలు చేసింది. ఇప్పుడు ఈ మొక్కజొన్న నిల్వలను విక్రయిం చాలని మార్క్‌ఫెడ్ చర్యలు చేపట్టింది.

# ప్రజాపాలనలో పర్యాటక రంగానికి కొత్తఊపు

### మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 13:** ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం విజయ వంతంగా ముగిసిందని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రెండున్నరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పర్యాటక, సాంస్కృతిక, వారసత్వ రంగాల్లో సాధించిన ప్రధాన విజయాలను మంత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణను ప్రపంచస్థాయి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడం, రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షి ంచడం, కళాకారుల సంక్షేమాన్ని ప్రోత్సహించడం, పర్యాటక మౌలిక సదుపాయాలను విస్తరించడం, పెట్టుబడులను ఆకర్షించడం, స్థానిక ఉపాధి అవకాశాలను పెంపొందించడం వంటి లక్ష్యాలతో సమగ్ర కార్యాచరణ చేపట్టిందని మంత్రి తెలిపారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం తొలిసారిగా తెలంగాణ టూరిజం పాలసీ 2025-2030ను అమలు చేశామని మంత్రి తెలిపారు. ఈ విధానం ద్వారా రూ.15 వేల కోట్ల పెట్టుబడులు, 3 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. పీపీపీ విధానంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, సుస్థిర పర్యాటకం, డిజిటల్ ప్రచారం, అంతర్జాతీయ బ్రాండింగ్, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.టూరిజం కాన్‌క్లేవ్2025 ద్వారా 24 మంది పెట్టుబడిదారుల నుంచి రూ.15,285 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు లభించాయని మంత్రి తెలిపారు. అదేవిధంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్2025లో 18 మంది పెట్టుబడిదారులతో రూ.8,456 కోట్ల విలువైన అవగాహన ఒప్పందాలు కుదిరాయని చెప్పారు. వీటి ద్వారా 10 వేల ప్రత్యక్ష, 30 వేల పరోక్ష ఉద్యోగాలు సృష్టించబడనున్నాయని పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.181 కోట్ల విలువైన ప్రాజెక్టులు మంజూరయ్యాయని తెలిపారు. బుద్ధవనం, రామప్ప, సోమశిల, నిజాంసాగర్, బల్కంపేట ఆలయం అభివృద్ధి పనులు కొనసా గుతున్నాయని చెప్పారు.రాష్ట్రంలో పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగిందని మంత్రి తెలిపారు. 2023లో 5.84 కోట్లుగా ఉన్న దేశీయ పర్యాటకుల సంఖ్య 2024లో రికార్డు స్థాయిలో

# తెలంగాణలో భారీ వర్షాలు..

### విద్యుత్ శాఖ అప్రమత్తం

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** తెలంగాణలో నైరుతి రుతుపవనాలు విస్తరించాయి. ప్రస్తుతం చురుగ్గా కదులుతున్నాయి. ఇదే సమయంలో బంగాళాఖాతంలో ఓ ఉపరితల ఆవర్తనం, అరేబియా సముద్రం నుండి బంగాళాఖాతం వరకు ద్రోణి కొనసాగుతోంది. వీటన్నింటి ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా రాబోయే రెండు, మూడు రోజుల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి. రాష్ట్రంలోని నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వీటితో పాటు హైదరాబాద్‌తో సహా దాదాపు 30కి పైగా జిల్లాల్లో గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. ఈ నెల 14, 15 తేదీల్లో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల, ఖమ్మం, కొత్తగూడెం తదితర జిల్లాల్లో 30 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తూ తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. మరోపక్క శనివారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురిశాయి. హకీంపేట్‌లో రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం నమోదైంది. హైదరాబాద్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురిశాయి. గడచిన 24 గంటల్లో హకీంపేట్‌లో 63 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, హైదరాబాద్‌లో 23.6 మిల్లీ మీటర్లు, ఖమ్మంలో 15.2 మిల్లీ మీటర్లు, మెదక్‌లో 15 మిల్లీ మీటర్లు, నిజామాబాద్‌లో 17.5 మిల్లీ మీటర్లు, పఠాన్‌చెర్వులో 16 మిల్లీ మీటర్ల వర్షపాతం రికార్డయింది. కాగా ప్రకృతి వైపరీత్యాలు, భారీ గాలివానలు, వర్షాలు సంభవించిన సమయంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ సూచించింది. తెగిపోయిన విద్యుత్ వైర్లు, కూలిపోయిన విద్యుత్ స్తంభాలు లేదా విద్యుత్ సంబంధిత ప్రమాదకర పరిస్థితులు కనిపించిన వెంటనే కాల్ సెంటర్ 1912కు సమాచారం అందించాలని కోరింది. ప్రజలు స్వయంగా విద్యుత్ వైర్లు లేదా ఇతర విద్యుత్ పరికరాలను తాకేందుకు, తొలగించేందుకు లేదా మరమ్మత్తులు చేయడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించరాదని స్పష్టం చేసింది.

### నేటి నుంచి 21 వరకు సాలార్‌జంగ్ మ్యూజియం


## ప్లాటినం జూబ్లీ వారోత్సవాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 13:** సాలార్ జంగ్ మ్యూజియం ప్లాటినం జూబ్లీ వారోత్సవాలను ఘనంగా నిర్వహిం చేందుకు మ్యూజియం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.సాలార్ జంగ్-3 నవాబ్ మీర్ యూసుఫ్ అలీ ఖాన్ జయంతిని పురస్కరిం చుకుని నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో ప్రత్యేక ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యా సంబంధిత కార్యక్రమాలు, ప్రత్యేక ప్రచురణలు, ప్రజా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మ్యూజియం చారిత్రక వైభవాన్ని, అరుదైన కళాఖండాల ప్రాముఖ్యతను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు యువతలో వారసత్వ సంపద పట్ల అవగాహన పెంపొందించే లక్ష ్యంతో ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నారు.రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆదివారం సాయంత్రం 04.30 గంటలకు సాలార్ జంగ్ మ్యూజియంకు చేరుకుని సాలార్ జంగ్ మ్యూజియం ప్లాటినం జూబ్లీ వారోత్సవాలను ప్రారంభిస్తారు.

**నేడు ఉదయం 07.00 గంటలకు**

**ర్యాలీని ప్రారంభించనున్న గవర్నర్**

ఆదివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మార్గ్‌లో బి ఆర్ అంబేద్కర్ విగ్రహం నుండి సాగే ర్యాలీని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఉదయం 07.00 గంటలకు జెండా ఊపి ప్రారంభించనున్నారు. అనంతరం లోక్‌భవన్ లో సంస్కృతి కమ్యూనిటీ హాల్లో ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని రాష్ట్ర గవర్నర్ ప్రారంభించనున్నారు.



ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై గందరగోళం వద్దు

### బిసి సంఘాల డిమాండ్

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త :** ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం పై ప్రభుత్వం నిత్యం జారీ చేస్తున్న జీవోలతో విద్యార్థులు, తల్లి దండ్రులు తీవ్రగందర గోళానికి గురవుతున్నారని బీసీ సంఘాల ప్రతి నిధులు మండి పడ్డారు. పాత విధానాన్నే యథాతథంగా కొనసా గించాలని, పెండింగ్‌లో ఉన్న రూ. 6 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. శనివారం బీసీ భవన్‌లో డాక్టర్ ర్యాగ అరుణ్ కుమార్ అధ్యక్షతన 18 బీసీ సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. 'ప్రభుత్వం జీవో నంబర్ 7ను జారీ చేసి, వ్యతిరేకత రావ డంతో తాజాగా 8, 9 జీవోలను తీసుకురావడం దారుణం. రోజుకో జీవోతో విద్యార్థుల భవిష్యత్తును సందిగ్ధంలో పడేస్తున్నారు. పథకాన్ని ఎత్తివేయాలను కుంటే ధైర్యంగా చెప్పండి, ప్రజాక్షేత్రంలో తేల్చుకుందాం' అని సవాలు విసిరారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 33 నెలలు గడిచినా, బకాయిలు చెల్లించలేదని, ఇప్పుడు నెలకు రూ. 300 కోట్లు ఇస్తామంటే ఎలా నమ్మాలని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే పాత విధానాన్ని పునరుద్ధరించి, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, ఈ అంశంపై ముఖ్యమంత్రి అ ఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఆట

# డెబ్యూ మ్యాచ్‌లోనే వికెట్ల పంట




(వార్త క్రీడా విభాగం)

డెబ్యూ మ్యాచ్‌లోనే గుర్నూర్ బ్రార్, హర్ష్ దూబే అదరగొట్టాడు. టీమిండియా తరపున గ్రాండ్‌తో ఎంట్రీ ఇచ్చారు. అఫ్గానిస్తాన్‌తో జరిగిన తొలి వన్డేలోనే ఇద్దరూ కుర్రాళ్లు మూడేసి వికెట్లు తీసి ఆ జట్టును కట్టడిచేశారు.

పంజాబ్‌కు చెందిన కుడిచేతివాటం పేసర్ గుర్నూర్ బ్రార్.. వస్తూనే తొలి ఓవర్ అయిదో బంతికే వికెట్ సాధించాడు. ఓపెనర్ జద్రాన్‌ను అద్భుత బంతితో పెవిలియన్‌కు చేర్చి అఫ్గానిస్తాన్ వికెట్ పతనానికి నాంది పలికాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో తను వేసిన తొలి ఓవర్లో రెండు పరగులిచ్చి వికెట్ పడగొట్టడం ద్వారా ఆకట్టుకున్నాడు. ఇక ఆఫ్ఘన్ ఇన్నింగ్స్‌లో చివరి ఓవర్ వేసిన గుర్నూర్ బ్రార్.. ఆ ఓవర్లో ఏకంగా రెండు వికెట్లు పడగొట్టాడు. మొదట రషీద్ ఖాన్‌ను క్లీన్ బౌల్డ్ చేసిన గుర్నూర్... ఆ తర్వాతి రెండో బంతికే జియావుర్ రహమాన్‌కు చమ్కా ఇచ్చి అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్‌ను194రన్స్‌కు తెరదించాడు. వికెట్లపతనాన్ని ప్రారంభించిన గుర్నూర్..వికెట్ల ముగింపును శాసించాడు. మొత్తంగా 4.5 ఓవర్లలో 27 రన్స్ ఇచ్చి 3వికెట్లు పడగొట్టాడు. కెప్టెన్ గిల్ నమ్మకాన్ని నిలబెట్టాడు.

ఇక మరో డెబ్యూ బౌలర్ హర్ష్ దూబే కూడా సత్తా చాటాడు. అయితే తన తొలిఓవర్లోనే 16రన్స్‌తో కాస్ట్‌లీగా తేలాడు. రెండో ఓవర్‌లో మరో పది పరుగులిచ్చాడు. బ్రేక్ తర్వాత మరోసారి బౌలింగ్‌కు వచ్చి వికెట్లు సాధించాడు. 17వ ఓవర్లో కేవలం ఒక పరుగే ఇచ్చి హస్మతుల్లాను బోల్తా కొట్టించి తొలి వికెట్ సాధించాడు. తన అయిదో ఓవర్లో మొదట అజ్మతుల్లాను, రెండుబంతుల తర్వాత ఘజన్‌ఫర్‌ను వికెట్లు కూల్చాడు. ఈ విధంగా ఒకే ఓవర్లో రెండు వికెట్లు సాధించాడు. మొత్తంగా 5 ఓవర్లు వేసి 47 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు.

**గిల్ మెచ్చిన క్రికెటర్ గుర్నూర్**

గుర్నూర్ బౌలింగ్ యాక్షన్ డెయిల్ స్టెయిన్‌లా ఉంటుంది. చిన్న వయసులో క్రికెట్ కంటే ఫుట్‌బాల్, టెన్నిస్ ఇష్టపడేవాడు. అయితే హైట్ అడ్వాంటేజ్ కారణంగా కొందరి మిత్రుల సలహాతో క్రికెట్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. రెండేళ్లలోనే ఇండియా అండర్19 జట్టుకు ఎంపియ్యాడు. అక్కడే గుర్నూర్‌కు గిల్ పరిచయమయ్యాడు. అతడి టాలెంట్‌ను గమనించిన గిల్ కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చాడు. అలా పంజాబ్ అండర్ 23 జట్టులో చోటు దక్కించుకున్న గుర్నూర్ బ్రార్ 2021లో లిస్ట్‌ఏతో పాటు ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. 2023లో పంజాబ్ కింగ్స్‌కు నెట్‌బౌలర్‌గా వచ్చిన గుర్నూర్ బ్రార్‌కు అనుకోకుండా జట్టుకు ఆడే అవకాశం వచ్చింది. సెలెక్టర్ల దృష్టిలో పడిన గుర్నూర్ బ్రార్‌ను గతేడాది ఇండియాఏ జట్టుకు ఎంపిక చేయడంతో అతడి కెరీర్ మలుపు తిరిగింది.

**నిఖార్సైన స్పిన్ ఆల్‌రౌండర్**

విదర్భకు చెందిన హర్ష్ దూబే నిఖార్సైన ఆల్‌రౌండర్, 2024-25సీజన్‌లో 69వికెట్లు తీసి విదర్భను రంజీ ఛాంపియన్‌గా నిలిపాడు. ఈ ప్రదర్శనతో ఇండియా-ఏ జట్టులోకి ఎంపికయ్యాడు. ఇక విజయ్ హజారే ట్రోఫీలో కెప్టెన్‌గా విదర్భను నడిపించిన హర్ష్‌దూబే ఆ జట్టుకు తొలి టైటిల్ అందించాడు. దేశవాళీ క్రికెట్‌లో ప్రదర్శనతో హర్ష్‌ను ఐపీఎల్ 2025 సీజన్‌కు ముందు ఎస్ఆర్‌హెచ్ కొనుగోలు చేసింది. ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్‌తో ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన హర్ష్ దూబే ఆ సీజన్‌లో మూడు మ్యాచ్‌ల్లో ఐదు వికెట్లు తీశాడు. 2026 సీజన్‌కు ఎస్ఆర్‌హెచ్ అతడిని రిటైన్ చేసుకుంది. ఈ సీజన్‌లో 8 మ్యాచ్‌లాడిన హర్ష్‌దూబే 8 వికెట్లు తీశాడు.




## పరాగ్వేపై అమెరికా సూపర్ విక్టరీ

**న్యూయార్క్:** ఫిఫా వరల్డ్ కప్‌లో ఆతిథ్య అమెరికా శుభారంభం చేసింది. పరాగ్వేపై ఆధిపత్యం ప్రదర్శిస్తూ 4-1 గోల్స్ తేడాతో సూపర్ విక్టరీ నమోదు చేసింది. ఫిఫా ప్రపంచకప్ చరిత్రలోనే ఒక మ్యాచ్‌లో నాలుగు గోల్స్ చేయడం అమెరికాకిదే తొలిసారి. సొంత ప్రేక్షకుల మధ్య మొదట్నుంచీ దూకుడుగా ఆడిన అమెరికా.. పరాగ్వేకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. ఆట ప్రారంభమైన ఏడు నిమిషాలకే డామియన్ గోల్ సాధించి అమెరికాకు ఆధిక్యం అందించాడు. ఇక ఫోలారిన్ వరుసగా రెండు గోల్స్ కొట్టడంతో తొలి అర్ధభాగం సమయానికే 3-0 ఆధిక్యం పొందింది. రెండో అర్ధభాగం 73వ నిమిషంలో మోరిసియో.. పరాగ్వేకు గోల్ అందించాడు. ఇక ఆట అదనపు సమయంలో అమెరికా ప్లేయర్ గివోన్నిరీనా అదిరిపోయే గోల్ సాధించిపెట్టాడు. దీంతో అమెరికా 4-1 తేడాతో పరాగ్వేపై నెగ్గింది.

**కెనడా-బోస్నియా మ్యాచ్ డ్రా**

అంతకుముందు అర్ధరాత్రి మరో ఆతిథ్య దేశం కెనడా తన తొలి మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. బోస్నియాతో జరిగిన పోరులో 1-1తో కెనడా సమంగా నిలిచింది. అయితే ఫిఫా ప్రపంచ కప్‌లో తొలిసారి కెనడా పాయింట్‌ను సాధించడం గమనార్హం. గత ఎడిషన్లలో ఆరు మ్యాచుల్లోనూ కెనడా ఓడింది.

## నెయ్‌మార్‌కు గాయం:మొరాకోతో బ్రెజిల్ తొలి పోరు

**న్యూజెర్సీ:** ఫిఫా వరల్డ్ కప్‌లో మరో హాట్ ఫేవరెట్ బ్రెజిల్ తొలి మ్యాచ్‌ను సిద్ధమైంది. ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటలకు మొరాకోతో తలపడనుంది. ఈ కీలక పోరుకు ముందు బ్రెజిల్‌కు బిగ్ షాక్ తగిలింది. స్టార్ ఫుట్‌బాలర్ నెయ్‌మార్ గాయం కారణంగా తొలి మ్యాచ్‌కు దూరమయ్యాడు. యువ ఆటగాళ్లపై బ్రెజిల్ ఆశలు పెట్టుకుది. రఫిన్హా, వినిసియస్ జూనియర్, మాథ్యూస్ కున్హామెరుగైన ఫామ్‌లో ఉన్నారు. అలాగే ఎండ్రిక్, ఇగోర్ థియాగో వంటి యువ ఆటగాళ్లు కూడా ఆశలు రేకెత్తిస్తున్నారు. మిడ్‌ఫీల్డ్‌లో కాసెమిరో, బ్రూనో గిమారెస్, లూకాస్ పక్వేటా కీలక పాత్ర పోషించనున్నారు. మొరాకోను తేలికగా తీసుకునే పరిస్థితి లేదు. ప్రస్తుతం మంచి ఫామ్‌లో ఉంది. కెప్టెన్ అష్రఫ్ హాకీమ్, స్టార్ ఫార్వర్డ్ బ్రాహిమ్ డియాజ్ జట్టుకు ప్రధాన బలంగా ఉన్నారు. గత ప్రపంచకప్‌లో సంచలన ప్రదర్శన చేసిన మొరాకో ఈసారి కూడా డార్క్ హార్స్‌గా బరిలోకి దిగుతోంది. సమష్టి ఆటతో ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇవ్వగల సామర్థ్యం ఆ జట్టుకు ఉంది. బ్రెజిల్, మొరాకో జట్లు ఇప్పటివరకు రెండుసార్లు తలపడగా 1-1 విజయంతో సమవుజ్జీగా ఉన్నాయి. దీంతో ఈ మ్యాచ్‌పై ఆసక్తి మరింత పెరిగింది.



## గిల్ కెప్టెన్ ఇన్నింగ్స్ భారత్ బిగ్ విక్టరీ




**ధర్మశాల:** అఫ్గానిస్తాన్‌తో సొంతగడ్డపై జరుగుతున్న వన్డే సిరీస్‌లో టీమిండియా శుభారంభం చేసింది. ధర్మశాల వేదికగా జరిగిన తొలి వన్డేలో 7 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందుకుంది. వర్షం అంతరాయంతో మ్యాచ్‌ను 25 ఓవర్లకు కుదించారు. అఫ్గానిస్తాన్ విధించిన 195 పరుగుల లక్ష్యాన్ని టీమిండియా 22.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. మూడు వన్డేల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో నిలిచింది.

లక్ష్య చేధనలో రోహిత్ శర్మ(16)వికెట్‌ను 46 పరుగుల వద్ద కోల్పోయింది. జోరుమీద కనిపించిన రోహిత్ రనౌట్‌గా వెనుదిరిగాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (66 బంతుల్లో 84 నాటౌట్).. ఇషాన్ కిషన్(34)తో కలిసి రెండో వికెట్‌కు 70 రన్స్ జోడించాడు. శ్రేయాస్‌అయ్యర్(12) నిరాశపరిచినా... రాహుల్ అండగా కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. చివర్లో కేఎల్ రాహుల్ (19 బంతుల్లో 39 నాటౌట్) ధనాదన్ ఇన్నింగ్స్‌తో టీమిండియాకు విజయాన్ని అందించాడు. ఆఫ్గన్ బౌలర్లలో రషీద్, రెహమాన్ షరిఫీ చెరొక వికెట్ తీశారు.

అంతకముందు తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గానిస్తాన్ 24.5 ఓవర్లలో 194 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్ (102) శతకంతో అదరగొట్టాడు. హస్మతుల్లా (26) రాణించాడు. భారత బౌలర్లలో హర్ష్‌దూబే, గుర్నూర్ బ్రార్ చెరో 3 వికెట్లు తీయగా, నితీశ్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్‌లు 2 వికెట్లు పడగొట్టారు. ఇరుజట్ల మధ్య రెండో వన్డే బుధవారం లక్నో వేదికగా జరగనుంది.


## సెమీస్‌లో సింధూకు మరోసారి నిరాశ

**సిడ్నీ:** ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. ఏకైక ఆశాకిరణంగా ఉన్న పీవీ సింధూ కూడా ఫైనల్ చేరకుండానే వెనుదిగిరింది. మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో సింధూ 20-22, 12-20తో వరుస గేమ్‌ల్లో టాప్ సీడ్ జపాన్ షట్లర్ అకానే యమగుచి చేతిలో ఓడింది. 43 నిమిషాల పాటు జరిగిన ఈ సెమీస్ పోరులో నెగ్గిన ప్రపంచ ఛాంపియన్ యమగుచి ఫైనల్లో ప్రవేశించింది.

సెమీఫైనల్ పోరును పీవీ సింధూ మంచి ఈజ్‌తో ప్రారంభించింది. చక్కని నెట్ గేమ్‌తో దూకుడు ప్రదర్శించిన సింధూ.. 12-6తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే బ్రేక్ తర్వాత వరుసగా ఆరు పాయింట్లు సాధించిన సమవుజ్జీగా నిలిచింది. ఇద్దరూ పోటీపోటీగా పాయింట్లు రాబట్టడంతో 20-20 వరకు స్కోరు సమంగా కొనసాగింది. ఈ దశలో సింధూ గేమ్ లయ తప్పింది. కీలక దశలో ఎర్రర్స్ చేయడంతో.. దీన్ని సద్వినియోగం చేసుకుంటూ యమగుచి వరుసగా రెండు పాయింట్లు సాధించి గేమ్‌ను సొంతం చేసుకుంది. ఇక రెండో గేమ్‌లో సింధూ తేలిపోయింది. మరోవైపు జపాన్ షట్లర్ సింధూకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా ఆధిక్యంలో దూసుకుపోయింది. రెండే గేమ్‌ను మరింత అలవోకగా 21-12తో ముగించి ఫైనల్లో ప్రవేశించింది.




ఈ ఓటమితో 2026 సీజన్‌లో తొలి బీడబ్ల్యూఎఫ్ టైటిల్ అందుకోవాలన్న సింధూ కల చెదిరింది. కాగా ఈ సీజన్ బీడబ్ల్యూఎఫ్ టూర్‌లో సింధూ... సెమీఫైనల్లో ఓడడం ఇది రెండోసారి. జనవరిలో జరిగిన మలేషియా ఓపెన్ సూపర్ 1000 టోర్నీలోనూ సింధూ సెమీస్‌లో చైనా షట్లర్ వాంగ్ జియి చేతిలో ఓడింది. చివరగా 2024లో లక్నో వేదికగా జరిగిన సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టైటిల్ నెగ్గింది.




## వడ్డీరేట్లు పెంచిన కెనరా, బరోడా

**ముంబయి,జూన్ 13:** ప్రభుత్వ రంగానికి చెందిన రెండు దిగ్గజ బ్యాంకులు బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంకు సడెన్ షాక్ ఇచ్చాయి. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్లను పెంచేశాయి. ఎంపిక చేసిన టెన్యూర్లపై గరిష్ఠంగా 5 బేసిస్ పాయింట్ల వరకు ఎంసీఎల్ఆర్ పెంచాయి. సవరించిన ఎంసీఎల్ఆర్ రేట్లు జూన్ 12 నుంచి అమల్లోకి వచ్చాయని బ్యాంకులు పేర్కొన్నాయి. నిధుల వ్యయ ఆధారిత వడ్డీ రేటుగా చెబుతుంటారు. ఇప్పుడు ఎంసీఎల్ఆర్ పెంచిన నేపథ్యంలో ఎంసీఎల్ఆర్‌కు లింక్ అయి ఉన్న లోన్ వడ్డీ రేట్లు పెరుగుతాయని చెప్పొచ్చు. ఇప్పటికే ఫ్లోటింగ్ రేటుపై లోన్లు తీసుకున్నవారికి ఈఎంఐ పెరుగుతుంది. ఫిక్స్‌డ్ వడ్డీ రేటుకు తీసుకున్నవారిపై ప్రభావం చూపించదని చెప్పొచ్చు. ఆర్బీఐ తన ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాల్లో కీలక రెపోరేటును మూడోసారి 5.25శాతం వద్ద స్థిరంగానే ఉంచింది. ఎంసీఎల్ఆర్ అనేది కనీస వడ్డీ రేటు. అంటే బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఇంతకంటే తక్కువ వడ్డీకి లోన్లు ఇచ్చేందుకు వీల్లేదు. అన్ని బ్యాంకులకు ఒకే విధానం ఉండాలన్న ఉద్దేశంతో కేంద్ర బ్యాంక్ 2016లో ఈ విధానం తీసుకొచ్చింది. కెనరా బ్యాంకు ప్రధానంగా తన షార్ట్ టర్మ్ టెన్యూర్లపై ఎంసీఎల్ఆర్ సవరించింది. ఓవర్‌నైట్ ఎంసీఎల్ఆర్ 5 బేసిస్ పాయింట్లు పెరగ్గా 7.90 శాతం నుంచి 7.95 శాతానికి చేరింది. ఒక నెల ఎంసీఎల్ఆర్ 8శాతం, 3 నెలల ఎంసీఎల్ఆర్ 8.25 శాతం, 6 నెలల ఎంసీఎల్ఆర్ కూడా 5 బేసిస్ పాయింట్లు పెరిగి 8.60 శాతానికి పెరిగింది. ఎక్కువగా కన్జూమర్ లోన్లకు లింక్ అయి ఉండే ఏడాది టెన్యూర్ ఎంసీఎల్ఆర్ 8.75 శాతంగా ఉంది. బ్యాంక్ ఆఫ్ బరోడా వడ్డీ రేట్లు మరో ప్రభుత్వ రంగ బ్యాంక్ బ్యాంక్ ఆఫ్ బరోడా 5 టెన్యూర్లపై ఎంసీఎల్ఆర్ పెంచింది. ఓవర్‌నైట్ ఎంసీఎల్ఆర్ 5 బేసిస్ పాయింట్లు పెరిగి 7.80 శాతం నుంచి 7.85 శాతానికి చేరింది. ఒక నెల ఎంసీఎల్ఆర్ 7.95 శాతం, 3 నెలల ఎంసీఎల్ఆర్ 8.20 శాతానికి చేరింది. 6 నెలల ఎంసీఎల్ఆర్ 8.50 శాతం, ఏడాది టెన్యూర్ ఎంసీఎల్ఆర్ 5 బేసిస్ పాయింట్లు పెరగడంతో 8.75 శాతానికి చేరింది.




### వాడకంలో లేని బ్యాంకు ఖాతాలు తొలగించండి

## కస్టమర్లకు బ్యాంకర్ల హెచ్చరికలు

**ముంబయి,జూన్ 13:** డిజిటల్ చెల్లింపులు పెరిగిన తర్వాత యూపీఐ చాలా మందికి రోజువారీ జీవితంలో భాగమైంది. డబ్బు పంపాలన్నా, బిల్లు చెల్లించాలన్నా యూపీఐనే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. వాడకంలో లేని బ్యాంకు ఖాతాలను తొలగించుకోవాలని బ్యాంకింగ్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. యూపీఐలో ఒకేమొబైల్ నంబర్‌కు ఒకటి కంటే ఎక్కువ బ్యాంక్ ఖాతాలను లింక్ చేసే అవకాశం ఉంటుంది. కొత్తబ్యాంక్ ఖాతా జోడిస్తే పాతది ఆటోమేటిక్‌గా తొలగిపోదు. అది కూడా యాప్‌లో కనిపిస్తూనే ఉంటుంది. అందుకే అవసరం లేని అకౌంట్లను స్వయంగా తొలగించాలి. వాడని బ్యాంక్‌ఖాతా యూపీఐలో ఉంటే కొన్ని ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆ ఖాతా ఇక యాక్టివ్‌లో లేకపోతే లావాదేవీలు విఫలమవుతాయి. రిఫండ్‌లు ఆలస్యమయ్యే అవకాశం ఉంటుంది. కొన్ని ఆటో డెబిట్ చెల్లింపులు కూడా ప్రభావితమవుతాయి. ఒకే యాప్‌లో చాలా బ్యాంక్ ఖాతాలు కనిపిస్తే ఏ ఖాతా ప్రస్తుతం ఉపయోగంలో ఉందో గుర్తించడం కష్టమవుతుంది. ముఖ్యంగా వృద్ధులు లేదా డిజిటల్ చెల్లింపులకు కొత్తగా అలవాటు పడుతున్న వారికి ఇది గందరగోళం కలిగించవచ్చు. అందుకే ప్రస్తుతం వాడుతున్న ఖాతాలను మాత్రమే ఉంచుకోవాలని బ్యాంకింగ్ నిపుణులు సూచిస్తున్నారు. బ్యాంక్ ఖాతామార్చిన తర్వాత యాక్టివ్ ఆటోపేలు, ఈఎంఐలు, సబ్‌స్క్రిప్షన్లు ఏ ఖాతాకు లింక్ అయ్యాయో ఒకసారి చెక్ చేయాలి. కొంతకాలానికోసారి యూపీఐలో ఉన్న బ్యాంక్ ఖాతాల జాబితాను పరిశీలించడం మంచిది. అవసరం లేని ఖాతాలను తొలగిస్తే యాప్ వినియోగం సులభంగా ఉంటుంది.

# ఈవీ డెలివరీ కోసం మూడునెలల వెయిటింగ్!

**ముంబయి,జూన్ 13:** పెట్రోలు డీజిల్‌ధరలు ఆకాశాన్నంటుతున్న క్రమంలో, వాహనదారులు ఎలక్ట్రిక్ వాహనాలు ఈవీల వైపు మళ్లుతుండటంతో ఈవీ కార్లకు ఒక్కసారిగా గిరాకీ పెరిగి, డెలివరీ కోసం నెలల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. మారుతి సుజుకి, టాటా మోటార్స్, మెర్సిడెస్‌బెంజ్, మహీంద్రా వంటి ప్రముఖ కంపెనీల పాపులర్ మోడళ్ల కోసం ప్రస్తుతం 3 నెలల వరకు వెయిటింగ్ పీరియడ్ నడుస్తోంది. పశ్చిమాసియా ఉద్రిక్తతల పుణ్యమా అని బయ్యర్లు ఇపుడు విద్యుత్ వాహనాలవైపు దృష్టి మార్చారు. అధిక ధరలు, ఛార్జింగ్ సదుపాయాల కొరత వంటి కారణాలతో ఈవీల కొనుగోలుకు వెనుకాడిన వినియోగదారులు, ఇప్పుడు వాటపైనే ఆసక్తి కనబరుస్తున్నారు.

మార్చి నెల నుంచి తమ బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాల (బీఈవీ) డిమాండ్ 40 శాతం మేర పెరిగిందని మెర్సిడెస్‌బెంజ్ ఇండియా వెల్లడించింది. ఏప్రిల్‌లో విడుదలైన సీఎల్ఏ బీఈవీ మోడల్‌కు రెండు నుంచి 3 నెలల వెయిటింగ్ పీరియడ్ సమయం ఉందని,




దీనివల్ల డీలర్లు కొత్త బుకింగ్స్‌ను నిలిపివేశారని కంపెనీ ఎండీ సంతోష్ అయ్యర్ తెలిపారు. బీఎండబ్ల్యూ ఇండియా సైతం ఇదే తరహాపరిస్థితులను ఎదుర్కొంటోంది. మేనెలలో ఆ కంపెనీ మొత్తం అమ్మకాల్లో ఈవీల వాటా 33 శాతానికి చేరుకోవడం విశేషం.

దేశీయ దిగ్గజ కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకికి చెందిన కొత్త ఈవిటారా ఎస్‌యూవీ బుకింగ్స్ గత నెలలో రెట్టింపయ్యాయని, దీంతో 6 నుంచి 8 వారాల నిరీక్షణ తప్పడం లేదని కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ వివరించారు. అదే విధంగా మహీంద్రా ఎక్స్‌యూవీ 9ఈ మోడల్‌కు 6నుంచి 8 వారాలు, టాటా మోటార్స్ పంచ్, టియాగో ఈవీలకు 6 వారాల వెయిటింగ్ పీరియడ్ కొనసాగుతోంది. 2026 మేలో ఎలక్ట్రిక్ కార్ల అమ్మకాలు రికార్డు స్థాయిలో 26,000 యూనిట్లను దాటాయి. ఇది గతేడాదితో పోలిస్తే 80 శాతం అధికం కావడం గమనార్హం. మొత్తం ప్యాసింజర్ వాహనాల్లో ఈవీల వాటా తొలిసారిగా 11 శాతాన్ని అధిగమించింది. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తిని పెంచేందుకు ఆటోమొబైల్ సంస్థలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నప్పటికీ, సరఫరా వ్యవస్థలో తలెత్తిన సమస్యలు సవాలుగా మారాయి. ఇంధన ధరల అనిశ్చితి నేపథ్యంలో, ఆర్థికంగా పొదుపు మార్గంగా వినియోగదారులు సహజంగానే ఈవీల వైపు ఆకర్షితులవుతున్నారు.



### ఫోర్బ్స్ జాబితాలో భారత సంతతి సిఇఒ

## రూ.57వేల కోట్లతో ఏడో స్థానం

**సిలికాన్‌వ్యాలీ,జూన్ 13:** అమెరికా ఐటి నగరం సిలికాన్ వ్యాలీలో ఒక ఎన్ఆర్ఐ మహిళ రికార్డు సాధించారు. గ్లోబల్ టెక్నాలజీ సంస్థ అరిస్టా నెట్‌వర్క్స్ ప్రెసిడెంట్, సీఈఓ అయిన జయశ్రీ ఉల్లాల్ అగ్రరాజ్యంలో సరికొత్త రికార్డుని నెలకొల్పారు. 2026 సంవత్సరానికి గాను ఫోర్బ్స్ ప్రకటించిన సొంతంగా ఎదిగిన అత్యంత సంపన్న మహిళలు జాబితాలో ఆమె అత్యున్నత స్థానాన్ని దక్కించుకున్నారు. ఈ ప్రతిష్టాత్మక లిస్ట్‌లో నిలిచిన ఏకైక భారత సంతతి మహిళ జయశ్రీ. ఫోర్బ్స్ జాబితా ప్రకారం జయశ్రీ ఉల్లాల్ నికర ఆస్తి విలువ ఏకంగా 6.8 బిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ. 56,700 కోట్లకు పైగా ఉంది. ఈ భారీ సంపదతో ఆమె ఫోర్బ్స్ వార్షిక జాబితాలో ఏడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ప్రస్తుత రియల్ టైమ్ మార్కెట్ విలువ ప్రకారం ఆమె ఆస్తి 6.5 బిలియన్ డాలర్లుగా ఉన్నప్పటికీ ప్రపంచ బిలియనీర్ల సరసన ఆమె అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. నెట్‌వర్కింగ్, సెమీకండక్టర్ రంగాలలో ఆమె మూడు దశాబ్దాలుగా అందించిన అద్భుతమైన నాయకత్వ పటిమకు ఈ విజయం నిదర్శనంగా నిలిచింది.

2008 నుంచి ఆమె సారథ్యం వహిస్తున్న అరిస్టా నెట్‌వర్క్స్ సాధించిన విజయాలే ఆమెను ఈ స్థాయికి చేర్చాయి. జయశ్రీ ఉల్లాల్ లండన్‌లో జన్మించినప్పటికీ ఆమె బాల్యమంతా దేశ రాజధాని న్యూఢిల్లీలోనే గడిచింది. చిన్నతనం నుంచే టెక్నాలజీ, ఇంజినీరింగ్ రంగాలపై ఆమెకు అమితమైన ఆసక్తి ఉండేది. ఉన్నత విద్య కోసం ఆమె అమెరికాకు వలస వెళ్లారు. శాన్ ఫ్రాన్సిస్కో స్టేట్ యూనివర్సిటీ నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన జయశ్రీ ఉల్లాల్ ఆ తర్వాత శాంటా క్లారా యూనివర్సిటీ నుంచి ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ పట్టా పొందారు.

అరిస్టా నెట్‌వర్క్స్ బాధ్యతలు చేపట్టడానికి ముందు జయశ్రీ సిలికాన్ వ్యాలీలోని దిగ్గజ సంస్థలైన ఏఎండీ, ఫెయిర్‌చైల్డ్ సెమీకండక్టర్స్ వంటి కంపెనీల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం అరిస్టా సంస్థలో జయశ్రీకి 3 శాతం వాటా ఉంది. దీంతో పాటు జయశ్రీ ఉల్లాల్ ప్రముఖ క్లౌడ్ కంపెనీ స్నోఫ్లేక్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లోనూ సేవలు అందిస్తున్నారు.

## స్పేస్‌ఎక్స్ ఐపిఒతో మిలియనీర్లుగా ఉద్యోగులు!

**న్యూయార్క్, జూన్ 13:** అంతరిక్ష పరిశోధన సంస్థ స్పేస్‌ఎక్స్ భారీ స్థాయిలో నిర్వహించిన ఐపీఓ సంస్థ ఉద్యోగులను మిలియనీర్లు చేసింది. సంస్థ షేర్ల లిస్టింగ్ అనంతరం 4,400 మందికి పైగా ఉద్యోగులు మిలియనీర్లుగామారిపోయారు. నాస్‌డాక్‌లో ఒక్కో షేర్‌ను 150 డాలర్ల ధరకు స్పేస్‌ఎక్స్ లిస్టింగ్ చేయగా, ట్రేడింగ్ ప్రారంభమైన వెంటనే షేరు ధర మరింత పెరిగింది. దీంతో సంస్థలో పనిచేస్తున్న ఇంజినీర్లు, రాకెట్ ప్రయోగాల సిబ్బంది, గంటల వారీ వేతనంపై పనిచేసే కార్మికులు సైతం భారీ సంపదను సొంతం చేసుకున్నారు. వీరిలో దాదాపు 400 మంది ఉద్యోగుల ఆస్తుల విలువ 100మిలియన్ డాలర్లకు మించి ఉండనున్నట్లు అంచనా. సాధారణంగా చాలా ఐపీఓల్లో వ్యవస్థాపకులే బిలియనీర్లుగా మారుతారు. కానీ 400 మంది ఉద్యోగులు ఈ స్థాయికి చేరుకోవడం అరుదైన విషయమని హిల్ డాట్‌కో విశ్లేషకుడు ఆండ్రూబెన్సన్ పేర్కొన్నారు.




ఇక స్పేస్‌ఎక్స్ వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ ఈ లిస్టింగ్‌తో ప్రపంచంలో తొలి ట్రిలియనీర్‌గా నిలిచారు. కంపెనీ ఉద్యోగుల్లో గావిన్ పెటిట్ అనే ఉద్యోగి 2012లో 80వేల డాలర్ల జీతంతో సంస్థలో చేరాడు. ఆ సమయంలో ఒక్కో షేర్ విలువ కేవలం 13.80డాలర్లే. అప్పట్లో స్పేస్‌ఎక్స్ రాకెట్ ప్రయోగాలు వరుసగా విఫలమవుతున్నప్పటికీ, నగదు బోనస్‌లకు బదులుగా షేర్లను స్వీకరించాలని ఆతడు తీసుకున్న నిర్ణయం ఇపుడు అతనికి అపార సంపదను తెచ్చిపెట్టింది. ప్రస్తుతం అతని వద్ద 50,000కు పైగా షేర్లు ఉన్నాయి.

## ద్రవ్యోల్బణ పెరుగుదలతో రెపోరేట్లలో మార్పులు




**ముంబయి,జూన్ 13:** దేశంలో ద్రవ్యోల్బణం మళ్లీ పెరుగుతుండటంతో భారతీయ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లను పెంచేదిశగా అడుగులు వేస్తోందని ఐసీఐసీఐ బ్యాంక్ గ్లోబల్ మార్కెట్స్ నివేదిక అంచనా వేసింది. రాబోయే రోజుల్లో ఆర్‌బీఐ రెపో రేటును 50 నుంచి 75 బేసిస్ పాయింట్ల వరకు పెంచే అవకాశం ఉందని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో ఈ మార్పులు చోటుచేసుకోవచ్చని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఐసీఐసీఐ బ్యాంక్ విశ్లేషణ ప్రకారం 2026-27ఆర్థిక సంవత్సరంలో దేశీయ ద్రవ్యోల్బణం 5 శాతానికి చేరే అవకాశం ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరల హెచ్చుతగ్గులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు మరియు దేశంలో మారుతున్న వాతావరణ పరిస్థితుల వల్ల ఆహార వస్తువుల ధరలు పెరగడం ఇందుకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడానికి ఆర్‌బీఐ సాధారణంగా వడ్డీ రేట్లను పెంచుతుంది. ప్రస్తుతం ఆర్‌బీఐ రెపో రేటు 5.25 శాతం వద్ద కొనసాగుతోంది. ఒకవేళ ఐసీఐసీఐ బ్యాంక్ అంచనాలే నిజమైతే, 50-75 బేసిస్ పాయింట్ల పెంపుతో రెపోరేటు 5.75నుంచి 6.00 శాతానికి చేరే ప్రమాదం ఉంది. గత కొన్ని త్రైమాసికాలుగా యథాతథ స్థితిని కొనసాగించినప్పటికీ మారుతున్న ఆర్థిక సమీకరణాల దృష్ట్యా రానున్న ద్రవ్య పరపతి సమీక్షల్లో కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఆర్‌బీఐ గనుక రెపో రేటును పెంచితే, వాణిజ్య బ్యాంకులు కూడా తమ రుణాలపై వడ్డీ రేట్లను పెంచుతాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., Renigunta Road, 3rd Mile Stone, Tirupati-517507 Ph. No. 2238770, Fax:: 08772238790, RNI No.64860/9 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.

# దేశంలోనే తెలంగాణలో అత్యధిక ద్రవ్యోల్బణం

## 6.15 శాతంతో అన్ని రాష్ట్రాల్లో కెల్లా హయ్యెస్ట్ - ఎస్‌బిఐ రీసెర్చ్ నివేదిక వెల్లడి

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** దేశంలోని అన్ని రాష్ట్రాలలోకెల్లా తెలంగాణలో ద్రవ్యోల్బణం అత్యధికంగా కొనసాగుతోంది. గత నెలలో ఇది 6.15 శాతానికి చేరిందని ఎస్‌బిఐ రీసెర్చ్ నివేదిక పేర్కొంది. ఇంధనంపై అధిక పన్నులు, గ్రామీణ వేతనాల పెరుగుదల, దిగుమతి చేసుకునే తాజా ఉత్పత్తులపై ఆధారపడటం దీనికి కారణంగా వెల్లడించింది. ఈ మేరు శనివారం విడుదలైన ఎస్‌బిఐ రీసెర్చ్ నివేదికలో వెల్లడించిన అంశాల ప్రకారం రాష్ట్ర స్థాయి వినియోగదారుల ద్రవ్యోల్బణ గణాంకాలు దేశవ్యాప్తంగా విస్తృత ప్రాంతీయ వ్యత్యాసాన్ని స్పష్టం చేస్తున్నాయి. దేశ వ్యాప్తంగా ఉన్న 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఉండగా, వీటిలో 12 నుండి 14 వరకూ ద్రవ్యోల్బణం అఖిల భారత స్థాయి కంటే ఎక్కువగా ఉంది. కర్ణాటక, తమిళనాడు, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి అనేక ప్రధాన రాష్ట్రాలలో ద్రవ్యోల్బణం అఖిల భారత స్థాయి కంటే ఎక్కువగా కొనసాగుతోందని నివేదిక పేర్కొంది. ప్రధాన రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్, అస్సాం, ఒడిశా రాష్ట్రాలు ఈ ఏడాది జనవరి నుండి మే మధ్యకాలంలో ద్రవ్యోల్బణంలో 2 శాతానికి పైగా పెరుగుదలను నమోదు చేయగా, అఖిల భారత స్థాయిలో ద్రవ్యోల్బణం కేవలం 1.19 శాతం మాత్రమే పెరిగింది. అయితే రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మధ్య ద్రవ్యోల్బణం పంపిణీని పరిశీలిస్తే, జనవరిమే మధ్య కాలంలో అధికశాతం రాష్ట్రాల్లో ద్రవ్యోల్బణం 24 శాతం మధ్య ఉన్నట్లు స్పష్టమవుతోందని నివేదిక పేర్కొంది. భారతదేశ వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లోని 3.48 శాతం నుండి మే నెలలో 3.93 శాతానికి పెరిగింది. ముఖ్యంగా పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల మరియు స్వల్ప ఎల్‌పిజి కొరత ప్రభావం మే నెల గణాంకాలలో స్పష్టంగా కనిపిస్తోంది. ఏప్రిల్‌తో పోలిస్తే మే నెలలో రవాణా ద్రవ్యోల్బణం 176 బేసిస్ పాయింట్లు పెరిగి 1.8 శాతానికి చేరింది. అదేవిధంగా, రెస్టారెంట్లు, వసతి సేవల (ఇవి ఎక్కువగా ఎల్‌పిజిపై ఆధారపడి ఉంటాయి) ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లోని 4.2 శాతంతో పోలిస్తే మే నెలలో 154 బేసిస్ పాయింట్లు పెరిగి 5.7 శాతానికి చేరింది. ఇక బంగారం, వెండి ధరలలో స్వల్ప పెరుగుదల కారణంగా పర్సనల్ కేర్ విభాగంలో ద్రవ్యోల్బణ రేటు దాదాపు 80 బేసిస్ పాయింట్లు పెరిగింది. వస్తువుల వారీగా చూస్తే, వెండి ఆభరణాలు ప్రధాన ద్రవ్యోల్బణానికి 56 బేసిస్ పాయింట్ల మేర దోహదపడగా, ఆ తర్వాత బంగారం 30 బేసిస్ పాయింట్ల మేర దోహదపడింది, ఇది గత నెలతో పోలిస్తే మారలేదు. ప్రపంచ బ్యాంకు పింక్ షీట్‌లో ప్రతిబింబించినట్లుగా, ప్రపంచ వస్తువుల ధరలలో బంగారంతో పోలిస్తే వెండిలో ద్రవ్యోల్బణం బలంగా ఉంది. పెట్రోల్ వాటా 14 బేసిస్ పాయింట్లకు పెరగగా, ఎల్‌పిజి కొరత కారణంగా వండిన మాంసం, వండిన స్నాక్స్ ధరలు పెరిగాయని ఆ నివేదిక పేర్కొంది.



స్వాధీనం చేసుకున్న హైడ్రాక్సీ ప్రొపైల్ బెటాడెక్స్

# అల్వాల్‌లో డ్రగ్ కంట్రోల్ అధికారుల దాడులు

## 70లక్షల విలువైన హైడ్రాక్సీ ప్రొపైల్ బెటాడెక్స్ స్వాధీనం

### ఉనికిలో లేని కంపెనీల లేబుల్స్‌తో దందా

**అల్వాల్, జూన్ 13 ప్రభాతవార్త:** ఉనికిలో లేని కంపెనీ లేబుల్స్ ఒక వైపు నకిలీ చిరునామాతో కోట్లల్లో దందా చేస్తున్న ఓ ముఠా వెలుగులోకి వచ్చింది. 70లక్షలు విలువైన ఫార్మా ముడి సరుకు అల్వాల్‌లో బయట పడడం సంచలనంగా మారింది. 240 కేజీల హైడ్రాక్సీ ప్రొపైల్ బెటాడెక్స్‌ను డ్రగ్ కంట్రోల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 12వ తేదీన అల్వాల్ మంగాపురంలోని డీకే ఫార్మాస్యూటికల్స్ కంపెనీపై అధికారులు దాడులు చేశారు. సంస్థ భవనంలో తనిఖీలు చేయగా విస్తుపోయే నిజాలు బయట పడ్డాయి. హైడ్రాక్సీ ప్రొపైల్ బెటాడెక్స్ ఉన్న 12 డ్రమ్ములను అధికారులు గుర్తించారు. డ్రమ్ములపై అసలుకు బదులుగా ఉనికిలో లేని కంపెనీలకు చెందిన నకిలీ లేబుల్స్ అంటించి ఉండడాన్ని గమనించారు. తయారీదారుడిగా డికె ఫార్మాస్యూటికల్ పేరును తప్పుగా లేబుల్స్‌పై పొందు పరిచారు. లేబుల్‌పై కంపెనీ చిరునామ సంగారెడ్డి జిల్లా, పాశమైలారంగా ఉంది. అధికారులు తనిఖీలులో ఆ చిరునామాలో అసలు కంపెనీ లేదని తేలింది. అనుమానంతో కూపీ లాగితే వీరి దందాకు అడ్డాగా అల్వాల్‌ను మార్చుకున్నట్లు గుర్తించారు. నకిలీ కంపెనీని నిర్వహిస్తున్న సతీష్ బాబు, ధూలపల్లి నాగస్వామి అక్రమ లేబలింగ్‌కు పాల్పడినట్లు అధికారులు నిర్ధారించారు. హైడ్రాక్సీ ప్రొపైల్ బెటాడెక్స్‌ను ఔషదాలు తయారీలో ఉపయెగించే సహాక పదార్థం. మందులు తయారీలో ఉపయోగించే ప్రధాన ఔషదం కాదు. ఫార్మా కంపెనీలు తయారు చేసే మందులులో హైడ్రాక్సీ ప్రొపైల్ బెటాడెక్స్ కలపడం ద్వారా నీటిలో ఔషదం బాగా కరిగి పోతుంది. మానవ శరీరంలో ఈ మందు తొందరగా ఇంకి పోవడంతో పాటుగా మందు స్థిరత్వంగా ఉండడానికి సహాయకారిగా ఉంటుంది. నిలువ కాలాన్ని పెంచడం, మందు ప్రభావవంతంగా పని చేయడానికి దోహదం చేసే కెమికల్. ఇంకా చెప్పాలంటే హైడ్రాక్సీ ప్రొపైల్ బెటాడెక్స్ అనేది మందు బాగా పని చేయడానికి కలిపే సహాయక పదార్థం. ఇది స్వతంత్రంగా ఏ వ్యాధిని నయం చేసే గుణాలు లేని పదార్థగా చెప్పవచ్చు. స్వాధీనం చేసుకున్న కెమికల్‌ను విశ్లేషణ కోసం సంబంధిత శాఖకు అధికారులు పంపించారు. నిందితులుపై డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ యాక్ట్ 1940 చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు.

# ఖమ్మం సంఘటనలో నిందితుడికి ఉరిశిక్ష వేయాలి

### - టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత

**జూబ్లీహిల్స్, జూన్ 13, ప్రభాతవార్త:** నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఖమ్మం బాధితురాలిని తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని, చిన్నారికి అందిస్తున్న వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితురాలి తల్లిదండ్రులను ఓదార్చి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఖమ్మం ఘటనలో నిందితుడిని ఉరి తీయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. మైనర్లపై దారుణాలు జరుగుతున్న ప్రభుత్వం పట్టించుకోవటం లేదని, హోంమంత్రిగా ఉన్న ముఖ్యమంత్రి వెంటనే ఈ దారుణాలను నివారించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటన హృదయ విదారకరమైందని, 12 ఏళ్ల బిడ్డ జీవితాంతం మంచానికే పరిమితం కావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అయితే ఈ కేసులో ప్రభుత్వ పెద్దలే కొందరు కేసు వాపసు తీసుకోవాలని ఒత్తిడి తెస్తున్నారని, ఇందులో ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి వెంటనే ఇంటిని మంజూరు చేయాలని, నెలవారి రూ. 50 వేలు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. నిందితుడు బెయిల్‌పై వచ్చి మళ్లీ బాధిత కుటుంబంపై దాడి చేసే పరిస్థితి కూడా లేకపోలేదని, అందుకే బాధితురాలి కుటుంబానికి భద్రత కల్పించాలన్నారు. ఈ సంఘటనలో ప్రభుత్వం కచ్చితంగా మానవీయకోణంలో ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి ఘోరాలు జరగకుండా మహిళ లోకానికి భరోసా ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అంతకముందు బక్క జడ్సన్, బీసీ సంఘాల నేతలు జాజుల శ్రీనివాస్‌గౌడ్ బాధితురాలిని పరామర్శించారు.

# జీడిమెట్ల పారిశ్రామికవాడలో బంగ్లాదేశ్ వలసవాదుల గుట్టురట్టు

## ఏడుగురిని అరెస్టు చేసిన పోలీసులు

**కుత్బుల్లాపూర్, జూన్ 13 ప్రభాతవార్త** నగర శివారు జీడిమెట్ల పారిశ్రామికవాడలో బంగ్లాదేశ్ అక్రమ వలస దారుల చొరబాటు గుట్టును పోలీసులు రట్టుచేశారు. బంగ్లాదేశ్ దేశంనుండి బెంగాల్‌లోకి చొరవడి అక్కడినుండి హైదరాబాద్‌కు వచ్చి స్థానిక జీడిమెట్ల పారిశ్రామికవాడలోని ప్రైవేట్ కంపెనీలలో ఉపాధి సంసాదించి తద్వారా వచ్చిన ఆదాయాన్ని హావాలా కార్యక్రలాపాలద్వారా తమ కుటుంబ సభ్యులకు డబ్బులు చేరవేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. కుత్బుల్లాపూర్ జోన్ డిప్యుటీ పోలీసు కమషనర్ ఎన్. కోటిరెడ్డి ఆదేశాల మేరకు జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాజులరామారం హెచ్ఎఎల్ ఏరియాలో ఒ అద్దెఇంట్లో ఏడుగురు బంగ్లాదేశీయులు నివసిస్తున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిపైతగిన నిర్బంధ, కదలికలనియంత్రణ ఉత్తర్వులను పొంది అరెస్టుచేశారు. జీడిమెట్ల పోలీసులు, కూకట్‌పల్లి స్పెషల్ ఆపరేషన్‌టీమ్(ఎస్ఓటి) పోలీసుల విచారణలో విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. పట్టుబడిన ఏడుగురు వ్యక్తుల వద్ద చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్టులుగాన, ఇతర డాక్యుమెంట్లుగానీ లేవు. వీరు దేశంలోని పలు ప్రాంతాలలో నివసించి చివరకు జీడిమెట్ల పారిశ్రామికవాడ సమీపంలోని హెచ్ఎఎల్ కాలనీకి చేరుకుని అద్దఇంట్లో నివసిస్తున్నట్లు నిఘావర్గాలు గుర్తించాయి. బంగ్లాదేశ్ నుండి పశ్చిమబెంగాల్‌లోకి ప్రవేశించి దళారుల సహాయంతో హైదరాబాద్ జీడివమెట్లకు ఏడుగురు వ్యక్తులు ప్రవేశించారు. అనంతరం దళారులద్వారా నకిలీ ఐడెంటిటీ కార్డులు, ఓటర్‌కార్డులతోపాటు పలు పత్రాలను సృష్టించి తద్వారా స్థానికంగా ఇళ్లను అద్దెకు తీసుకుని అనంతరం స్థానికంగా ఉద్యోగాలు సంపాదించారు. బంగ్లాదేశ్ దేశం నుండి అక్రమ వలసదారులు కేవలం పొట్టకూటికే వచ్చారా'లేక ఇతరేతర కారణాలేమైనా ఉండి ఉంటాయా అనేకోణాల్లో పోలీసులు విచారణ ప్రారంభించారు. ఇలాంటి అక్రమ వలసదారుల వెనక హ్యూమన్ ట్రాఫికింగ్ నెట్‌వర్క్ పనిచేస్తుందని నిఘా వర్గాలు అనుమానం వ్యక్తంచేస్తున్నాయి. గతంలోనూ బంగ్లాదేశ్ వలసదారుల ఉదంతాలు నగరాన్ని కంపించేలా చేయగా నగరంలోని బాలానగర్, పహాడీశరీఫ్, చాంద్రాయన్‌గుట్ట తదితర ప్రాంతాలలో నివాసముంటూ అనుమానాస్పద కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు గతంలోనే పోలీసులకు పలు అనుమానాలు తలెత్తాయి. బంగ్లాదేశ్ దేశంనుండి నగరంలోని జీడిమెట్ల పారిశ్రామికవాడకు వచ్చి ఉపాధి పొందుతున్న ఏడుగురు వలసవాదుల కార్యకలాపాలపై పోలీసులు ఇప్పటికే వివిధ కోణాల్లో విచారణ ముమ్మరంచేస్తున్నట్లు సమాచారం. అలజడులు సృష్టించే కుట్రలకు ఏమైనా పాల్పడుతున్నారా అనే కోణాల్లో విచారణ ముమ్మరం చేశారు.

# విద్యుత్ షాక్‌కు గురై తండ్రి, కూతురు మృతి

## కుటుంబాన్ని చిదిమేసిన విద్యుత్ శాఖ నిర్లక్ష్యం



బాధితులు సందీప్, రితిక (ఫైల్)

**అల్వాల్, జూన్ 13 ప్రభాతవార్త:** విద్యుత్ శాఖ నిర్లక్ష్యం రెండు నిండు ప్రాణాలను బలి తీసుకుంది. విద్యుత్ తీగలు, చెట్లు ప్రమాదకరంగా ఉన్నాయని మోర పెట్టుకున్నా పట్టింపు లేని ధోరణి ప్రమాదానికి కరణంగా మారింది. ఒకానోక కోడుకు, మనువరాలు విగత జీవులుగా మారడం, కోడలు ఒంటరి జీవితాన్ని కొనసాగించాలనే ఊహకే కుటుంబంలోని జీవిత చరమాంకంలో ఉన్న పెద్దలు జీర్ణించుకో లేక పోతున్నారు. అల్వాల్‌లోని టెలీకాం కాలనీలో సందీప్(45) భార్య మమత, కూతురు రితిక(16)తో కలిసి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. సందీప్ సాయి శ్రీ ఫుడ్స్‌లో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. శనివారం తెల్లవారు జాము 2.30 గంటలు సమయంలో కురిసిన వర్షానికి కాలనీలోని విద్యుత్ తీగలు ఇంటి ముందు ఉన్న చెట్టుపై పడ్డాయి. చెట్టు కింద కారు ఉండడంతో దానికి పక్కకు జరపడానికి సందీప్ భార్య మమత, కూతురు రితికి బయటకి వెళ్ళారు. ప్లాస్టిక్ ఇన్సులేషన్‌తో కూడిన విద్యుత్ తీగ వేలాడుతూ ఉండడాన్ని గమనించిన మమత దానిని కారుకు దూరంగా జరపడానికి ప్రయత్నించగా కరెంట్ షాక్‌కు గురై కింద పడిపోయింది. అప్పటికే కారులో ఉన్న సందీప్ బయటకి వచ్చిన సందర్భంలో మరో విద్యుత్ తీగ కుమార్తె రితిక మీద పడింది. కుమార్తెను రక్షించేందుకు సందీప్ ప్రయత్నిస్తున్న సమయంలో ఆయన విద్యుత్ షాక్‌కు గురయ్యారు. బయట చీకటిగా ఉండడంతో పొరపాటున కర్ర అనుకుని విద్యుత్ తీగను మొదట రితికి పట్టుకుంది. అప్పటికే విషయం కాలనీలోని ప్రజలకు తెలియడంతో అక్కడకి రావడం జరిగింది. అప్పటికి సందీప్, రితికలు జీవించే ఉన్నారు. ఎక్కడి వారు అక్కడే ఉండాలని ఇరువుని వారు హెచ్చరించారు. కూతురి పరిస్థితి ఎలా ఉందో అని ఆమెను సందీప్ పట్టుకున్నాడు. కూతురిని రక్షించే ప్రయత్నంలో సందీప్ కూడా షాక్‌కు గురై మరణించాడు. స్వల్ప గాయాలుతో మమత బయట పడగా కళ్ళ ఎదుట భర్త, కూతురు విగత జీవులుగా మారడాన్ని చూసిన ఆమె షాక్‌కు గురయ్యారు. విద్యుత్ శాఖకు ఫోన్ చేసినా స్పందించ లేదని కాలనీ వాసులు పేర్కొంటున్నారు.

# సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో

## సోషల్ మీడియా ఖాతాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, జూన్13:** సోషల్ మీడియా ఖాతాలపై కాంగ్రెస్ నాయకులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సూచనలు చేశారు. ఇటీవల గాంధీభవన్‌లో జరిగిన పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ సమావేశంలో సోషల్‌మీడియాలో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ వెనుకబడి ఉందని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాత్రం చాలా యాక్టివ్‌గా ఉన్నామని మళ్లీ సోషల్‌మీడియాను విరివిగా వినియోగించుకోవాలని సిఎం చెప్పారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ ఆదేశాలతో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు, నాయకులు, కార్యకర్తలు అందరూ ప్రస్తుతం సోషల్‌మీడియా ఖాతాలపై దృష్టి సారించడం విశేషం. ఢిల్లీ నుంచి గల్లీ దాక జరిగే సంఘటనలు, వాటికి సంబంధించిన అభిప్రాయాలను సోషల్ మీడియా ద్వారా పలువురు తమ అభిప్రాయాలను అధికంగా వ్యక్తం చేస్తుండడంతో మంత్రులంతా ప్రస్తుతం వాటిపైనే దృష్టి సారించారు. రాజకీయ నేతల ప్రజాదరణను అంచనా వేయడంలో సోషల్ మీడియా ప్రస్తుతం ఒక కొత్త ప్రమాణంగా మారుతోంది. సోషల్ మీడియా కేవలం ప్రచార వేదికగా మాత్రమే కాకుండా ప్రభుత్వ నిర్ణయాలపై ప్రజలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేసే వేదికగా మంత్రులు మార్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే రోడ్లు, సాగునీరు, విద్యుత్, ఆరోగ్యం, ఐటీ, రెవెన్యూ, హౌజింగ్ వంటి శాఖల మంత్రులు తమ శాఖల పురోగతిని ఎప్పటికప్పుడు ప్రజలతో పంచుకుంటున్నారు. దీనికితోడు సంప్రదాయ రాజకీయ ప్రచారానికి తోడు డిజిటల్ ప్రచారంపై మంత్రులు దృష్టి సారించడంతో టెక్నాలజీ వినియోగంలోనూ మంత్రులు ముందంజలో ఉన్నారని ప్రజలు సైతం పేర్కొంటుండడం విశేషం. ఈ నేపథ్యం లోనే మంత్రులు తమ రోజువారీ కార్యక్రమాలకు సంబంధించి వీడియోలు, ఫొటోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయిస్తుండడంతో గంటల వ్యవధిలోనే వేలాదిగా షేర్లు, కామెంట్లు వ్యూవర్స్ నుంచి అధికంగా వస్తున్నాయి.

# వెనిజులా డ్రగ్ కింగ్ రెస్తోన్‌ఫోర్డ్ గెర్రెరో హతం!

## ట్రూత్‌పోస్టులో వెల్లడించిన డొనాల్డ్‌ట్రంప్

**కారకాస్,జూన్ 13:** వెనిజులాకు చెందిన ప్రఖ్యాత నేర ముఠా ట్రెన్ డి అరాగువా నాయకుడు హెక్టర్ రుస్తెన్‌ఫోర్డ్ గెర్రెరో ఫ్లోరెస్ అలియాస్ నినో గెర్రెరో హతమైనట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అమెరికా సదర్న్ కమాండ్, వెనిజులా భద్రతా బలగాల సమన్వయంతో నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో అతడిని అంతమొందించినట్లు తెలిపారు. ట్రూత్ సోషల్ వేదికగా స్పందించిన ట్రంప్ నా ఆదేశాల మేరకు అమెరికా సదర్న్ కమాండ్ వేగవంతమైన, అత్యంత కచ్చితమైన దాడి నిర్వహించి ట్రెన్ డి అరాగువా నాయకుడు నినో గెర్రెరోను హతమార్చింది. ప్రపంచంలోని అత్యంత రక్తపిపాసి ఉగ్ర సంస్థల్లో ఇది ఒకటని పేర్కొన్నారు. అమెరికా ప్రభుత్వం ట్రెన్ డి అరాగువా ముఠాను ఉగ్రవాద సంస్థగా గుర్తించింది. డ్రగ్స్ అక్రమ రవాణా, మానవ అక్రమ రవాణా, వసూళ్లు, కిడ్నాప్‌లు, హత్యలు వంటి అనేక నేరాల్లో ఈ ముఠా ప్రమేయం ఉందని ఆరోపిస్తోంది. గెర్రెరో ఫ్లోరెస్‌పై అమెరికాలో రాకెటీరింగ్ కుట్ర సహా పలు కేసులు నమోదయ్యాయి. అతని అరెస్టుకు సంబంధించిన సమాచారానికి 5 మిలియన్ డాలర్ల వరకు బహుమతి కూడా ప్రకటించారు. బొలివార్ రాష్ట్రంలో నిర్వహించిన సంయుక్త ఆపరేషన్‌లో నినో గెర్రెరో మృతి చెందినట్లు వెనిజులా అధికారులు కూడా ధృవీకరించారు. అమెరికా సైన్యం ప్రత్యక్షంగా పాల్గొన్న విషయంపై అమెరికా, వెనిజులా వర్గాల వివరణల్లో స్వల్ప భేదాలు ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. జైలు నుంచి అంతర్జాతీయ నేర సామ్రాజ్యం ట్రెన్ డి అరాగువా ముఠా వెనిజులాలోని టోకోరాన్ జైలు నుంచి పుట్టుకొచ్చింది. నినో గెర్రెరో అక్కడి నుంచే తన నేర సామ్రాజ్యాన్ని విస్తరించి లాటిన్ అమెరికాలో అత్యంత భయంకరమైన నేర ముఠాల్లో ఒకటిగా మార్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ గ్యాంగ్ సభ్యుల సంఖ్య 2,500 నుంచి 5,000 మధ్య ఉంటుందని అంచనా. ఈ ఆపరేషన్ భద్రతకు ముప్పుగా భావిస్తున్నారు.

# ఒమన్ తీరంలో నౌకలపై దాడులపట్ల యుఎస్ విదేశాంగమంత్రితో జైశంకర్ భేటీ

**న్యూఢిల్లీ,జూన్ 13:** ఒమన్‌తీరంలో ఇటీవల భారతీయులు ఉన్న నౌకలపై అమెరికా దాడులు చేయడాన్ని భారత్ మరోసారి తీవ్రంగా ఖండించి ంది. ఈ దాడుల విషయమై అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్ జై శంకర్ మాట్లాడారు. ఈ సందర్భంగా దాడిపై ఆయన తీవ్ర నిరసన తెలియజేశారు. రూబియోతో శుక్రవారం సాయంత్రం మాట్లాడినట్లు జై శంకర్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. గల్ఫ్‌లో అమెరికా జరిపిన దాడుల్లో ముగ్గురు భారత నావికులు మరణించడంపై భారత్ తరవున నిరసన తెలిపారు. వాణిజ్య నౌకలపై ఇలాంటి దాడులు సమంజసం కాదని వ్యాఖ్యానించారు. ఈ విషయంపై ఢిల్లీలో అమెరికా దౌత్యాధికారి జేసన్ మీక్స్‌కు విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ రెండుసార్లు సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. భారతీయులున్న నౌకలపై దాడులు చేసింది ఇరానే అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోపించారు. ఈ ఆరోపణలను టెహ్రాన్ ఖండించింది. ఈ మేరకు భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం ఎక్స్‌లో పోస్టు పెట్టింది. భారతీయులున్న నౌకపై దాడులకు సంబంధించి ట్రంప్ ఆరోపణలు నిరాధారమైనవన్నారు.

## ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో.. వివిధ శాఖల్లో లక్ష పెండింగ్ ఫైళ్లు పరిష్కారం

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక ప్రత్యేక కార్యక్రమం దిగ్విజయంగా ముగిసింది. మార్చి 6 నుంచి ఈ నెల 12 వ తేదీ వరకూ వరకు గ్రామాలు, పట్టణాల్లో వివిధ అంశాలపై చేపట్టిన ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 12,758 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు, 3,175 మున్సిపల్ వార్డుల్లో వార్డు సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల్లో దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న 1,06,598 ప్రభుత్వ ఫైళ్లను అధికారులు పరిష్కరించారు. అలాగే జిల్లా స్థాయిలో 32,451 మంది లబ్ధిదారులకు ఆస్తుల మంజూరు ప్రక్రియ పూర్తి చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ కార్యక్రమంలో ప్రధానంగా ప్రజారోగ్యం, రోడ్డు భద్రత, సంక్షేమం, వ్యవసాయం, మహిళా సాధికారత వంటి రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. వ్యవసాయ రంగంలో 32,818 మంది రైతులు రుణమేళాల్లో పాల్గొన్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూ.6 కోట్లతో నిర్మించిన 50 అంగన్వాడీ కేంద్రాలను ప్రారంభించారు.

# సెల్ఫీ వీడియో తీసుకొని రైతు ఆత్మహత్య

**గుంటూరు జూన్ 13, ప్రభాతవార్త ప్రతినిధి :** పల్నాడు జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. అప్పుల బాధ తట్టుకోలేక ఓ యువ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియో తీసుకొని తన ఆవేదనను వెల్లడించడం స్థానికంగా కలకలం రేపుతోంది. ఈ ఘటన పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం రావులాపురం గ్రామంలో చోటుచేసుకుంది. " ఏడేళ్ల క్రితం తీసుకున్న అప్పుకు ఇప్పటికే రూ. 18 లక్షలు కట్టాను. ఇంకా కట్టమని వేధిస్తున్నావు. నీవు వచ్చినప్పుడల్లా వేలకు వేలు ఖర్చు పెట్టలేను. నా చావుకు ప్రకాష్ రావు నీవే కారణం.. తనకు ఇవ్వాల్సిన డబ్బును స్వామి తన భార్యకు ఇవ్వూ" అంటూ అప్పుల ఊబిలో కూరుకుపోయిన అన్నపరెడ్డి నాగిరెడ్డి (30) అనే యువ రైతు కళ్ల నిండా నీళ్లతో చనిపోయే ముందు తన ఫోన్‌లో సెల్ఫీ వీడియోను రికార్డు చేసుకున్నాడు. ఈ వీడియోను రికార్డు చేసిన కాసేపటికే నాగిరెడ్డి తన పొలంలోనే పురుగుమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగిరెడ్డి ఏడేళ్ల క్రితం పత్తిపాడు మండలం బోయపాలెం గ్రామానికి చెందిన కళ్యాణితో కులాంతర వివాహం చేసుకున్నాడు. కారంపూడికి చెందిన పెళ్లిళ్ల బ్రోకర్ ప్రకాష్ రావు ఈ పెళ్లి సంబంధం కుదిర్చాడు. అదే సమయంలో నాగిరెడ్డికి కొంత సొమ్ము ప్రకాష్ రావు వడ్డీకి ఇచ్చాడు. అంతేకాకుండా, భార్య పిన్ని కొడుకు స్వామికి డబ్బు అవసరం ఉండటంతో అతనితో కూడా ప్రకాష్ రావు దగ్గరే అప్పు ఇప్పించాడు. ఈ అప్పులకు గ్యారెంటీగా నాగిరెడ్డికి చెందిన పొలం డాక్యుమెంట్లను ప్రకాష్ రావు తాకట్టు పెట్టుకున్నాడు. ఈ క్రమంలో రైతు నాగిరెడ్డికి ఉన్న నాలుగు ఎకరాల పొలంతో పాటు, మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసేవాడు. వచ్చిన ఆదాయంలో పెట్టుబడులు పోగా మిగిలిన డబ్బునంతా భార్యకు తెలియకుండా వడ్డీ వ్యాపారి ప్రకాష్ రావుకు చెల్లిస్తూ వచ్చాడు. ఈ ఏడాది మిరప పంట సాగు చేయగా సుమారు 200 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఆ మిరపకాయలను యార్డు లో విక్రయించగా వచ్చిన డబ్బును కూడా ప్రకాష్ రావుకే ఇచ్చినట్లు తెలిపారు.



# అభిషేక్‌ను క్షమించాను కల్యాణ్ బెనర్జీ యూటర్న్

**కోల్‌కతా, జూన్13:** అభిషేక్ కావాలో, తాను కావాలో తేల్చుకోవాలని మమతా బెనర్జీకి అల్టిమేటం జారీ చేసిన కల్యాణ్‌బెనర్జీ యూటర్న్ తీసుకున్నారు. అభిషేక్ విషయంలో మాట మార్చారు. అతడు తన కొడుకులాంటి వాడని కొడుకు తప్పు చేస్తే క్షమించే గుణం తండ్రికి ఉంటుందని పేర్కొన్నారు. అభిషేక్‌ను క్షమిస్తున్నట్లు తెలిపారు. ఎన్డీఏ అధికారంలోకి వచ్చాక బెంగాల్‌లో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. ప్రతిపక్షం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయే పరిస్థితిని బెంగాల్ ఎప్పుడూ ఎదుర్కోలేదన్నారు. టిఎంసిని వీడిన ఎంపిలపై కల్యాణ్ బెనర్జీ తీవ్ర విమర్శలు చేశారు. బిజెపి వేసిన ఎత్తుగడను అర్థం చేసుకోలేక వారంతా పార్టీని వీడారని ఇప్పుడు ఆ పార్టీ నేతల నీడలో బతకాల్సి వస్తుందని పేర్కొన్నారు. టిఎంసి, కాంగ్రెస్‌లో విలీనమవ్వనుందని వస్తున్న వార్తలను ఖండించారు. కల్యాణ్ బెనర్జీ అంతకు ముందు మీడియాతో మాట్లాడుతూ మమతకు అల్టిమేటం జారీ చేశారు. అభిషేక్ కావాలో, తాను కావాలో తేల్చుకోవాలన్నారు. అభిషేక్ వల్లే ఆ రోజు పార్టీ నాశనమైంది. అహంకారంతో ఆయన ప్రవర్తిస్తున్నారు. సీనియర్లకు గౌరవం ఇవ్వరు. నేను ఇప్పటికీ మమత వైపే ఉన్నాను. అయితే ఎవరు కావాలో దీదీ తేల్చుకోవాలి. అభిషేక్ వైపు ఉండాలని ఆమె నిర్ణయించుకుంటే నేను నా నిర్ణయంతీసుకుంటా అని స్పష్టం చేశారు. కలకత్తా హైకోర్టులో విచారణ జరుగుతున్న సంతకాల ఫోర్జరీ కేసులో తాను అభిషేక్ న్యాయవాదిగా ఉన్నానని, కానీ తనకు తెలియకుండా ఈ వ్యాజ్యంలో మరో పిటిషన్‌ను జూనియర్ లాయర్ వేశారని అన్నారు. ఇది తనకు అవమానకరమని బెనర్జీ అన్నారు.

# కార్మిక సంక్షేమంలో రాజీపడేది లేదు : తెలంగాణ డిప్యూటీ సిఎం భట్టి

## సింగరేణి సంస్థ తెలంగాణ ప్రజల ఆస్తి

**నస్పూర్, జూన్ 13, ప్రభాతవార్త** సింగరేణి కార్మికుల సంక్షేమంలో రాజీపడేది లేదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్ లో వైద్య పరంగా పనిచేయలేని సింగరేణి ఉద్యోగుల కుటుంబ సభ్యులకు నియామక పత్రాలు అందించే కార్యక్రమానికి రాష్ట్ర ఐ.టి., ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రాష్ట్ర షెడ్యూల్ తెగలు, గిరిజన, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అల్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల, బెల్లంపల్లి, భూపాలపల్లి, వైరా నియోజకవర్గాల



శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వినోద్, సత్యనారాయణ, మలోత్ రాందాస్ నాయక్, సింగరేణి కార్మిక సంఘాల ప్రతినిధులు వాసిరెడ్డి సీతారామయ్య, జనక్ ప్రసాద్, ప్రజా ప్రతినిధులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సంక్షేమంలో రాజీపడేది లేదని, సింగరేణి సంస్థ తెలంగాణ ప్రజల ఆస్తి అని, ప్రజాస్వామ్య రక్షణలో జాగరుకతతో ఉంటామని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయ పునరుద్ధరణ కొరకు 70 కోట్ల రూపాయలు, మినీ లిఫ్ట్ ఇరిగేషన్ కొరకు 74 కోట్ల 40 లక్షల రూపాయలతో పాటు వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. వైద్యపరంగా పనిచేయలేని సింగరేణి ఉద్యోగులకు సంబంధించిన 335 మంది అర్హత గల అభ్యర్థులకు నియామక పత్రాలు అందించడం జరుగుతుందని, భవిష్యత్తులో మరింత మంది అర్హులకు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సింగరేణి సంస్థను కాపాడుకుందాం అని, తెలంగాణ ఆస్తిగా తీర్చిదిద్దుదామని తెలిపారు. సింగరేణి కార్మికులకు 1 కోటి 25 లక్షల బీమా అందించడం జరుగుతుందని, 30 వేల మంది ఒప్పంద/పొరుగు సేవల సిబ్బందికి బోనస్ అందించామని తెలిపారు. కోల్ బ్లాక్స్ లలో పూర్తి నిఘా వ్యవస్థ మధ్యలో పని జరుగుతుందని, తెలంగాణ వనరులను కాపాడతామని తెలిపారు. కోల్ బెల్ట్ ప్రాంతంలోని శాసనసభ్యులతో మాట్లాడి కార్మిక సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం, సింగరేణి సంస్థ సమన్వయంతో సింగరేణి బొగ్గు గనులను మరింత అభివృద్ధి చేసి కార్మికుల సంక్షేమం దిశగా కృషి చేస్తామని తెలిపారు.

# తిరుమల పాతకాటేజీల పునరుద్ధరణ ఎప్పుడో? - ప్రతిపాదనలకే కాలం చెల్లుబాటు

**తిరుమల,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్య రెట్టింపవుతుండటం...వసతి సౌకర్యం తగినంతగా కల్పించలేకపోతుండటం పరిపాటిగా మారింది. కొన్ని పాతబడిన కాటేజీలు ఇప్పటికీ పున:నిర్మాణానికి నోచుకోవడంలేదు. ఉన్నవాటిని భక్తులకు సరైన వసతి కల్పించలేకపోతుండటం జరుగుతోంది. కొండపై ఆరుదశాబ్దాల క్రిందట అప్పటి అవసరాలకు తగ్గట్లు నిర్మించిన పలు కాటేజీలు, విశ్రాంతి గృహాలు ఇప్పుడు ఉపయోకరంగా లేకపోతున్నాయి. చాలావరకు వాటిల్లో కాలం చెల్లిపోవడం, పెచ్చులూడిపడి సీలింగ్‌లు ఊడిపోవడం, వర్షమొస్తే ధారాళంగా నీరు గదుల్లోకి చేరడం వంటి చేదు అనుభవాలు భక్తులు చవిచూస్తున్నారు. ఈ గదుల్లో నల్లులు, దోమలు, మంచాలు కూడా సరిగా లేకపోవడం అనే ఫిర్యాదులు భక్తుల నుండి వెల్లువెత్తుతున్నాయి. సామాన్యభక్తులకు వసతి కల్పించేందుకు వీలుగా ఎప్పుడోకొన్ని దశాబ్ధాల క్రిందట నిర్మితమైన కేంద్రీయ విచారణ కార్యాలయం(సిఆర్ఒ)కు సమీపంలోనే ఉన్న సుదర్శన్,గోవర్ధన్, కల్యాణి సత్రాలు,సి టైప్‌క్వార్టర్స్, పూర్తిగా పాతవి కావడం, గోడలు, గదులు పెచ్చులూడే దుస్థితికి చేరాయి. ఈ విశ్రాంతి గృహాలు, కాటేజీలు పూర్తిగా సామాన్యభక్తులకు అందుబాటులో ఉండేవే. ఎప్పుడో పాతకాలంనాటి అవసరాలకు తగ్గట్లు, అప్పటి ప్రణాళికల మేరకు నిర్మించడంతో భవనాల ఉనికి ఆందోళనకరంగా మారింది. ఇందులో 50రూపాయలు, 100 రూపాయలు అద్దెగదులు భక్తులకు కేటాయిస్తారు. ఇవన్నీ కూడా ఉపయోగకరంగా లేకపోవడంతో, భక్తుల నుండి వరుసగా ఫిర్యాదులు అందడంతో టిటిడి అధికారులు వీటిని ఆధునీక రించాలని నిర్ణయించారు. అంతేగాక ఈ ప్రాంతాల్లో యాత్రికులు వాహనాల్లో చేరుకున్నా పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉంది. కనీసం పార్కింగ్ అనేది లేకపోవడంతో యాత్రికులు రోడ్లపైనే వాహనాలు పార్కింగ్ చేసుకునే పరిస్థితి ఉంది. గదులు కూడా విశాలస్థలాలు లేవు. వీటిని ఆధునీకరించి కొత్తగా నిర్మించాలని గతంలోనే బోర్డు ప్రతిపాదనలు సిద్ధం చేసినా ఆచరణకు మాత్రం నోచుకోవడంలేదు.

# చిటికెలో చికెన్ స్నాక్స్

## చైనీస్ చికెన్ నూడుల్స్ ..



**కావలిసినవి :** బోన్‌లెస్ చికెన్: ముప్పావు కిలో, కార్న్‌ఫ్లోర్: ఒకటిన్నర టేబుల్ స్పూన్లు, ఉప్పు: ముపానవపుటీస్పూను, నూనె: 4 టేబుల్ స్పూన్లు, నూడుల్స్ పావుకిలో, వెల్లుల్లితురుము: టేబుల్ స్పూను, ఎండుమిర్చి: మూడు, కాలీఫ్లవర్ రెమ్మలు, కప్పు: క్యాప్సికమ్ ముక్కలు, అరకప్పు, జీడిపప్పు: అరకప్పు, సాస్‌కోసం: వినెగర్ : 2 టేబుల్‌స్పూన్లు, సోయాసాస్: టేబుల్‌స్పూను, చిల్లీసాస్: 3 టేబుల్‌స్పూన్లు, ఉప్పు: తగినంత.

**తయారు చేసే విధానం :** . జీడిపప్పుని వేయించి ఉంచాలి. తరవాత నీళ్ల వంపేసి చల్లని నీళ్లతో కడిగి పక్కన ఉంచాలి.

చికెన్ ముక్కల్ని కాసేపు ఆరనిచ్చాక వాటిమీద ఉప్పు,కార్న్‌ఫ్లోర్ చల్లాలి. బాణలిలో నూనె పోసి కాగాక కొంచెంకొంచెంగా చికెన్ ముక్కలు వేసి వేయించి తీయాలి. తరవాత మిగిలిన నూనె వంపేసి మూడు టేబుల్ స్పూన్లు మాత్రం ఉంచాలి. ఇప్పుడు అందులో వెల్లుల్లి తురుము, ఎండుమిర్చి వేసి వేగాక కాలీఫ్లవర్ రెమ్మలు, క్యాప్సికమ్ ముక్కలు వేసి వేయించాలి. తరవాత చికెన్ ముక్కలు వేసి, మూడు నాలుగు నిమిషాలు వేయించాక సాస్‌కోసం తీసుకున్నవన్నీ వేసి కలపాలి. ఇప్పుడు ఉడికించిన నూడుల్స్ వేసి బాగా కలపాలి. చివరగా వేయించిన జీడిపప్పు వేసి, ఇష్టమైతే కాస్త ఉల్లికాడల తురుము, నువ్వులు చల్లి దించాలి.

## పెప్పర్ చికెన్..



**కావలసినవి :** చికెన్ : అరకిలో, అల్లంఎవెల్లుల్లి: 3 టేబుల్‌స్పూన్లు, పసుపు: టీస్పూను, ఉప్పు: సరిపడా, ఉల్లిపాయ ముక్కలు: కప్పు, మిరియాల పొడి, ఒకటిన్నర టీస్పూన్లు, కారం- 4. టీస్పూన్లు, గరంమసాలా: టీస్పూను, కరివేపాకు: కట్ట, జీలకర్ర: అరటీస్పూను, యాలకులు: మూడు, దాల్చినచెక్క: అంగుళం ముక్క, లవంగాలు: నాలుగు, నూనె: 3 టేబుల్‌స్పూన్లు.

**తయారు చేసే విధానం :** చికెన్ ముక్కలకి కాస్త ఉప్పు, టేబుల్‌స్పూను అల్లంవెల్లుల్లి, పసుపు పట్టించి పక్కన ఉంచాలి. 2. నాన్‌స్టిక్ పాన్‌లో జీలకర్ర, దాల్చినచెక్క, లవంగాలు, యాలకులు వేసి వేయించాలి. తరవాత మిగిలిన అల్లంవెల్లుల్లి వేసి వేగాక ఉల్లిముక్కలు, ఉప్పు వేసి వేయించాలి. కారం, గరంమసాలా, కచ్చాపచ్చాగా దంచిన మిరియాలపొడి వేసి నూనె బయటకు వచ్చేవరకూ వేయించాలి. ఇప్పుడు చికెన్ ముక్కలు కూడా మరో నాలుగు నిమిషాలు వేయించి, మూతపెట్టి ముక్క పూర్తిగా ఉడికేవరకూ ఉంచి దించాలి.

## చికెన్ పాప్‌కార్న్ . . .



**కావలసినవి :** చికెన్‌ముక్కలు: పావుకిలో, కార్న్‌ఫ్లోర్: 2 టేబుల్‌స్పూన్లు, గుడ్డు: ఒకటి, బ్రెడ్ పొడి: కప్పు, ఉప్పు: తగినంత, అల్లంవెల్లుల్లి: టేబుల్‌స్పూను, మిరియాలపొడి: పావుటీస్పూను, కారం: 2 టీస్పూన్లు, గరంమసాలా: టీస్పూను, నూనె : వేయించడానికి సరిపడా.

**తయారుచేసే విధానం :..** ఓ గిన్నెలో కారం, మిరియాలపొడి, అల్లంవెల్లుల్లి, మసాలా పొడి, ఉప్పు వేసి కలపాలి. ○ చికెన్‌ని చిన్న చిన్న ముక్కలుగా కోయాలి. వీటిమీద కారం మిశ్రమం చల్లి ముక్కలకి పట్టేలా బాగా కలపాలి. తరవాత కార్న్‌ఫ్లోర్ కూడా వేసి కలపాలి. ఇప్పుడూ విడిగా ఓ గిన్నెలో గుడ్డు తెల్లసొన, మరో గిన్నెలో బ్రెడ్ పొడి వేయాలి. ఒక్కోముక్కనీ తెల్లసొనలో ముంచి బ్రెడ్‌పొడిలో దొర్లించి తీయాలి. ఇలాగే అన్నీ చేయాలి. ముక్కలు బాగాకరకరలాడాలంటే మరోసారి గుడ్డుసొనలో ముంచి బ్రెడ్ పొడి అద్దాలి. వీటిని ఓ పావుగంటసేపు పక్కన ఉంచాలి. బాణలిలో నూనె వేసికాగాక కొంచెం కొంచెంగా చికెన్ ముక్కలు వేసి వేయించి తీయాలి.

## చికెన్ 65..



**కావలసినవి :** బోన్‌లెస్ చికెన్: పావుకిలో, అల్లం తురుము : టీస్పూను, వెల్లుల్లితురుము : టీస్పూను, నిమ్మరసం : టేబుల్‌స్పూను, పెరుగు: టేబుల్‌స్పూను, గుడ్డు: ఒకటి, కరివేపాకు: 4, రెబ్బలు, పసుపు : చిటికెడు, మిరియాలపొడి: అరటీస్పూను, ఉప్పు: తగినంత, బియ్యప్పిండి : 2, టేబుల్‌స్పూన్లు, జీలకర్ర: టీస్పూను, వెల్లుల్లి: టీస్పూను, పచ్చిమిర్చి : రెండు, కారం : టీస్పూను, పెరుగు: 2, టేబుల్‌స్పూన్లు: నూనె : వేయించడానికి సరిపడా.

**తయారు చేసే విధానం :** గిన్నెలో అల్లం వెల్లుల్లి తురుము, నిమ్మరసం, పెరుగు, గుడ్డసొన పసుపు, మిరియాలపొడి, ఉప్పు: బియ్యపినపండి అనీనన వేసి కలపాలి.ఈ మిశ్రమాన్ని చికెన్ ముక్కలకు పట్టించి కనీసం ఓ గంట సేపు నాననివ్వాలి. బాణలిలో నూనె వేసి కాగాక, చికెన్ ముక్కల్ని వేయించి తీయాలి.తరవాత అందులోని నూనెని వంపేసి ఓ రెండు టేబుల్‌స్పూన్లు మాత్రం ఉంచి, జీలకర్ర, వెల్లుల్లి తురుము, సన్నగా తరిగిన పచ్చిమర్చి కరివేపాకు వేసి వేయించాలి. ఇప్పుడు కారం, పెరుగు కూడా వేసి కలిపి ఓ నిమిషం తరవాత వేయించిన చికెన్ ముక్కల్ని వేసి మీడియం వంట మీద ఓ రెండు నిమిషాలు ఉంచి

## ఫేస్ మసాజ్ మంచిదే !

ముఖం మీద స్క్రబ్ రాసుకోవటం మంచిదే. దీనివల్ల మృత కణాలు తొలగిపోతాయి. ముఖ్యంగా దుమ్ము, ధూళి కారణంగా ముఖం మీద అట్టకట్టినట్లుంది. దీని వల్ల సిబం ఉత్పత్తి అయి చర్మం జిడ్డుగా మారి రకరకాల సమస్యలు వస్తాయి. అందుకే స్క్రబర్స్‌తో ముఖాం రుద్దుకోవాలి. స్క్రబ్ చేసే ముందు కచ్చితంగా ముఖాన్ని గోరు వెచ్చటి నీటితో కడిగే యాలి. ఆ తర్వాత మెత్తని టవల్‌లో తుడుచుకోవాలి. ఇలా స్మూత్‌గా ఉన్నప్పుడే స్క్రబ్ చేసుకోవాల్సి ఉంటుంది. బొప్పాయి స్క్రబ్, గ్రీన్ టీ స్క్రబ్, కోకనెట్-నిమ్మ స్క్రబ్, కుకుంబర్ మింట్ స్క్రబ్. లాంటి చల్లని స్క్రబ్స్ మాత్రమే ముఖం మీద అప్లై చేయాలి. ఇలా చేయటం వల్ల చర్మం చల్లగా ఉంటుంది. స్క్రబర్స్‌తో మరీ గట్టిగా చర్మాన్ని రుద్దకూడదు. దీనివల్ల చర్మం ఎర్రగా కందిపోతుంది. మరిన్ని చర్మ సమస్యలు వస్తాయి. మొత్తానికి ముఖ చర్మం బట్టి స్క్రబర్స్ ఎంపిక చేసుకోవాలి. ముఖ చర్మం మీద మసాజ్‌లా మెల్లగారుద్దాలి. దీని వల్ల రక్తప్రసరణ సాఫీగా జరుగుతుంది. □

# ఈ మౌనం .. ఎందుకనో !



**కొంత మంది అమ్మాయలు ఆకస్మాత్తుగా మాట్లాడటం తగ్గిస్తారు. పలకరించినా కూడా సరైన సమాధాన మివ్వకుండా నిత్యం ఏదో కోల్పోయినట్లు ఉండటం చూసి తల్లిగా ఏం చేయాలో తెలియడం లేదు. ఇటువంటప్పుడు పిల్లలను సాధారణ స్థితికెలా తీసుకురావాలో తెలుసుకుందాం..**

పిల్లలు ఎదుగుతున్నప్పుడు పలురకాల భావోద్వేగాలకు గురవుతుంటారు. చదువులో అనుకున్న ర్యాంకు సాధించలేకపోవడం, ఇంట్లోవాళ్లు అడిగింది ఇవ్వకపోవడం లేదా చుట్టూ చూస్తున్న సంఘటనలకు ప్రభావితమవుతుంటారు. అటు వంటివి ఏవైనా కావొచ్చు. ఇటువంటి సందర్భాల్లో మౌనాన్ని వారెక్కువగా ఆశ్రయిస్తారు.

అలాగే ఏదో కోల్పోయిన భావన వాళ్లలో కనిపిస్తుంది. ఈ మార్పును అమ్మానాన్నలు దగ్గరగా గమనిస్తారు కనుక గుర్తిస్తారు. వాళ్ల నెమ్మదిగా పిల్లల మనసు తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. ప్రేమగా దగ్గరకు తీసుకుని సముదాయించి భరోసానివ్వాలి. వాళ్ల మనసులోని మాటను బయటకు చెప్పే ధైర్యాన్ని ఇవ్వగలగాలి తప్పితే అలా చేసావేమిటి, ఇలా ఎందుకు జరిగింది అంటూ ఏదోదో మాటలతో విసిగించకూడదు. నిందించకూడదు.. ఏదైనా పొరపాటు జరిగినా, మార్కులు తగ్గినా, అనుకున్న సీటు సంపాదించలేక పోయినా.. పిల్లలనునిందిస్తే వాళ్ల మనసులో ఏముంటోందో బయటకు చెప్పలేరు అలాంటి సమయంలో ఒక వ్యతిరేక మాట వచ్చినా భరించలేరు. దాని పర్యవసానం ఎలాగైనా ఉండొచ్చు. మాటలతో గాయపరచకూడదు. అప్పటికే వారెంతో ఆందోళన చెందుతుంటారు. అటువంటి సమయంలో వారికి వేదన కలిగిస్తే కుంగుబాటుకు దారితీసే ప్రమాదం లేకపోలేదు. అలా కాకుండా మరోసారి ప్రయత్నిస్తే అనుకున్నది సాధించగలమనే ధైర్యాన్నిస్తే మంచిది. ప్రతి చిన్న విషయాన్ని ప్రతికూలతగా ఆలోచించకుండా సానుకూల ధోరణి అలవడేలా చేయాలి. అప్పుడే వారిలో తిరిగి మరోసారి కృషి చేద్దామనే ఆలోచన మొదలవుతుంది. ఇలా చేస్తే వారిలో ఆత్మన్యూనతే ఉండదు.

అలాగే చేద్దామా! మరి! □

**అంతర్వాణి**

# పరోపకార ఫలం



ముగ్గురు వ్యక్తులు హిమాలయాల గుండా నడుస్తున్నారు. సన్ని, ముంజల్, సంజు వీరి పేర్లు. చల్లటిమంచులో గజగజ వణికిపోతూనే నడుస్తున్నారు. చాలాదూరం నడిచాక వారిలో సన్ని అనే వ్యక్తి విపరీతమైన చలికి తట్టుకోలేక చనిపోయాడు. ఇప్పుడు ముంజల్, సంజు మాత్రమే మిగిలిపోయారు. వారిలో సంజు 'అయ్యో! మన మిత్రుడు మరణించాడు.. మృతదేహాన్ని మనం మోసుకుని వెళ్లామని' అంటూ ముంజల్ని కోరాడు. అందుకు ముంజల్ 'వద్దు, మనం అతడి బరువును మోస్తూ నడవలేం, నేను అయితే ఆ డెడాబాడీని ముట్టలేను' అన్నాడు. 'సర్లే నువ్వు సాయం చేయక పోయినా పర్వాలేదు, నేనే మోస్తాను' అంటూ సంజు చనిపోయిన సన్ని మృతదేహాన్ని భుజంపై వేసుకుని నడవసాగాడు. ఇలా కొంతదూరం నడిచాక, ముంజల్ కూడా చలికి తట్టుకోలేక చనిపోయాడు. ఇద్దరి మృతదేహాలను మోయలేక, సంజుకేవలం సన్ని మృతదేహాన్ని మోస్తూ ముంజల్ని అక్కడే వదిలేసి, నడవసాగాడు. చివరికి సన్ని సురక్షితంగా తన గమ్యస్థానానికి చేరుకున్నాడు.

ఆ వ్యక్తి ఎందువల్ల బతికిపోయాడు? చలిని తట్టుకునే సామర్థం ఉండడం వల్ల కాదు.. శవాన్ని మోయడం వల్ల ఇతడి దేహం, మృతదేహం రెండు కలవడంతో సన్ని దేహానికి కావాల్సినంత వేడి అందసాగింది. ఆ వేడే చలిని నుంచి రక్షించ గల్గింది. తద్వారా సన్ని బతికి బట్టకట్టాడు. చాలాసార్లు ఇతరులకు సాయం చేసేందుకు మనం వెనుకడు వేస్తుంటాం. కానీ ఆ సాయమే కొన్నిసార్లు మనం ఊహించలేని మేలు చేస్తుంది. 'నిన్నడుగు ప్రతివానికిని ఇమ్ము' (లూకా 6:30), 'మీ శత్రువులను ప్రేమించుడి, మిమ్మును హింసించు వారికొరకు ప్రార్థన చేయుడి' (మత్తయి 5:44) ) 'నీళ్ల పోయువారికినీళ్లు పోయబడును' (సామెతలు 11:25). ఇతరులకు మనం ఎంత మేలు చేస్తే మనకు అంతమంచిది. ఆ మంచితనం ఆశీర్వాదం మనపైన మాత్రమే కాదు.. మన పిల్లలపై కూడా ఉంటుంది. కాబట్టి సాధ్యమైనంతవరకు ఇతరులకు సాయం, మేలు

**- పి.వాణిపుష్ప**



# 'ఓ..! సుకుమారి' : టీజర్ లాంచ్



యంగ్ ట్యాలెంట్ తిరువీర్, వెర్సటైల్ ఐశ్వర్య రాజేష్ తొలిసారిగా ఓ..! సుకుమారి అనే గ్రామీణ నేపథ్యంలో సాగే రొమాంటిక్ కామెడీ చిత్రంలో కలిసి నటిస్తున్నారు. ఈ సినిమాతో భరత్ దర్శన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విమర్శకుల ప్రశంసలు పొందిన 'శివం భజే' చిత్రాన్ని నిర్మించిన గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మహేశ్వర రెడ్డి మూలి దీనిని నిర్మిస్తున్నారు. స్థానిక రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటూ, మంచి మనసున్న అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని కలలు కంటుంటాడు తిరువీర్ . అలాంటి సమయంలో దామిని అనే అమ్మాయిని చూసిన వెంటనే ఆమెనే తన జీవిత భాగస్వామిగా భావించి పెళ్లి ఏర్పాట్లు మొదలుపెడతాడు. దర్శకుడు భరత్ ధర్షన్ గ్రామీణ వాతావరణం, స్థానిక రాజకీయాలు, వినూత్నమైన ట్విస్ట్‌ను తో వినోదభరితమైన కథను తెరకెక్కించారు. గ్రామీణ నేపథ్యాన్ని సినిమాటో గ్రాఫర్ సీహెచ్ కుషేందర్ అందమైన విజువల్స్‌తో ఆకట్టుకునేలా చూపించారు. భరత్ మంచిరాజు అందించిన సంగీతం టీజర్‌కు ఉత్సాహభరితమైన అనుభూతిని తీసుకొచ్చింది. బలగం ఫేమ్ తిరుమల ఎం. తిరుపతి ఆర్ట్ డైరెక్టర్‌గా, క ఫేమ్ శ్రీ వరప్రసాద్ ఎడిటర్‌గా, స్వయంభు ఫేమ్ అను రెడ్డి అక్కటి కాస్ట్యూమ్ డిజైనర్‌గా పని చేస్తున్నారు. పూర్ణాచారి పాటలు రాశారు.టీజర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో తిరు వీర్ మాట్లాడుతూ.. ముందుగా మా నిర్మాత మహేశ్వర్ రెడ్డి గారికి థాంక్యూ. ఈ సినిమానే మమ్మల్ని ఎంచుకుందని నేను భావిస్తున్నాను. మసూద సినిమాను పిల్లలు, ఫ్యామిలీలు ఎంతగానో ఎంజాయ్ చేశారు. ఫ్యామిలీస్, పిల్లలు కలిసి చూసిన సినిమా చాలాకాలం గుర్తుండి పోతుంది.హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ మాట్లాడుతూ. సంక్రాంతికి వస్తున్నాం తర్వాత మిమ్మల్ని మళ్లీ కలవడం చాలా ఆనందంగా ఉంది. ఆ సినిమా హిట్ అయిన తర్వాత నేను సైన్ చేసిన మొదటి సినిమా ఇదే. మహేశ్వర్ రెడ్డి ఒఅద్భుతమైన నిర్మాత. దర్శకుడు ఈ కథ చెప్పినప్పుడు నాకు చాలా నచ్చింది.

# 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' పెద్ద హిట్ కావాలి: వి. వి. వినాయక్..



వడ్డే జిష్ణు సమర్పణలో వడ్డే క్రియేషన్స్ బ్యానర్ మీద వడ్డే నవీన్ హీరోగా, నిర్మాతగా రూపొందిం చిన చిత్రం ట్రాన్స్ ఫర్ త్రిమూర్తులు. కమల్ తేజ నార్ల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ సినిమాలో వడ్డే నవీన్, రాశి సింగ్, శిల్పా తులస్కర్, వివేక్ రఘువంశీ, రఘుబాబు, శివన్నారాయణ, వడ్లమాని శ్రీనివాస్, జ్వాలా కోటి, దేవి ప్రసాద్, సూర్య, బాబా బాస్కర్, ప్రమోదిని, సాత్విక్ రాజు, అంజలి ప్రియ, గాయత్రి చాగంటి తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈ మూవీని జూన్ 19న విడుదల చేయనున్నారు. . ఈ మేరకు నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్ ముఖ్య అతిథిగా విచ్చేసి ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో.. ..వి.వి. వినాయక్ మాట్లాడుతూ.. 'వడ్డే నవీన్' ఈ కార్యక్రమానికి నన్ను పిలిచి నందుకు థాంక్స్. నేను ఆయన చిత్రానికి అసిస్టెంట్, కో డైరెక్టర్‌గా పని చేశాను. నవీన్ గారితో సినిమా చేస్తున్న టైంలోనే 'ఆది'కి నాంది పలికినట్టు అయింది. నవీన్ నన్నెంతో ఇష్టంగా చూసుకునే వారు. వడ్డే నవీన్ మాట్లాడుతూ.. .. వినయ్ అప్పుడూ, ఇప్పుడూ వినయంగానే ఉన్నారు. ఆయన జర్నీ నాకెంతో గర్వంగా అనిపిస్తుంది. మా కోసం వచ్చిన వినయ్‌కి థాంక్స్. సినిమా కోసం టీం అంతా ఇష్టపడి చేశారు. ఈ పదేళ్లలో టెక్నికల్ పరంగా ఎన్నో మార్పులు వచ్చాయి. ఈ మూవీలో కోర్ట్ డ్రామాతో పాటు సస్పెన్స్ బాగుంటుంది. ఏ ఫ్రైడే అయినా కూడా సింగిల్‌గా సినిమా రాలేదు. ఒకరితో పోటీ అని కాదు..

# కుటుంబ కథ చిత్రం 'కొత్త మలుపు'

ప్రముఖ గాయని సునీత కుమారుడు ఆకాష్ గోపరాజు హీరోగా నటించిన రెండో చిత్రం 'కొత్త మలుపు' . దర్శకుడు శివ వరప్రసాద్ కేశనకుర్తి తెరకెక్కించిన ఈ చిత్రం కోనసీమ నేపథ్యంలో రొమాంటిక్ లవ్ అండ్ సస్పెన్స్ పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. తాజాగా (జూన్ 12న) థియేటర్‌లలో విడుదలైంది. ప్రేమలో అపార్థాలకు చెక్ పెడుతూ... మనసులను తాకే ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్ అని చిత్ర యూనిట్ చెప్పినట్టే ఈ సినిమా ఉందా? ఈ మూవీ రివ్యూ తెలుసు కుందాం. జీవితాన్ని ఎంజాయ్ చేయడమే లక్ష్యంగా పెట్టుకుని స్నేహితులతో కలిసి హైదరా బాద్‌లో హ్యాపీగా గడిపే యువకుడు కమల్ (ఆకాష్). ఓ కుటుంబ వివాహ వేడుక కోసం తూర్పు గోదావరి జిల్లా లోని అందమైన గ్రామానికి వెళ్తాడు. అక్కడ వరలక్ష్మి (భైరవి ఆర్యా) అనే గ్రామీణ యువతిని చూసి ఆకరి తుడవుతాడు. ఒక రాత్రి అనుకోని పరిస్థితుల్లో అవమానకర స్థితిలో చిక్కుకున్న కమల్‌ను ఓ యువతి కాపాడు తుంది. అయితే ఆమె ఎవరో తెలియదు. తనను ఆదుకున్న ఆ అమ్మాయి కోసం కమల్ చేసే అన్వేషణలో వరలక్ష్మి అతనికి తోడుగా నిలుస్తుంది. ఈ ప్రయాణం లో ఇద్దరి మధ్య ప్రేమ మొలకెత్తు తుంది. అయితే, తాను వెతుకుతున్న అమ్మాయి వరలక్ష్మినేనని తెలుసుకునే లోపే, ఆమె మరో యువకుడితో ఉన్న ఫోటో కమల్ చేతికి చిక్కు తుంది. దాంతో ప్రేమలో అనుమానాలు, అపార్థాలు చోటు చేసుకుం టాయి. ఆ యువకుడు ఎవరు? వరలక్ష్మికి అతనితో సంబంధం ఏమిటి? ఈ అపార్థాల మధ్య కమల్‌వరలక్ష్మి ప్రేమ ఎలాంటి పరీక్షలు ఎదుర్కొంది? చివరికి వారి ప్రేమ గెలిచిందా లేదా? అనేదే 'కొత్త మలుపు' కథ.ప్రేమ, అపార్థాలు, నమ్మకం, గతంవర్తమానం మధ్య జరిగే భావోద్వేగ సంఘర్షణను దర్శకుడు శివ కేసనకుర్తి చక్కగా తెరపై ఆవిష్కరించారు. గ్రామీణ నేపథ్యంలో సాగే కథకు గోదావరి ప్రాంతం అందాలను ఆహ్లాదకరమైన అనుభూతిని అందిం చారు. పెళ్లి సందడి, స్నేహితుల సరదా సంభాషణలు, హీరో హీరోయిన్ల మధ్య నడిచే సన్నివేశాలు ప్రేక్షకులను కథలోకి తీసుకెళ్తాయి.



ముఖ్యంగా మొదటి భాగంలో వచ్చే కామెడీ ఎపిసోడ్స్, గోదావరి ప్రాంతానికి ప్రత్యేకమైన హాస్య శైలి మంచి వినోదాన్ని అందిస్తాయి .రెండో భాగంలో కథ భావోద్వేగాల వైపు మలుపు తిరుగుతుంది. ప్రేమలో అనుమానం ఎంత ప్రమాదకరమో, ఒకరి గతాన్ని పట్టుకుని తీర్పు చెప్పడం ఎంత తప్పో చెప్పే ప్రయత్నం చేశారు. "ప్రతి ఒక్కరికీ ఒక గతం ఉంటుంది. కానీ మన జీవితంలోకి వచ్చిన వ్యక్తి వర్తమానాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం. గతాన్ని తవ్వుకుంటూ భవి ష్యత్తును పాడు చేసుకోవద్దు" అనే భావాన్ని దర్శకుడు హృద్యంగా చెప్పగలిగారు.జానర్: రొమాంటిక్ కామెడీ - ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ నటీనటులు: ఆకాష్, భైరవి ఆర్యా, రఘుబాబు, పృథ్వీ, ప్రభావతి, సిద్ధు, మహేందర్, ఐశ్వర్య తదితరులు దర్శకత్వం: శివ కేసనకుర్తినిర్మాత: తాటి బాలకృష్ణ బ్యానర్: తథాస్తు క్రియేషన్స్‌సంగీతం: యశ్వంత్ నాగ్‌ఛాయాగ్రహణం: సుమంత్ కచర్ల. నిర్మాణ విలువలు:తథాస్తు క్రియేషన్స్ నిర్మాణ విలువలు కథకు తగిన స్థాయిలో ఉన్నాయి. ప్లస్ పాయింట్స్: గోదావరి ప్రాంతం అందాలు, విజువల్స్ ఆకాష్ - భైరవి మధ్య కెమిస్ట్రీ రఘుబాబు, పృథ్వీ కామెడీకుటుంబ

# 'రావు బహదూర్' నెవర్ బిఫోర్ 'నాట్ ఎ టీజర్' లాంచ్



జిఎంబి ఎంటర్‌టైన్‌మెంట్ ప్రజెంట్స్, సత్యదేవ్, వెంకటేష్ మహా, ఏ+ఎస్ మూవీస్ శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఖిరావు బహదూర్‌ఖి నెవర్ బిఫోర్ 'నాట్ ఎ టీజర్' లాంచ్‌సూపర్ స్టార్ మహేష్ బాబు, నమ్రతా శిరోద్కర్ జిఎంబి ఎంటర్‌టైన్‌మెంట్, ప్రముఖ దర్శకుడు వెంకటేష్ మహా దర్శకత్వం లో, వెర్సటైల్ యాక్టర్ సత్యదేవ్ కథానాయకుడిగా నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ సైకాలజికల్ థ్రిల్లర్ ఖిరావు బహదూర్‌ఖి చిత్రాన్ని సగర్వంగా సమర్పిస్తున్నారు. వెంకటేష్ మహా ఈ చిత్రానికి దర్శకత్వం వహించడమే కాకుండా కథ, ఎడిటింగ్ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. మూడు నిమిషాల పది సెకన్ల నిడివి గల ఈ వీడియో, కథానాయకుడి విచిత్రమైన, రహస్యాలతో నిండిన ప్రపంచంలోకి ప్రేక్షకులను తీసుకెళ్తుంది. జీవిత చరమాంకంలో ఉన్న వ్యక్తి.. ప్రాణాంతకమైన లివర్ క్యాన్సర్‌తో బాధపడుతూ, మరణం నీడలో జీవిసున్నప్పటికీ, వైద్యుల అంచనాలను తలకిందులు చేస్తూ అతడు బతికే పోరాటాన్ని కొనసాగిస్తాడు. ఆ ప్రయాణం ఒక అద్భుతంగా మారుతుంది. ఈ వీడియోలో సత్యదేవ్ చేసిన అద్భుతమైన ట్రాన్స్ ఫర్మేషన్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. క్లిష్టమైన పాత్రల్లో పూర్తిగా లీనమయ్యే నటుడిగా పేరున్న సత్యదేవ్, ఈ పాత్రలో అద్భుతమైన నటన కనబరిచారు. వాస్తవం, భ్రమల మధ్య చిక్కుకుని ఒంటరితనం, అంతర్మథనం, భావోద్వేగాలతో సతమతమయ్యే వ్యక్తిగా ఆయన నటన ఆకట్టుకుం టుంది. సత్యదేవ్ సరసన దీపా థామస్ కథానాయికగా కనిపించగా, వికాస్ ముప్పాల, బాల పరాసర్, ఆనంద్ భారతి, ప్రణయ్ వాకా, మాస్టర్ కిరణ్ కీలక పాత్రలు పోషించారు .సాంకేతికంగా ఈ చిత్రం అత్యున్నత ప్రమాణాలతో రూపొందుతోంది.

# టెలివిజన్ అండ్ ఓటిటి ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఆఫ్ సౌత్(టాపోక్స్) ఏర్పాటు



గత రెండేళ్లుగా తెలుగు, తమిళ, కన్నడ, మళయాల టెలివిజన్ నిర్మాతలతో ఎన్నోసార్లు చర్చించి, చివరగా జనవరి 2026లో చెన్నైలో అన్ని ఆర్గనైజేషన్స్ కలిసి మీటింగ్ నిర్వహించుకుని టెలివిజన్ అండ్ ఓటిటి ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఆఫ్ సౌత్(టాపోక్స్)ను ప్రక్రియలు రిజిస్ట్రేషన్, బైలాఏర్పాటు చేశారు. . మరి ఈ సందర్భంగా టాపోక్స్ అధ్యక్షుడు ఏ ప్రసాద్ రావు మాట్లాడుతూ.. పాత్రికేయ మిత్రులందరికీ నమస్కారం. ఈ సంవత్సరం సౌత్ ఇండియన్ టెలివిజన్ అండ్ ఓటిటి పరిశ్రమ గుర్తించుకోదగిన చారిత్రాత్మకమైన దినంగా మేం పరిగణిస్తున్నాం. ఇది 15యేళ్లు పూర్తి చేసుకుంది. అయితే టాపోక్స్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేయడానికి మూలం తెలుగు టెలివిజన్ ప్రొడ్యూసర్ కౌన్సిల్ గత 15యేళ్లుగా దానికి సాధించిన విజయాలు. ఒక నిర్మాణాత్మకమైన, గొప్ప ఐక్యత కలిగిన ఒక కౌన్సిల్ గా డెవలప్ కావడం.. తెలుగు టెలివిజన్ ఇండస్ట్రీ ఫెటర్నిటీకి ఎనలేని సేవలు అందించే స్థాయికి చేరుకుంది. తెలుగు టివి పరిశ్రమకు, నిర్మాతలు, నటీనటులు, సాంకేతిక నిపుణులు, కార్మికులు అందరికీ పెద్ద దిక్కుగా తెలుగు కౌన్సిల్ నిలబడింది. ఈ ప్రాసెస్ లో ఓ మూడేళ్ల నుంచి ఇంటర్ స్టేట్ ప్రొడక్షన్స్ బాగా పెరిగాయి. . దీనికి రిజిస్ట్రేషన్ చేయడం కోసం చాలా కష్టపడ్డాం. మాకు దీనికి ఏ గైడ్ లైన్స్ లేదు. సౌత్ ఇండియన్ టెలివిజన్ అండ్ ఓటిటి ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ కు ఒక చట్ట ప్రకారం తయారు చేయడానికి మార్గదర్శకమైన గైడ్ లైన్స్ లేదు. మా నుంచి ప్రతి సమస్య, ప్రతి కార్యక్రమాన్ని విశ్లేషించుకుని.. దాని నుంచి కార్యాచరణ రూపొందించుకుంటూ ప్రతి సమస్యను సునిశితంగా పరిశీలించి అనేక చర్చల తర్వాత ఒక బై లా తయారు చేసుకోవడం జరిగింది. ప్రభుత్వాలను కూడా రిప్రజెంట్ చేస్తూ.. సౌత్ ఇండియన్ టివి, ఓటిటి ఇండస్ట్రీ పర్ఫెక్ట్ గా, ప్రొడక్టివ్ గా నడవడానికి కోసం గైడ్ లైన్స్ ఇవ్వడం అనేది మా టాపోక్సం ప్రధాన ఉద్దేశ్యం. . తెలుగు నిర్మాతల మండలి ఆధ్వర్యంలో కరోనా టైమ్ లో 4.5 కోట్లకు పైగా కార్మికులకు ఇబ్బంది లేకండా చూసుకున్నాం. .

# 'ఇల్లు' ప్రమోషన్స్‌లో గెస్ట్ గా పాల్గొన్న రాహుల్ రవీంద్రన్

.ఆర్టిస్ట్‌గా వచ్చిన నేను రామానాయుడుని, రామోజీని చూసి ఆదర్శంగా తీసుకుని ప్రొడక్షన్ లోకి అడుగుపెట్టాను ఇల్లు నిర్మాత కిషోర్ మారిశెట్టి..మనోహర ఆర్ట్స్, ఈటీవీ విన్ సంయుక్తంగా సమర్పిస్తూ కిషోర్ మారిశెట్టి నిర్మాతగా రోహిత్, శశి దర్శకత్వంలో ఈటీవీ విన్ ద్వారా ప్రేక్షకుల ముందుకు రానున్న కథ సుధ చిత్రం ఇల్లు. వివేక్ సాగర్ సంగీతాన్ని అందించిన ఈ కథ సుధకు శశాంక్ రాఘవుల సినిమాటోగ్రఫీ చేయగా అవంతి రుయా ఎడిటింగ్ చేశారు. హర్షవర్ధన్, బిందు చంద్రమోళి ప్రముఖ పాత్రలో కనిపించిన చిత్రంలో అనీష్ కురువిల్ల, పవన్ రమేష్, క్యాంప్ శశి తదితరులు కీలకపాత్రలు పోషించారు. రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ... "ఒక సాధారణ కథను సహజ సిద్ధంగా అదేవిధంగా చాలా అందంగా ప్రేక్షకులు ముందుకు తీసుకుని రావడం అనేది ఎంతో క్లిష్టమైన విషయం. జూన్ 14 నుండి స్ట్రీమింగ్ కానున్న ఇల్లు మీ మనసులో ఎంతో ప్రశాంతతను తెలుపుతుంది" అన్నారు.నటి బిందు చంద్రమోళి మాట్లాడుతూ... "నాకు ఈ చిత్ర దర్శకులు రోహిత్, శశిలు ఎంతో కాలం నుండి తెలుసు. నాకు ఇల్లులో నటిం చేందుకు అవకాశం ఇచ్చిన వారి ఇద్దరికీ ధన్యవాదాలు అనుకుంటు న్నాను. నటుడు అనీష్ కురువిల్ల మాట్లా డుతూ... "నాకు దర్శకులు శశి, రోహిత్ ఎంతో కాలం నుండి తెలుసు. వారి కష్టాన్ని, వారి ఆలోచనలను నేను గమనించాను. ఇటువంటి ప్రతిభ ఉన్న వారిని ఎంకరేజ్ చేసినందుకు ఈటీవీ విన్ వారికి థ్యాంక్స్.

